కిషన్‌చందర్ రచనలు–1
రూ॥ 200/-
పేజీలు: 220


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

రాహుల్‌గాంధీ ఆరోపణలపై ఇసి డొంకతిరుగుడు

11ఏళ్లు, 33 తప్పిదాలు

పహల్గామ్‌పై పార్లమెంటులో పూర్తిస్థాయిచర్చకు ఇప్పుడైనా అంగీకరిస్తారా?

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 192 | గురువారం | 12 -06-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## కొత్త మంత్రుల శాఖలు ఇవే

ప్రజాపక్షం / హైదరాబాద్

ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న కొత్త మంత్రులకు శాఖలను కేటాయించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్వరువులు జారీ అయ్యాయి. మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉద్యోగ, శిక్షణ,ఫ్యాక్టరీలు, గనులు, భూగర్భ గనుల శాఖలు, మంత్రి వాకిటి శ్రీహరికి పశుసంవర్థక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖలు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్‌సి, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖలతో పాటు, దివ్యాంగుల సాధికారత, సీనియర్ సిటిజన్, ట్రాన్స్‌జెండర్ విభాగాలను కేటాయించారు.

## ‘చక్రబంధం’లో ప్రభాకర్‌రావు..!

సాక్ష్యాలను ముందు పెట్టి విచారించిన సిట్ అధికారులు

బిఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలతో సంబంధాలపై ఆరా

9 గంటల పాటు సాగిన విచారణ

ముగిసిన రెండోసారి విచారణ

14న మరోసారి రమ్మన్న సిట్ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ–1 నిందితుడైన ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు మెడకు ఉచ్చు బిగిస్తుంది. రోడోసారి విచారించిన సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు చక్రబంధం వేశారు. సిట్ అధికారులు తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలు, డాక్యుమెంట్లు, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు, ఫోన్ కాల్ డేటాను ప్రభాకర్‌రావు ముందు పెట్టి విచారించారు. బిఆర్‌ఎస్ నేతలతో ఉన్న తరువాయి 2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు డాక్యుమెంట్లు
# రెండు రోజుల్లో బయటపెడతా

- తెలంగాణకు కెసిఆర్ కుటుంబ సభ్యులే ప్రధాన శత్రువులు
- నేనున్నంతవరకూ కాంగ్రెస్‌లో నో ఎంట్రీ
- అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా గ్యాంగ్ మాదిరిగా బిఆర్‌ఎస్ నేతల పంచాయితీ
- రాష్ట్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు
- ఢిల్లీలో జర్నలిస్టులతో ‘ఇష్టాగోష్ఠి’లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- బుధవారం సాయంత్రం హైదరాబాద్ వచ్చిన సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను బయట పెడతానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహించి కాళేశ్వరం డాక్యుమెంట్లు బహిర్గతం చేస్తానన్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు ప్రధాన శత్రువులని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అన్ని విషయాలలో కేంద్రంలో అడ్డుపడుతున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డేనన్నారు. మూడు రోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం బుధవారం సాయంత్రం తన పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్నారు. అంతకు ముందు ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి ‘ఇష్టాగోష్ఠి’గా మాట్లాడారు. కెసిఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులని సిఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాను ఉన్నంత వరకూ కాంగ్రెస్‌లోకి కెసిఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదన్నారు. అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా గ్యాంగ్ మాదిరిగా బిఆర్‌ఎస్ నేతల పంచాయితీ ఉందని విమర్శించారు. మీడియా దృష్టిని వారి వైపు తిప్పుకునేందుకు బిఆర్‌ఎస్ నేతలు డ్రామాలు తరువాయి 2లో

> నేరాల నియంత్రణకు కఠినంగా వ్యవ హరించడమే కాదు.. అసలు నేరాలు జరగడానికి మూల కారణాలను అన్వేషించి, అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అమలు చేయడమే నిజ మైన పోలీసింగ్‌కు అర్థం. గ్రామాల్లో యువత తప్పుదోవ పట్టకుండా గంజాయి వంటి దురలవాట్ల జోలికి పోకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ సాంఘిక దురాచారాలపై చైతన్యం కల్పిస్తూ వంగర పోలీసులు నిర్వహి స్తున్న కార్యక్రమాలు అభినందనీయం.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

## నా పాత్రేమీ లేదు..
# అంతా ఇంజనీర్లదే

- రాష్ట్ర ప్రభుత్వం, మంత్రివర్గం ఆమోదం మేరకే కాళేశ్వరం బ్యారేజీలు
- ఏమాత్రం రాజకీయ నిర్ణయం కాదు
- మూడు బ్యారేజీలు నిర్మించాలని వ్యాప్కోస్ సంస్థ సిఫారసు చేసింది
- జస్టిస్ ఘోష్ ప్రశ్నలకు మాజీ సిఎం కెసిఆర్ జవాబు
- విచారణ కమిషన్ అడిగిన 18 ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పినట్లు సమాచారం
- ఇన్ కెమెరా విచారణ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం, మంత్రివర్గ నిర్ణయం మేరకే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా బ్యారేజీల నిర్మాణం జరిగిందని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలిపారు. బ్యారేజీ నిర్మాణ అంశం పూర్తిగా ఇంజనీర్ల నిర్ణయమేనని,ఇది ఏమాత్రం రాజకీయ నిర్ణయం కాదని, ఇందులో తన పాత్ర ఏమీ లేదని, ‘కాళేశ్వరం విచారణ కమిషన్’ ముందు కెసిఆర్ సమాధానమిచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. బ్యారేజీల నిర్మాణ విషయంలో వంద శాతం ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని ‘కాళేశ్వరం కమిషన్’ కార్యాలయంలోని జస్టిస్ పి.సి.ఘోష్ విచారణ కమిషన్ ముందు కెసిఆర్ బుధవారం హాజరయ్యారు.‘115వ సాక్షి’గా కెసిఆర్‌ను కమిషన్ విచారించింది. బుధవారం మధ్యాహ్నం 12:02 నిమిషాలకు ప్రారంభమైన కెసిఆర్ విచారణ,మధ్యాహ్నం 12:50 గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా కమిషన్ అడిగిన సుమారు 18 ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పినట్లు తెలిసింది.విశ్వసనీయ సమాచారం ప్రకారం మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీల నిర్మాణం జరిగిందని, వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణ పనులు జరిగాయని, కాళేశ్వరం నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకున్నామని విచారణ కమిషన్‌కు కెసిఆర్ సమాధానమిచ్చారు. ‘బ్యారేజీల నిర్మాణాలపై మీ డైరక్షన్ ఉన్నదా..?’ అని కమిషన్ అడిగిన ప్రశ్నకు కెసిఆర్ స్పందిస్తూ ‘నా డైరక్షన్ లేదని, పూర్తిగా ఇంజనీర్ల నిర్ణయమేనని,ఇందులో రాజకీయ నిర్ణయం లేదు’ అని సమాధానమిచ్చినట్టు తెలిసింది. కాగా ఇటీవల మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌ను అడిగిన ప్రశ్నలకు అదనంగా మరో రెండు నుంచి మూడు అదనపు ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. కార్పొరేషన్ ఏర్పాటు, బ్యారేజీల నిర్మాణం, ఆ బ్యారేజీలలో నీటి నిల్వ, బ్యారేజీ మార్పులపై కమిషన్ ఆరా తీసినట్టు సమాచారం. దీనిపైన కెసిఆర్ సమాధానమిస్తూ కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని, కాళేశ్వరం పనులను వేగంగా పూర్తి చేసేందుకే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.బ్యారేజీలలో ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని,బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక,మార్పు,సాంకేతిక అంశాలు, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని తరువాయి 2లో




## నీటిపారుదల శాఖ ఇఇ శ్రీధర్ అరెస్టు

ఏకకాలంలో 13 ప్రాంతాల్లో ఎసిబి దాడులు

అక్రమాస్తులు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమ ఆస్తుల కేసులో ఖమ్మం జిల్లా చొప్పదండిలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నూనె శ్రీధర్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) డిజి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నూనె శ్రీధర్ తన సర్వీసు కాలంలో చట్టవిరుద్ధమైన పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా అక్రమాస్తులు సంపాదించారనే ఆరోపణలపై తెలంగాణలోని 13 ప్రాంతాలలో అతని ఆస్తులపై దాడులు చేసి సోదాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రాథమిక తరువాయి 2లో

## గొప్పలు కెసిఆర్‌వి..
# తప్పులు ఇంజనీర్లవా?

- ఘోష్ కమిషన్ ముందు హాజరయ్యేందుకు మందీ మార్బలంతో ఊరేగింపుగా ఎందుకు?
- డిజైన్‌ను మార్చి ప్రాజెక్టును నిర్మిస్తే తిప్పలు తప్పవు
- కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వల్ల ఒక్క ఎకరాకూ నీళ్లు అందలే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శ
- మహబూబ్‌నగర్‌లో సిపిఐ శతాబ్ది ఉత్సవాలు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి

గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆర్ అని గొప్పలు చెప్పుకున్నారని, ఇప్పుడు కూలిపోతే ఆ తప్పును ఇంజనీరింగు అధికారులపై తోసేయడం ఎంతవరకు సమంజసమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిలదేశారు. కాళేశ్వరం కారణంగానే తెలంగాణలో ధాన్యం దిగుబడి పెరిగిందని బిఆర్‌ఎస్ నేతలు చెప్పడం హాస్యాస్పదమని, ఆ ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నుంచి ఒక ఎకరాకు సైతం నీళ్లు రావడం లేదన్నారు. అయినా దాని వల్లే పంటలు పండుతున్నాయని బిఆర్‌ఎస్ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ముందు హాజరవడాన్ని మందీ మార్బలం, భారీ కాన్వాయితో కెసిఆర్ భారీ ఊరేగింపుగా వెళ్ళేందుకు ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వడాన్ని ఆయన ఆక్షేపించారు. కెసిఆర్ ఇప్పటికైనా ఆత్మ పరిశోధన చేసుకోవాలని అన్నారు. నిపుణులు చెప్పింది వినకుండా డిజైన్ మార్చి ప్రాజెక్టులు నిర్మిస్తే ఇలాగే ఉంటుందని అన్నారు. ఇంజనీరింగ్ అద్భుతమన్న కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని, రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తరువాయి 2లో

## ఎస్‌ఎల్‌బిసి పనుల పునరుద్ధరణకు
# ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సహకారం

- రక్షణ మంత్రిత్వశాఖ అధికారులను కోరిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రెండేళ్లలో పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల పునరుద్ధరణకు సిద్ధమవుతున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 9కి.మీ సొరంగం పనులు వచ్చే రెండేళ్లలో పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఢిల్లీలో బుధవారం ఆయన రక్షణ మంత్రిత్వశాఖతో జరిగిన భేటీలో ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ నుంచి ఎస్‌ఎల్‌బిసి సొరంగం పూర్తి చేయడానికి సహకారం కావాలని కోరగా.. అంగీకరించినట్టు చెప్పారు. శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రంగా ఉన్నందున హెలికాప్టర్ సర్వే చేసి.. తదుపరి పనులు మొదలు పెట్టాలని చూస్తున్నామన్నారు. ఆర్మీలో ఉన్న కల్నల్ పరీక్షిత్ మెహరా, సరిహద్దు రోడ్డు సంస్థమాజీ డిజి జనరల్ హర్‌పాల్ సింగ్‌ను డిప్యూటేషన్‌పై తెలంగాణకు పంపేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. పరీక్షిత్ మెహరాను ప్రత్యేక కార్యదర్శిగా, జనరల్ హర్పాల్‌సింగ్‌ని గౌరవ సలహాదారుగా తీసుకుంటున్నామని తెలిపారు. వీరిద్దరి సహకారంతో రాష్ట్రంలో చేపట్టిన అన్ని సొరంగాల నిర్మాణాలు తరువాయి 2లో



## బాలుడు దొరికాడు

నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నాప్ బాలుడిని గుర్తించిన పోలీసులు

ఏడు గంటలలోపే తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నాప్ అయిన బాలుడి కథ సుఖాంతమైంది. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు ఏడు గంటలలోపే నేరస్థులను గుర్తించి బాలుని కనిపెట్టి తల్లితండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ చేసిన ఇద్దరు మహిళలపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. మిర్యాలగూడెం మండలం తుంగపాడు గ్రామానికి చెందిన బైరం అంజిబాబు, భాగ్యలక్ష్మి దంపతులకు సుమారు 20నెలల వయస్సు గల సోమేశ్వర కుమార్ అనే కొడుకు. ప్రస్తుతం భాగ్యలక్ష్మి 8 నెలల గర్భవతిగా వుండి ఆమెకు ఆరోగ్యం బాగా తరువాయి 12లో

## విద్యార్థుల వసతి గృహాల్లో దయనీయ పరిస్థితులు

- అణగారిన వర్గాల స్కాలర్‌షిప్‌ల విడుదలలో తీవ్ర జాప్యం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ధ్వజం
- కీలక సమస్యలు పరిష్కరించాలని ప్రధాని మోదీకి లేఖ



**న్యూఢిల్లీ :** విద్యార్థుల వసతి గృహాల్లో పరిస్థితులకు సంబంధించి ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. దళిత, ఎస్‌సి, ఇబిసి, ఒబిసి, మైనారిటీ విద్యార్థుల వసతి గృహాలలో దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. అణగారిన వర్గాల వారి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాహుల్‌గాంధీ మోదీకి లేఖ రాశారు. అణగారిన వర్గాలకు చెందిన 90 శాతం మంది విద్యార్థులకు విద్యా అవకాశాలకు ఆటంకం కలిగించే ఈ రెండు కీలక సమస్యలను పరిష్కరించాలని గాంధీ మోడీకి రాసిన లేఖలో ప్రధానిని కోరారు. దళిత, ఎస్‌సి, ఇబిసి, ఒబిసి, మైనారిటీ విద్యార్థుల వసతి గృహాలలో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయన్నారు. ఇటీవల తాను బిహార్ దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌ను సందర్శించినప్పుడు, 6–7 మంది విద్యార్థులు ఒకే గదిలో ఉండాల్సిన వస్తుందని, అపరిశుభ్రమైన టాయిలెట్లు, అసురక్షిత తాగునీరు, మెస్ సౌకర్యాలు లేకపోవడం, లైబ్రరీలు లేదా ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడం గురించి విద్యార్థులు ఫిర్యాదు చేశారని రాహుల్ పేర్కొన్నారు. అణగారిన వర్గాల తరువాయి 12లో

## మోగనున్న బడి గంట

నేడు తెరుచుకోనున్న పాఠశాలలు

విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు



ప్రజాపక్షం/హైదరాబాద్

నేటి నుంచి బడి గంటలు మోగనున్నాయి. దీర్ఘకాలిక వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు నూతన ఉత్సాహంతో పై తరగతి గదుల్లోకి తమ బుడి బుడి అడుగులు వేయనున్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం ఫీజుల భారంతో గుబులు చెందుతున్నారు. వాస్తవంగా పాఠశాలల్లో ట్యూషన్ ఫీజు మినహా ఎలాంటి ఫీజులు వసూలు చేయడానికి వీలులేదు. కానీ విద్యాశాఖ అధికారుల అలసత్వం పుణ్యమా అని ప్రతి పాఠశాలలోనూ రకరకాల ఫీజుల పేరుతో వేల రూపాయలు వసూలు తరువాయి 2లో

### ఈఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్య

విద్యార్థుల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. 202526 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులను ప్రవేశపెట్టేందుకు పచ్చజెండా ఊపింది. ఈ విద్యా సంవత్సరం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా 210 ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగుతుల్లో విద్యార్థులను చేర్చుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అకునూరి మురళి నేతృత్వంలోని రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## వివాద పరిష్కారానికి
# అమెరికా–చైనా ఒప్పందం

- మార్గదర్శక వ్యవస్థ ఏర్పాటుకు అంగీకారం
- గణనీయంగా పుంజుకున్న ఆసియా స్టాక్‌మార్కెట్లు

**లండన్ :** అమెరికా–చైనా మధ్య తలెత్తిన వాణిజ్య వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఒక మార్గదర్శక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రెండు దేశాలు అంగీకరించాయి. సమస్యను పరిష్కరించుకునేందుకు ఒక అంగీకారం కుదిరిందని సంభాషణల అనంతరం తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్‌లో కరోనా హెచ్చరిక



**ఢాకా:** భారత ఉపఖండంలో కరోనా మహమ్మారి కొత్త వేరియంట్ విజృంభిస్తూ ఉండటంతో బంగ్లాదేశ్ ఆరోగ్యశాఖ బుధవారంనాడు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. మాస్కులు ధరించాలని ప్రకటించింది. దగ్గు వస్తే చెయ్యి అడ్డంపెట్టుకోవాలని, డస్ట్‌బిన్‌లు ఉపయోగించాలని ప్రజలను కోరింది. ఇరవై సెకన్లపాటు చేతులు శానిటైజ్ చేసుకోవాలని, ప్రజలు ఒకరికొకరు కనీసం మూడు అడుగులు దూరం పాటించాలని హెచ్చరించింది. కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందకుండా 11 మార్గదర్శకాలను ప్రకటించింది. గగతలమార్గంలో, సముద్రమార్గంలో, భూతలమార్గంలో దేశంలోకి ప్రవేశించే విదేశీయుల ఆరోగ్యంపై గట్టి నిఘా వేయాలని, మార్గదర్శకాలను వారు తూచ తప్పకుండా పాటించాలని, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండటం మానేయాలని, వీలైనంతవరకూ జనంలోకి వెళ్ళకుండా దూరం పాటించాలని ఆరోగ్యసేవల డైరెక్టరేట్ హెచ్చరించింది.

## వెనక్కు తగ్గి క్షమాపణ చెప్పిన మస్క్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో బాహాబాహీకి దిగిన ప్రపంచ కుబేరుడు, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ వెనక్కు తగ్గి క్షమాపణలు చెప్పారు. ట్రంప్‌తో జరిగిన వాగ్యుద్ధంలో తాను మితిమీరిన స్థాయిలో కొన్ని పోస్టింగ్స్ పెట్టాననీ, అందు కు చింతిస్తున్నాననీ క్షమాపణలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ విషయం వెల్లడించారు. ఎలాన్‌మస్క్‌తో ఇక తన మైత్రిని పునరుద్ధరించుకునే అవకాశం లేదని, అలాంటి ఆలోచన విరమించుకున్నాననీ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఎలాన్ మస్క్ నుండి ఈ క్షమాపణలు ఎక్స్ వేదికగా వెలువడ్డాయి. అధ్యక్ష ఎన్నికల ముందు నుండీ ట్రంప్ 'మాగా' టీమ్‌లో ఉంటూ ఆయనకు కుడిభుజంగా ఉండి ఎన్నికల్లో విజయానికి ఎలాన్ మస్క్ కారకుడయ్యాడని ప్రపంచదేశాలన్నీ భావించాయి. కానీ 'డోజ్' ప్రత్యేక శాఖద్వారా ప్రభుత్వంలో పొదుపు చర్యలు అమలు చేసి ట్రిలియన్ డాలర్ల మేరకు ఖర్చులు తగ్గించిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ 'బ్యూటిఫుల్ బిల్'ను కాంగ్రెస్ ముందుకు తీసుకురావడంతో ఎలాన్ మస్క్‌లో తీవ్ర అసంతృప్తి ప్రారంభమైంది. ఈ లోపే ఆయన కార్ల కంపెనీ సహా ఇతర వ్యాపారాలు కూడా కొంత మేరకు నష్టాలు చవిచూడటంతో మ స్క్ ఆలోచనల్లో పడ్డారు. బ్యూటిఫుల్ బిల్ కేంద్రంగా ట్రంప్–ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. వారి మధ్య వాగ్యు ద్ధం మొదలై మితిమీరిన స్థాయిలో విమర్శలు, ప్రతివిమర్శలు చెలరేగాయి. దీంతో ట్రంప్ విరక్తి ప్రకటించారు. మస్క్ చేసిన కొన్ని ట్వీట్‌లు, పోస్టింగ్‌లపట్ల ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి ఇక ఆయనకు నీళ్ళొదిలేశానని ప్రటించారు. ఈ నేపథ్యంలో మస్క్ తాను చేసిన కొన్ని ఆన్‌లైన్ వ్యాఖ్యలు మితిమీరాయని ఒప్పుకుంటూ క్షమాపణలు తెలియజేశారు.

## తొలి క్షిపణి ప్రయోగంతో శత్రుదేశాలకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్ :** ఇరాన్ తన యుద్ధ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు ఆ దేశ రక్షణమంత్రి జనరల్ అజీజ్ నసీర్జాదే చెప్పారు. ఈ క్షిపణికి రెండు టన్నులు బరువుగల వార్‌హెడ్స్‌ను కూడా తగిలించి మరీ విజయవంతంగా పరీక్షించారు. బుధవారంనాడు ఇరాన్ కేంద్రమంత్రివర్గ సమావేశం తర్వాత మంత్రి నసీర్జాదే ఈ విషయం చెప్పారు. ఐతే ఈ పరీక్ష గురించి ఇతర వివరాలు ఏమీ ఆయన చెప్పలేదు. మొట్టమొదటిసారి క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించామని, బాహ్యశత్రువులు దాడిచేస్తే వారికి తగిన గుణపాఠం చెబుతామని నసీర్జాదే అన్నారు. బయట నుండి ఎవరైనా దాడులు చేస్తే భారీస్థాయిలో సైనికంగా ఇరాన్ ప్రతిఘటిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ క్షిపణి ప్రయోగం ఇరాన్ రక్షణరంగ చరిత్రలో ఒక ఘన విజయమని చెప్పారు. ఏప్రిల్ 12వ తేదీ నుండి ఇప్పటివరకూ ఇరాన్–అమెరికా మధ్య ఐదు విడతలుగా అణ్వాయుధల సమస్యపై చర్చలు పరోక్ష చర్చలు జరిగినప్పటికీ అవన్నీ విఫలమయ్యాయి. ఇరాన్ అణు పదార్థాలను శుద్ధి చేయడం మానుకోవాలని, చర్చలకు లొంగకపోతే ఇరాన్‌పై బాంబులవర్షం కురిపిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు నెలలక్రితం నుండి ఇరాన్‌కు వరుస హెచ్చరికలు చేస్తున్నారు. చర్చలు విఫలమైన తరుణంలో ఇరాన్ ఈ విధంగా క్షిపణి ప్రయోగం చేసి తాము అన్నిటికీ సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్, అమెరికా దేశాలకు పరోక్ష హెచ్చరిక చేసింది. ఇరాన్–అమెరికా మధ్య ఐదు విడతల చర్చలకు ఒమన్ దేశం మధ్యవర్తిగా వ్యవహరించింది. ఐదో విడత చర్చలు మే 23న జరిగాయి. ఐదో విడత చర్చలకు ముందుగానే ఈ రెండు దేశాలమధ్య పరస్పర హెచ్చరికలతో పరిస్థితి చేయిదాటిపోయింది. యురేనియమ్‌ను శుద్ధిచేయడం ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరించారు. తాము లొంగేదేలేదని ఇరాన్ కూడా ఘాటుగా సమాధానం చెప్పింది. అణుసామర్థ్యాన్ని సమకూర్చుకోవడం తమ సార్వభౌమాధికార రక్షణకోసమేననీ, శాంతి యుత ప్రయోజనాలకోసమే తాము యురేనియంను శుద్ధిచేస్తున్నామని ఇరాన్ మొదటినుండీ చెబుతున్నది.

## 16న రష్యా–ఉక్రేన్ బందీ సైనికుల మార్పిడి

**6వేల మృతదేహాల స్వాధీనానికి రష్యా సిద్ధం**



**మాస్కో :** ఉక్రేన్–రష్యా దేశాలు ఈనెల 16వ తేదీన అంటే రాబోయే సోమవారంనాడు తమ బందీలుగా ఉన్న సైనికులను పరస్పరం మార్పిడి చేసుకుంటాయి. ఇస్తాంబుల్‌లో ఈనెల రెండో తేదీన జరిగిన రెండో విడ త ముఖాముఖీ చర్చల సందర్భంగా ఖైదీల మార్పిడి ఒప్పందం జరిగింది. ఐతే ఈ సైనికుల పరస్పర మార్పి డి ప్రక్రియ విడతల వారీగా జరుగుతుంది. మొదటి విడతలో సోమవారంనాడు ఎంతమంది సైనికులను ఇరు దేశాలూ ఇచ్చిపుచ్చుకుంటాయన్న విషయాన్ని రెండు దేశాల అధికార ప్రతినిధులూ ఇంత వరకూ ధృవీకరించలేదు. అదేవిధంగా రష్యా విదేశాంగమంత్రిత్వశా ఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, ఇస్తాంబుల్ చర్చల్లో చేసిన వాగ్దానానికి రష్యా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. చెప్పినవిధంగా 6000 మంది ఉక్రేన్ సైనికుల మృతదేహాలను ఆ దేశానికి స్వాధీనం చేస్తామని ఆమె చెప్పారు. ''ఒప్పందం ప్రకారం, మృతదేహాలను, సజీవులైన సైనికులను స్వాధీనం చేయడానికి రష్యా సిద్ధంగా ఉంది, ఉక్రేన్ కూడా అదేవిధంగా ప్రతిస్పందించాలి, అందుకు కట్టుబడి ఉండాలి'' అని జఖారియా ఉద్ఘాటించారు. ఈనెల ఏడవ తేదీన బెలారస్–ఉక్రేన్ సరిహద్దుల్లో నిర్దేశించిన ప్రదేశంలో 1,112 మంది ఉక్రేన్ సైనికుల మృతదేహాలను అనుకున్నవిధంగా రష్యా స్వాధీనం చేసిందని, కానీ ఆ మృతదేహాలను స్వీకరించడానికి ఉక్రేన్ రక్షణ శాఖ తిరస్కరించిందనీ, ఇది ప్రపంచదేశాలను, ప్రతిఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందనీ జఖారియా చెప్పారు. ఈ విధంగా ఉక్రేన్ ప్రభుత్వం ప్రవర్తించడం ఇది మొదటిసారి కాదని ఆమె విమర్శించారు. ఉక్రేన్ అనుసరిస్తున్న అమానవీయమైన ప్రవర్తనకు ఇది ఒక స్పష్టమైన ఉదాహరణ అ ని ఆమె చెప్పారు. యుద్ధంలో మరణించిన తమ సొంతదేశ సైనికుల మృతదేహాలు తీసుకోవడానికి ఉక్రేన్ ప్ర భుత్వం తిరస్కరించిందని ఆమె ఆశ్చర్యపోయారు. కాగా టాస్ వార్తాసంస్థ సమీక్షా కథనం ప్రకారం, ఉక్రే న్ గనుక తమ సైనికుల మృతదేహాలను స్వీకరించి వా రి వారి కుటుంబాలకు స్వాధీనం చేస్తే ఆ కుటుంబాలన్నింటికీ భారీగా నష్టపరిహారాలను కూడా ముట్టజెప్పా ల్సి ఉంటుంది. మొత్తం మూడు రైళ్ళల్లో, వాహనాలలో ఆరువేల మృతదేహాలను ఇప్పటికే నిర్దేశిత ప్రదేశానికి రష్యా చేరవేసింది. ఈనెల ఏడో తేదీన మృతదేహాలను స్వీకరించేందుకు ఉక్రేన్ తిరస్కరించింది. 640 మంది ఉక్రేన్ సైనికులు తీవ్రంగా గాయపడి బాధపడుతున్నారు.

## లాస్‌ఏంజెల్స్‌లో కర్ఫ్యూ, అరెస్టులు

**పలు నగరాల్లో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలు**

**లాస్‌ఏంజెల్స్ :** వలస ప్రజలపై ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులకు వ్యతిరేకంగా వారం రోజులుగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలను అదుపు చేసేందుకు లాస్‌ఏంజెల్స్‌లో మేయర్ న్యూసమ్ కర్ఫ్యూ విధించారు. డౌన్‌టౌన్‌లో కర్ఫ్యూ విధించడంతో దాదాపు 400 మంది ప్రదర్శకులను అరెస్టులు చేశారు. అదేవిధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పంపిన నేషనల్ గార్డ్స్, మెరైన్ బృందాలు కూడా లాస్‌ఏంజెల్స్‌కు చేరుకున్నాయి. రాత్రిపూట కర్ఫ్యూను చాలా కఠిన పద్ధతులలో అమలు చేశారు. ప్లాస్టిక్ షీల్డ్స్ వెనక నిలబడిన నేషనల్ గార్డ్స్ మౌనంగా పరిస్థితిని గమనిస్తున్నారు. వారు మాత్రం అరెస్టులు చేసే కార్యక్రమంలో భాగస్వామ్యం కాలేదు. లాస్‌ఏంజెల్స్ మేయర్ దాదాపు 800 మంది పైగా అదనపు పోలీసు బలగాలను మోహరించారు. నేషనల్ గార్డ్స్‌ను మోహరించి ట్రంప్ అగ్నికి ఆజ్యం పోస్తున్నారని మేయర్ గవిన్ న్యూసమ్ విమర్శించారు. సైన్యాన్ని ఉపసంహరించాలని కోరుతూ కోర్టులో దావా వేశారు. మరోవైపు అమెరికాలోని అనేక నగరాలలో ట్రంప్‌వలస విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న ఇతర విధానాల పట్ల కూడా ప్రదర్శకులు బాహాటంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి విధానాల ద్వారా అమెరికాను తిరిగి గొప్పగా మార్చలేరని ట్రంప్‌ను విమర్శిస్తూ ప్రదర్శకులు ప్ల కార్డులను ప్రదర్శించారు. న్యూయార్క్, టెక్సాస్, ఆస్టిన్, హ్యూస్టన్, బోస్టన్‌లలో భారీగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. లోయర్ మన్‌హట్టన్‌లో, న్యూయార్క్‌లో వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

## కీవ్, ఖార్కీవ్‌లపై రష్యా డ్రోన్ల దాడి : ముగ్గురు మృతి



**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్ నగరం, ఖార్కీవ్, ఒడెశాలపై బుధవారం నాడు తెల్లారకముందుఏ రష్యా సామూహికంగా డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించారు. గడచిన కొద్దిరోజులుగా రష్యా భారీస్థాయిలో దాడులను ఆపకుండా కొనసాగిస్తున్నది. ఈ తాజా దాడుల్లో 64 మంది గాయపడ్డారని ఉక్రేన్ అధికారులు చెప్పారు. డ్రోన్ల దాడివల్ల ఖార్కీవ్‌లోని నివాసతి ప్రాంతాలలో భారీ నష్టం వాటిల్లింది. ఖార్కీవ్‌లోని నివాసిత ప్రాంతాలపై 17 డ్రోన్లు దాడి చేశాయని మేయర్ ఐహోర్ తెరెఖో వ్ చెప్పారు. ఎమర్జెన్సీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, వాలంటీర్లు రంగంలోకి దిగి సేవలు అందించారు. ఈ ఘటనపై ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా చర్యలను ప్రపంచదేశాలు తీవ్రంగా ఖండించాలని, పుతిన్‌ను అడ్డుకోవాల ని కోరారు. ఈ మేరకు టెలిగ్రామ్‌లో ఒక సందేశం రాశా రు. ప్రతి రోజూ దాడులు జరుగుతున్నాయి, ప్రతి దాడి నుండీ తాము స్థిర నిర్ణయాలు తీసుకుంటున్నాం, తీసుకున్న కొత్త నిర్ణయాలను అమలు చేయకుం డా వాయిదా వేయకూడదని తాము నిర్ణయించుకున్నామన్నారు. సమస్యను రష్యా ప్రభు త్వం మరింత జటిలంగా మార్చేస్తోందని ఆయ న విమర్శించారు. దాడులు చేయకుండా ప్ర శాంతంగా, న్యాయబద్ధంగా వారు దౌత్య చర్య లు తీసుకునే అవకాశాలే లేవన్నారు. అమెరికా, ఇతర ప్రపంచదేశాల నాయకులే పుతిన్‌ను అదుపుచేయగలుగుతారని ఆయన అన్నారు. ఇటీవలికాలంలో రష్యా భారీ సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులను ఉక్రేన్‌పై ప్రయోగిస్తున్నది. గడచిన సోమవారం తొమ్మి దో తేదీన దాదాపు 500 డ్రోన్లతో దాడులు చేసింది. జూన్ రెండో తేదీన రష్యా–ఉక్రేన్ మధ్య ఇస్తాంబుల్‌లో రెండోవిడత ముఖాముఖీ చర్చల్లో ఖైదీల పరస్పర స్వాధీనానికి ఒప్పందం జరిగింది. రెండు దేశాలు మెమొరాండం పత్రాలను కూడా ఇచ్చిపుచ్చుకున్నాయి. వీటిని అధ్యయనం చేశాక రెండు వారాల తర్వాత నిర్ణీ త ప్రకారం రెండు దేశాలమధ్యా మరోవిడత చర్చలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఈలోపు భారీఎత్తున దాడులు కొనసాగుతున్నాయి.

## గ్రెటాథన్‌బెర్గ్ స్వదేశానికి తరలింపు



**టెల్అవీవ్ :** స్వీడన్‌కు చెందిన ప్రచార కర్త,గాజా సహాయబృంద సభ్యురాలు గ్రెటా థన్‌బెర్గ్‌ను స్వదేశం స్వీడన్‌కు పంపేసినట్లు మంగళవారంనాడు ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది. మధ్యధరా సముద్రంలో ఒక బోటులో వెళుతుండగా థన్‌బెర్గ్‌తోపాటు మరో 11 మందిని ఇజ్రాయెల్ సైనికులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆమె అంగీకారం మేరకు మంగళవారం ఉదయం ఇజ్రాయెల్ రాజధాని టెల్అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయంలో ఆమెను ఫ్రాన్స్ విమానం ఎక్కించినట్లు ఇజ్రాయెల్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఐతే ఫ్రాన్స్ ఒక ప్రకటన చేస్తూ థన్‌బెర్గ్‌తోపాటు ఉన్న ఆరుగురు ఫ్రెంచ్ జాతీయులలో ఐదుగురు ఫ్రెంచ్ జాతీయులు స్వదేశానికి పంపేందుకు ఉద్దేశించిన పత్రాలపై సంతకాలు చెయ్యలేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది. గాజా సహాయబృందంలో థన్‌బెర్గ్‌తోపాటు 11 మంది ప్రయాణిస్తున్న పడవను సోమవారం తెల్లవారుజామును పట్టుకున్నారు. ఈ నౌకలో ఫ్రాన్స్,స్వీడన్, బ్రెజిల్,నెదర్లాండ్స్, జర్మనీ, స్పెయిన్, టర్కీలకు చెందిన 11 మంది ఉన్నారు.

## బాలుడు దొరికాడు

(మొదటి పేజీ తరువాయి)

లేనందున ఈనెల 8న ఆమె భర్త కుమారుడు వారింటి పక్కన వుండే కుంచం పార్వతమ్మతో కలిసి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారని తెలిపారు. బాలుని తల్లి వారితో వచ్చిన పార్వతమ్మ చెట్టు కింద కూర్చుని బాలునితో కలిసి యుండగా అక్కడే వున్న ఇద్దరు మహిళలు వారితో మాటలు కలిపి పరిచయం పెంచుకుని బాలుడిని ఆడిస్తున్నట్లు నటిస్తూ మీరిద్దరు భోజనం చేసి రండి మేము బాలుడిని చూసుకుంటామని నమ్మించి, వారు భోజనానికి వెళ్ళగా అదే అదనుగా భావించి బాలుడిని కిడ్నాప్ చేసి పారిపోయారని తెలిపారు. నల్లగొండ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో బాలుని కుటుంబం ఫిర్యాదు చేయగా పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసుకొని 4 టీములు ఏర్పాటు చేసి 7 గంటలలోనే నిందితులు నారాయణదాసు అరుణ, జంతిక సుక్కమ్మ అలియాస్ పొలదుగు సుగుణమ్మలను గుండాల మండలం పెద్ద పడిశాల గ్రామంలో అరుణ తల్లి ఇంటి వద్ద పట్టుబడి చేసి బాలుడిని సురక్షితంగా రక్షించడం జరిగిందన్నారు.

**కిడ్నాప్‌నకు గల కారణాలు**

నారాయణదాసు అరుణకు కొడుకు, కూతురు ఉండగా, ఆమె కొడుకు ఇటీవల ఆత్మహత్య చేసుకుని చనిపోగా, ఆమె మగపిల్లల మీద ప్రేమతో ఏవిధంగానైనా ఒక బాలున్ని తీసుకుని వచ్చి పెంచుకోవాలని దురాలోచనతో హైదరాబాదులోని దమ్మాయిగూడలో తాను నివసిస్తున్న ఇంటి పక్కన గల మరో నేరస్థురాలు జంతిక సుక్కమ్మ అలియాస్ పొలదుగు సుగుణమ్మతో చెప్పగా, వారిద్దరు కలిసి నల్లగొండ ఆసుపత్రి ఏరియాలో చిన్న పిల్లలు వారి తల్లిదండ్రులతో వుంటారని వారి తల్లిదండ్రులు లేని సమయం చూసి పిల్లవాడిని కిడ్నాప్ చేసి ఎవరికి తెలియకుండా హైదరాబాద్‌కు తీసుకు వెళ్లాలని నిర్ణయించుకుని ఈనెల10న నేరస్తులు ఇద్దరు కలిసి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కేసును ఛేదించిన టూటౌన్ సీఐ రాఘవ రావు, నార్కెట్‌పల్లి సిఐ నాగరాజు, నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐలు వై.సైదులు, సతీష్, భువనగిరి పట్టణ సిఐ రమేశ్, పోలీస్ సిబ్బంది రాజు, సాగర్ల శంకర్, లావూరి బాలకోటి, జానకి రామ్, తిరుమలేష్‌లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారని తెలిపారు.

## 'చక్రబంధం'లో ప్రభాకర్‌రావు..!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలపై కూడా సిట్ అధికారులు ఆరా తీశారు. గురువారం ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ అధికారుల ముందు ప్రభాకర్‌రావు రెండోసారి విచారణకు హాజరయ్యారు. సుమారు 9 గంటల పాటు వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ నేతృత్వంలో జూబ్లీహిల్స్ ఎసిపి పి.వెంకటగిరి సహా ఐదుగురు సభ్యుల బృందం ప్రభాకర్ రావును విచారించింది. ఈ నెల 14న మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు నోటీసులు అందించారు. సిట్ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు ప్రభాకర్‌రావు నీళ్లు నమి లాడు. కొన్ని ప్రశ్నలకు తనకు తెలియదని, గుర్తుకు లేదని చెప్పి తప్పించు కునే ప్రయత్నం చేశాడు. పక్కా సాక్ష్యాధారాలు లభించడంతో మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**సంబంధాలు ఎందుకు పెట్టుకున్నారు?–** బిఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలతో ప్రభాకర్‌రావు సంబంధాలపై కూడా సిట్ అధికా రులు లోతుగా ప్రశ్నించారు. విధినిర్వహణలో వారితో అసలు సంబంధాలు పెట్టుకునే అవసరం లేకపోయినా ఎందుకు అంతగా సంబంధాలు పెట్టుకోవాల్సి వచ్చిందని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నేతలతో పాటు ఓ మీడియా యజమానితో కూడా తరచుగా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది అని కూడా సిట్ అధికారులు ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నేతలకు తరచు ఫోన్‌లు చేయాల్సిన అవసరం ఏం ఉందని.. ఫోన్ సంభాషణలపై తమకు అనుమానాలు ఉన్నాయని సిట్ అధికారులు అన్నారు. దీంతో పాటు రహస్య ప్రదేశాలలో వారితో ప్రత్యక్షంగా సమావేశాలు ఎందుకు నిర్వహించారనే విషయంపై కూడా వారు ఆరా తీశారు. అలాగే ఎస్‌ఐబికి సంబంధంలోని పోలీసు అధికారులను కూడా మీరు ఎందుకు ఈ ఫోన్ ట్యాపింగ్‌కు వాడుకోవాల్సి వచ్చింది అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభాకర్‌రావు ఉపయోగించిన తన వద్ద ఉన్న రెండు ఫోన్‌లను కూడా సిట్ అధికారులకు అందించారు. ఈ ఫోన్‌లను సిట్ అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించే అవకాశాలు ఉన్నాయి. అందులో ఉన్న డేటాను తెలుసుకుంటే ఈ నెల 14న మరింత లోతుగా విచారించే అవకాశాలు ఉన్నాయని సిట్ అధికారులు భావిస్తున్నారు.

## ఆంధ్ర, కర్ణాటక, జార్ఖండ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గ కమిటీ ఆమోదం

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలలో రూ.6,405 కోట్ల వ్యయంతో తలపెట్టిన రెండు బహుముఖ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణంవల్ల మూడు రాష్ట్రాలలో 1,408 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారంనాడు మంత్రివర్గ కమిటీ సమావేశమై ఏడు జిల్లాలకు ప్రయోజనం కలిగించే ఈ రెండు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. జార్ఖండ్‌లోని బొగ్గు ఉత్పత్తి చేసే ప్రధాన కేంద్రం ద్వారా ప్రయాణం చేసే 133 కి.మీ నిడివిగల రైల్వే మార్గాన్ని ఈ ప్రాజెక్టులో భాగంగా డబ్లింగ్ చేస్తారు. దీనివల్ల ఈ వాణిజ్య ప్రయోజనం నెరవేరడమేకాకుండా, పాట్నా–రాంచీ మధ్య ఎంతో శక్తి సామర్థ్యాలు గలిగిన రైల్వే అనుసంధానం కూడా ఏర్పడుతుంది. అదే విధంగా కర్ణాటకలోని బళ్ళారి, చిత్రదుర్గ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాల మీదుగా ప్రయాణం చేసే 185 కి.మీ నిడివిగల బళ్ళారి–చిక్‌జజూర్ రైల్వే లైను డబ్లింగ్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. దీనివల్ల 1,408 గ్రామాలలో నివసిస్తున్న 29.19 లక్షలమంది ప్రజలకు మేలు జరుగుతుంది. బొగ్గు, ఇనుపఖనిజం, ఉక్కు, సిమెంటు, ఎరువులు, వ్యవసాయ ఆహార వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు వంటివాటిని రవాణా చేయడానికి ఈ బహుముఖ రైల్వే ట్రాకులు అత్యవసరం అని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏటా 49 మిలియన్ టన్నుల సరుకు రవాణాను చేయడానికి కూడా ఈ ట్రాకులు ఉపయోగపడతాయి. దీనివల్ల ఈ మూడు రాష్ట్రాలలో రైల్వే నెట్‌వర్క్ 318 కి.మీకు విస్తరిస్తుంది. పర్యావరణ అనుకూలమై రైల్వేవ్యవస్థవల్ల ఇంధన సామర్థ్యం పెరుగుతుందని, రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు.

## ఎయిర్ ఫోర్స్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేస్తామన్నారు. డెన్మార్క్ నుంచి అత్యాధునిక ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పరికరాలు తీసుకొస్తున్నామని వివరించారు. వీటి ద్వారా 44 కి.మీ మొత్తం సొరంగం భూమిపై నుంచే.. భూమి లోపల కిలోమీటరు వరకు పరిస్థితి తెలుసుకుని తదుపరి చర్యలకు ఉపకరిస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా సొరంగం వాస్తవ పరిస్థితి అంచనా వేయొచ్చన్నారు. హెలికాప్టర్‌కు లైడార్ కూడా ఏర్పాటు చేసి సర్వే చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు. వైమానిక దళ హెలికాప్టర్లు, పవన్ హన్స్ హెలికాప్టర్ల సాయం కూడా అడిగామన్నారు. ఎన్‌జిఆర్‌ఐ నిపుణులు ప్రొఫెసర్ తివారీ, ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ సహకారం కూడా తీసుకుంటామన్నారు. జులై 12 నుంచి సర్వే ప్రారంభమవుతుందని, వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. 44 కి.మీ ఎస్‌ఎల్‌బిసి సొరంగం మధ్యలో గాలికూడా చొరబాటుకు అవకాశం లేకుండా నిర్మాణం చేపట్టారు. ఇరుక్కు పోయిన టిబిఎం తీయడానికి సాధ్యం కాదు కాబట్టీ .. పక్క నుంచి సొరంగం తవ్వకం చేపడతాం. సీతారామ, దేవాదుల ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని టన్నెల్ ప్రాజెక్టులకు కొత్త టెక్నాలజీ ఉపయోగించి పూర్తి చేస్తాం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## బయటపెడతా

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, కిషన్ రెడ్డి ఒక్కటేనన్నారు.

**తెలంగాణకు కిషన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారు**

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అన్ని విషయాలలో కేంద్రంలో అడ్డుపడుతున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డేనని, రాష్ట్రానికి ఒక్క కొత్త ప్రాజెక్టును కిషన్‌రెడ్డి తీసుకురాలేదని, ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు సాధించలేదని సిఎం విమర్శించారు. తెలంగాణకు కిషన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, రాష్ట్ర ప్రాజెక్టులను అడ్డుకుంటున్నది ఆయనేనని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మెట్రో విస్తరణ కెటిఆర్‌కు ఇష్టంలేనందునే కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణ అంశాలపై తనతో కిషన్‌రెడ్డి ఒక్క సమీక్ష సమావేశం కూడా జరపలేదన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు.

## అంతా ఇంజనీర్లదే

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్ట్‌ను నిర్మించినట్టు వివరించారు.

మూడు చోట్ల బ్యారేజీలు కట్టాలన్నదే 'వ్యాప్కోస్' బ్యారేజీల నీటి మళ్లింపు, ఎంత నిల్వ చేయాలన్నది పూర్తిగా సాంకేతిక బృందం చూసుకుంటుందని కెసిఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. మూడు చోట్ల బ్యారేజీలు నిర్మించాలని వ్యాప్కోస్ సంస్థ సిఫారసు చేసిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, అందుకే ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామని, అక్కడ ఒక్కడ ఒక ఈఈని అందుబాటులో ఉండేలా చూశామని, ఆపరేషన్, నిర్వహణ కోసం రూ.280 కోట్లు కేటాయించామని కమిషన్‌కు కెసిఆర్ తెలిపారు.

**నాలుగువేల ఇంజనీర్ల పరిశీలన :** బ్యారేజీల రీ ఇంజినీరింగ్ అంశాన్ని నాలుగు వేల మంది ఇంజనీర్లు పరిశీలించారని కెసిఆర్ వివరించినట్టు సమాచారం. తుమ్మడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ఆనకట్ట నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని, తాను స్వయంగా మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను కలిసి కోరినా ఫలితం లేకుండా పోయిందని వివరించారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి మొదలు గోదావరి మొత్తం వ్యాప్కోస్ సంస్థ ద్వారా సర్వే చేసి పలు సిఫార్సులను చేసిందని, ఆ సిఫార్సులను, ఇంజనీర్ల నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదించిందని తెలిపారు.

**ప్రాజెక్ట్‌కు సంబంధించి అన్ని సర్వేలూ చేశాం**

సాంకేతిక నిపుణుల నివేదికల ఆధారంగానే బ్యారేజీ ప్రాంతాల మార్పు జరిగిందని,కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబందించి ప్రతి అంశానికి మంత్రి వర్గ అనుమతి ఉన్నదని కెసిఆర్ వివరించినట్టు సమాచారం. కాళేశ్వరం పెద్ద ప్రాజెక్టు అని ముందుగా నిర్ణయం తీసుకున్నామని, కానీ సాంకేతిక పరమైన నిర్ణయాలన్నీ వందకు వంద శాతం ఇంజనీర్లు తీసుకున్నారని కెసిఆర్ వివరించినట్టు సమాచారం. మేడిగడ్డ వద్ద 230 టిఎంసిల నీటిని లిఫ్ట్ చేయడానికి అవకాశం ఉన్నదని, ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని సర్వేలనూ చేశామని కమిషన్‌కు కెసిఆర్ వివరించినట్టు సమాచారం.

**'కాళేశ్వరం.. జిఒ 45 '' కాపీలు**

ఇటీవల తెలంగాణభవన్‌లో నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేసిన 'కాళేశ్వరం' పుస్తకాన్ని కెసిఆర్ జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌కు అందజేసినట్టు తెలిసింది. రీ ఇంజనీరింగ్ ఎందుకు చేపట్టాల్సి వచ్చిం ది.?, ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్‌ను ఎందుకు రీ డిజైనింగ్ చేయాల్సి వచ్చింది.?, ఇలా 'కాళేశ్వరం' పుస్తకంలో ఉన్న పలు అంశాలను కెసిఆర్ జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అలాగే జిఒ నంబర్ 45 కాపీని,ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్‌కు సంబంధించిన పత్రాలను కూడా ఆయన కమిషన్‌కు ఇచ్చినట్టు తెలిసింది.

**'ఇన్ కెమెరా'లోనే కెసిఆర్ విచారణ... బహిరంగ విచారణ రద్దు..**

జలుబుతో స్వల్ప అనారోగ్య కారణంగా బహిరంగ విచారణ కాకుండా, ఇన్‌కెమెరా విచారణ చేపట్టాలని కెసిఆర్ చేసిన విజ్ఞప్తి మేరకు జస్టిస్ పిసిఘోష్ కమిషన్ బహిరంగ విచారణకు బదులుగా 'ఇన్ కెమెరా' (ముఖాముఖి) విచారణను చేపట్టింది. దీంతో విచారణ హాల్‌లో విచారణ సమయంలో కేవలం జస్టిస్ పిసి.ఘోష్, విచారణ కమిషన్ కార్యదర్శి మురళీధర్, కెసిఆర్ ముగ్గురు మాత్రమే ఉన్నారు. అయితే అప్పటికే బహిరంగ విచారణ కవరేజీ నిమిత్తం జర్నలిస్టులు, నీటిపారుదల శాఖ అధికారులు బహిరంగ విచారణ జరిగే హాల్‌లో కూర్చున్నారు. కెసిఆర్ వచ్చిన కొద్ది సేపటి తర్వాత బహిరంగ విచారణకు బదులుగా 'ఇన్ కెమెరా' చేపడుతున్నామని విచారణ కమిటీ స్పష్టం చేసింది. దీంతో ఆ హాల్‌లో ఉన్న జర్నలిస్టులు, నీటిపారుదల శాఖ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కెసిఆర్ విచారణ సందర్భంగా కెసిఆర్ వెంట మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంఎల్‌సీలు మధుసూదనాచారి, మహ్మద్ మహమూద్ అలీ, ఎంపి వద్దిరాజులు రవిచంద్ర, బిఆర్‌ఎస్ నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ విచారణ కార్యాలయానికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా అధికారులు, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ఇలా అందరినీ 'కాళేశ్వర కమిషన్' బహిరంగ విచారణ చేపట్టింది. ఇటీవల మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లను కూడా కమిషన్ బహిరంగంగానే విచారించింది. కెసిఆర్‌ను మాత్రం అనారోగ్య కారణంగా 'ఇన్‌కెమెరా' విచారణ చేపట్టారు. ముఖాముఖి విచారణ చట్టం ప్రకారమే అని కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి.

## బడి గంట

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఆరంభ సూరత్వం మాదిరిగా ప్రైవేట్ పాఠశాల దోపిడిని అరికట్టుతామంటూ పాఠశాల విద్య శాఖ అధికారుల హడావుడి ప్రకటనలు తప్ప ఇప్పటీ వరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యధావిధిగానే ప్రైవేటు యాజమాన్యాలు తమ పని తాము చేసుకుంటు పోతున్నాయి. దీంతో పాఠశాలల పునః ప్రారంభం అంటెనే విద్యార్థులు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయితే వెన్నులో అప్పుడే వణుకు మొదలైంది.

**ప్రతి ఏటా డ్రస్సులు, నోటు బుక్స్ పరీక్ష పేపర్లు పాఠశాలల్లో కోనాల్సిందే :**

పట్టణ ప్రాంతాల్లో దాదాపుగా అన్ని ప్రైవైట్ పాఠశాలు చదువుల వ్యాపారంతో పాటు స్టేషనరి, వస్త్ర వ్యాపారులుగా కూడా అవతారం ఎత్తడంతో వారి దోపిడీ నుంచి ఎలా బయటపడాలో తెలియక సామాన్య తల్లిదండ్రులు విలవిలాడుతున్నారు. మరోవైపు పలు స్కూల్ యాజమాన్యాలు ప్రతి ఏటా డ్రస్సుల్లో చిన్న చిన్న మార్పులు చేస్తూ విధిగా కొత్త డ్రస్సులు కొనేలా చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు విధిలేక ప్రతి ఏటా వేల రూపా యలు డ్రస్సులకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పాడు తుంది. డ్రస్సులతో పాటు నోట్ బుక్స్, వర్క్‌బుక్స్ సైతం పాఠశాలల్లో విధిగా కొనాల్సిందేనని, విద్యార్థులు చదువు రాకపోతే మమ్ముల్నీ ప్రశ్నిం చవద్దంటూ పలు పాఠశాలలు బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నాయి. ఇలా అనేక పాఠ శాలు డ్రెస్సులు, వర్క్‌బుక్స్, నోట్ బుక్స్‌కు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు వసూల్లు చేస్తున్నాయి. తీరా నోట్ బుక్స్ సైతం ఏడాదివరకు సరిపోయే సంఖ్యలో ఇస్తున్నారు అంటే అది లేదు. త్రైమాసిక పరీక్ష వచ్చేలోపే వారు ఇచ్చిన నోట్ బుక్స్ నిండిపోయి అప్పటీ నుంచి మళ్లీ బయట కొనాల్సిందే. వీటికి తోడు పరీక్ష లను రాసేందుకు జవాబు పత్రాలకు 100 పేజీల బుక్‌లెట్‌కు రూ.100లు వసూళ్లు చేస్తున్నారు. వార్షిక పరీక్షలు ముగిసే నాటికి ప్రతి విద్యార్థి జవాబు పత్రాలకే రూ.500 నుంచి రూ.800 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి వాటిని అదుపు చేయాల్సిన విద్యా శాఖ అధికారులు చోద్యం చూస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్స్ అంటేనే బాంబు వచ్చి మీద పడినంత భయ కంపితులవుతున్నారు. దీంతో స్కూళ్ల పునః ప్రారంభంతో పాఠశాలల యాజమాన్యాల ముఖాలు వెలిగిపోతుండగా, విద్యార్థులు తల్లి దండ్రుల మొహాలు కళ తప్పి వాడిపోతున్నాయి.

## శ్రీధర్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సోదాలలో తెల్లాపూర్‌లో ఒక ఖరీదైన విల్లా, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్స్, అమీర్‌పేట్‌లో కమర్షి ల్ స్థలం, హైదరాబాద్‌లో ఇండిపెండెంట్ బిల్డింగ్, కరీంనగర్‌లో మరో ఇండిపెండెంట్ బిల్డింగ్, 16 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లలో మరో 19 రెసిడెన్షియల్ ఒపెన్ ప్లాట్స్‌లు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు బయటపడ్డాయి. వీటి విలువ లెక్కించాల్సి ఉందని విజయ్‌కుమార్ తెలిపారు.

**ఈ ఆస్తులు 'కాళేశ్వరం' లంచాలేనా..?**

గతంలో శ్రీధర్ చాలాకాలం పాటు కాళేశ్వరం ప్రాజెక్టోని 6,7,8 ప్యాకేజీల పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం ఆయన ఇరిగేషన్ శాఖ సీఏడీ డివిజన్ 8 చొప్పదండిలోని ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే, ఎస్ఈ శ్రీధర్ భారీగా అక్రమాస్తులను కూడా బెట్టిట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు కాళేశ్వరం కమిషన్ విచారణ తుది దశకు చేరుకున్న వేళ.. నీటి పారుదల శాఖలో.. అది కూడా కాళేశ్వరం ప్రాజెక్ట్ చేసిన ఇంజినీర్ ఇంటితో పాటు బంధువుల ఇళ్లపై ఎసిబి ఆకస్మికంగా దాడులు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మార్చి 2న ఓ ఫామ్ హౌస్‌లో శ్రీధర్ తన కుమారుడి హాళీ, సంగీత్ ఫంక్షన్లను అంగరంగ వైభవంగా జరిపించారు. థాయిలాండ్ లో కొడుకు వివాహ వేడుకలు నిర్వహించారు. ఇక మార్చి 9న నాగోల్లోని శివం కన్వెన్షన్ హాల్లో ఎంతో వైభవంగా రిసెప్షను చేసినట్లు తెలుస్తోంది. శ్రీధర్ కూడబెట్టిన ఆస్తులపై ప్రస్తుతం ఎసిబి అధికారులు ఫోకస్ పెట్టారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో ఐదురోజులపాటు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. బుధవారం వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# మహోద్యమంలా వనమహోత్సవం

### వనమహోత్సవం-2025 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులు మహోద్యమంలా తీసుకొని ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. వృక్షో రక్షిత రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని ఆమె పునరుద్ఘాటించారు. వన మహోత్సవం–2025 పోస్టర్‌ను బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. పోస్టరు ఆవిష్కరణలో తెలంగాణ అటవీ ప్రధాన సంరక్షణాధికారిణి డాక్టర్ సువర్ణ, సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, సోషల్ ఫారెస్టు రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... ఈ ఏడాది తలపెట్టబోయే వనమహోత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. అన్నివర్గాల వారు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటు వారీగా, డిస్ట్రిక్ట్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా... 19.04 కోట్ల మొక్కలు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తుచేశారు. 95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు.

ఈసారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషధ మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. గతం కంటే ఈసారి మాన్‌సూన్ ముందే వచ్చిందని... ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు చెప్పారు.

# రాజీవ్ యువ వికాసం రుణాలను తక్షణమే అందజేయాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాజీవ్ యువ వికాస్ పథకాన్ని దరఖాస్తుల స్వీకరణకే పరిమితం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి తక్షణమే నిధులను విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపథకం దరఖాస్తులు తప్ప అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించడానికై రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రూ.50వేల నుండి రూ.5 లక్షల వరకు రుణాలను ఇస్తామని 6వేల కోట్ల రూపాయలను కేటాయించామని గొప్పలు చెప్పారన్నారు. అంతేకాకుండ జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున నుంచి అర్హులకు రుణాలు అందజేస్తామని ప్రకటించడంతో దీనిని నమ్మి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 లక్షలా 25వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుంటే తీరా వారికి మొండి చేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన లబ్దిదారుల అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలనీ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిబిల్ స్కోరు లేకున్నా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయాలని, లేకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివ కుమార్ , వంశి తదితరులు పాల్గొన్నారు.

### 'కగార్ ఆపరేషన్' పేరుతో మరణాలకు
# కేంద్ర ప్రభుత్వమే బాధ్యత



### ఈనెల 17న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్: కగార్ ఆపరేషన్ పేరుతో ఏడాది కాలంలో 500 మంది ఆదివాసీలు, మావోయిస్టులు, పదుల సంఖ్యలో పోలీసుల మరణాలకు ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలే కారణమని, ఇందుకు వారు బాధ్యత వహించాల్సిందేనని శాంతి చర్చల కమిటీ నాయకులు, వివిధ పార్టీల నేతలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల17న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాలో ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, అన్నివర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాంతి చర్చల కమిటీ నాయకులు జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, అన్వర్‌ఖాన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు ఈరవత్రి అనిల్, బిఆర్‌ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, వామపక్షాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ, ఎం.హన్మేష్ సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఎ. జానకిరాములు (ఆర్‌ఎస్‌పి), ప్రసాదన్న సిపిఐ (ఎంఎల్), సిహెచ్. మురహరి (ఎస్‌యుసిఐ) మాట్లాడారు. తొలుత జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని మార్చి 24వ తేదీన శాంతి చర్చల కమిటీ పిలుపునిచ్చిందని, ఇందుకు వెంటనే స్పందించిన మావోయిస్టు పార్టీ తాము సిద్ధమని ప్రకటించినా రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇందుకు స్పందించకపోవడం దారుణమన్నారు. తమ పిలుపునకు కేంద్ర ప్రభుత్వం స్పందించి మావోయిస్టుల శాంతి చర్చలకు పూనుకుంటే గత 50 ఏళ్లుగా నలుగుతున్న ఈ సమస్యకు పరిష్కారం లభించేదో ఏమో అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా పెద్ద తప్పు చేస్తున్నదని, ఇప్పటికైనా తక్షణమే మావోయిస్టులతో చర్చలకు పూనుకుని మధ్యభారతంలో అంతులేని రక్తపాతానికి కారణమవుతున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంతులేని బలప్రయోగానికి పాల్పడుతోందని, దీనిని సమాజం పట్టించుకుని అడ్డుకోవాలని కోరారు. లేకపోతే ప్రభుత్వ నిర్బంధానికి అంతం ఉండబోదన్నారు. మావోయిస్టులు ఎవరైనా లొంగిపోతే వారికి అన్నివిధాలుగా మద్దతు, రక్షణ కల్పిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన చేయాలని కోరారు.

పశ్యపద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేస్తూ, ఆదివాసీల హక్కులను కాలరాస్తూ మానవ హననానికి పాల్పడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశంలో పేదరికం, అసమానత, అంతరాలు లేని సమాజం కోసం పాలకులు చర్యలు తీసుకుంటే అసలు వామపక్షాలు ఉద్యమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొంత మందిని భౌతికంగా నిర్మూలించవచ్చు గానీ, వారి ఆశయాలను ఎవరూ ఏమి చేయలేరని గుర్తుంచుకోవాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

### మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన అన్ని వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మంత్రులతో ముఖాముఖి 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో 100కు పైగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## హైద్రాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు
### రక్తసిక్తమైన సాగర్ రహదారి

ప్రజాపక్షం /యాచారం : హైద్రాబాద్–నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగురు అక్కడిక్కడే మృతి చెందగా, మరో నలుగురు యువకులకు తీవ్రగాయాలైనాయి. ఈ సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగార్జున సాగర్ సమీపంలో ఉన్న వైజాక్ కాలనీ విహార యాత్రకు వెళ్ళి తిరిగి హైద్రాబాద్‌కు వస్తున్న కారును నగరం నుండి సాగర్ వైపు అతివేగంగా వెళ్తున్న ట్రావెల్సు బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాస సాయి తేజ (24)వృత్తి రీత్యా డ్రైవర్, బాలానగర్, వాస పవన్‌కుమార్ (26) వృత్తి రీత్యా డీలర్. బిఎన్‌రెడ్డి నగర్, వాస రాఘవేంద్ర (22)వృత్తి రీత్యా సూపర్‌వైజర్ వరంగల్‌కు చెందిన వీరు ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో వాస సాయికుమార్(22) బాలనగర్, ఎం.సందీప్(25), మూసపేట్ హైద్రాబాద్, శివకుమార్(25), హైద్రాబాద్ వీరు తీవ్రంగా గాయ పడ్డారు, వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని అసుపత్రికి తరలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉచిత ఇసుక కూపన్ల పంపిణీ బాధ్యతను జిల్లాల కలెక్టర్లకు అప్పగిస్తున్నట్లు ఆయన స్పష్టం చేవారు. బుధవారం ములుగు జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ, నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్క, స్థానిక ఎంఎల్‌ఎ తెల్లం వెంకట్రావులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ములుగు నియోజకవర్గానికి ఇప్పటికే 3500 ఇండ్లు, ఐటిడిఎ పరిధిలో మరో 1500 ఇండ్లను మంజూరు చేశామని, మంత్రిగా సీతక్క అభ్యర్థన మేరకు ములుగు ప్రాంతానికి అదనంగా మరో 1000 ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు హర్షధ్యానాల మధ్య ప్రకటించారు. ఇండ్ల నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తామన్నారు. అటవీ భూముల్లో ఇప్పటికే నివాసం ఉండే వారికి అక్కడే ఇండ్లు కట్టుకునే అవకాశాన్ని కల్పించాలంటూ అటవీ అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు సార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ కేవలం 32వేల ఇండ్లకే ఆమోదం తెలిపి, 60వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేయగలిగిందని, మిగిలినవి మొండిగోడలుగా మిగిలిపోయాయని ఆయన విమర్శించారు. అప్పటి కాంట్రాక్టర్లకు కూడా బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి బలరాం నాయక్, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ టిఎస్ దివాకర, ఎస్‌పి శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



### 'కాళేశ్వరం' తరహా ప్రాజెక్ట్ ఇతర దేశాలలో నిర్మిస్తే
## చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేది

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో నిర్మించిన 'కాళేశ్వరం' తరహా ప్రాజెక్ట్ ఇతర దేశాలలో నిర్మిస్తే కెసిఆర్‌తో పాటు ఆ ప్రాజెక్ట్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిజెపి, కాంగ్రెస్‌ల కుట్రపూరిత రాజకీయాల్లో పావుగా మారడమే విషాదమని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్‌ను పిలిచి ఇరిగేషన్ గురించి అడగడమంటేనే హనుమంతుని ముందు కుప్పిగంతులు వేయడమేనని అన్నారు. హైదరాబాద్ లోని బిఆర్‌కె భవన్ వద్ద కాళేశ్వరం విచారణకు కెసిఆర్ హాజరైన నేపథ్యంలో బిఆర్‌ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. విచారణకు వచ్చిన కెసిఆర్‌కు వారు అభివాదం తెలిపారు. ఇందులో భాగంగానే కెటిఆర్‌తో పాటు మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, సీనియర్ నాయకులు అక్కడికి చేరుకున్నారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయము,
వికారాబాద్ జిల్లా

ఫారం - F (రూల్-7 (c))

సవరణ

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్: జి/2487/2024 తేది : 10.06.2025
సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్ నెంబర్. బి/7450/2024 తేది : 10.06.2025
గెజిట్ నంబర్: వికెబి-15/2025 తేది : 06.06.2025

వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, హకీంపేట్ గ్రామంలో ప్రజా ప్రయోజనం కోసం బహుళార్థసాధక పారిశ్రామిక పార్కు స్థాపన కోసం ఎ. 96.21గుం. (సర్వే నంబరు 252) భూసేకరణకు సంబంధించిన గెజిట్ నంబర్ వికెబి-15/2025, తేదీ: 06.06.2025 ద్వారా నోటిఫికేషన్ ఫారం F ను ప్రజాపక్షం వార్తాపత్రికలో తేదీ: 07.06.2025న పేజీ నంబర్: 5 లో ప్రచురించబడింది.

Written as

తెలంగాణా ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా, బహుళార్త సాధక పారిశ్రామిక వాడ యేర్పాటు కొరకై వికారాబాద్ జిల్లా, దుద్యాల్ మండలం హకీంపేట్ గ్రామా శివారులోని సర్వే నెం.252 భూమి విస్తీర్ణం ఎ.351.10 గుం. లకు ఫారం-సి ప్రకటన జిల్లా కలెక్టర్, వికారాబాద్ లేఖ సంఖ్య: జి/2487/2024, సబ్ కలెక్టర్, తాండూర్, లేఖ సంఖ్య: బి/7450/2024 తేది: 29.11.2024, ద్వారా ప్రకటించనైనది. ఇట్టి ప్రకటనను అనుసరించి ఎ. 96.21 గుం. సంబధించిన భూ యజమానులు సంప్రదింపుల ద్వారా నష్టపరిహారం తీసుకునుటకు అంగీకారము తెలిపినారు. ఈ వివరములు దిగువ చూపబడినవి.
గ్రామం: హకీంపేట్ మండలం: దుద్యాల్ జిల్లా: వికారాబాద్

| క్ర.సం. | పట్టాదారు పేరు / లబ్ధిదారు పేరు | సర్వే నెంబర్ | విస్తీర్ణం | రిమార్కులు |
|---|---|---|---|---|
| 53 | దొరెమోని మల్లేష్ S/o వెంకటయ్య | 252/118 | 2.00 | |
| 54 | దొరెమోని రమేష్ S/o వెంకటయ్య | 252/119 | 2.00 | |
| | మొత్తం విస్తీర్ణం (ఎకరములు గుంటలు) | | 96.21 | |

May Read as

తెలంగాణా ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా, బహుళార్త సాధక పారిశ్రామిక వాడ యేర్పాటు కొరకై వికారాబాద్ జిల్లా, దుద్యాల్ మండలం హకీంపేట్ గ్రామా శివారులోని సర్వే నెం.252 భూమి విస్తీర్ణం ఎ.351.10 గుం. లకు ఫారం-సి ప్రకటన జిల్లా కలెక్టర్, వికారాబాద్ లేఖ సంఖ్య: జి/2487/2024, సబ్ కలెక్టర్, తాండూర్, లేఖ సంఖ్య: బి/7450/2024 తేది: 29.11.2024, ద్వారా ప్రకటించనైనది. ఇట్టి ప్రకటనను అనుసరించి ఎ. 95.21 గుం. సంబధించిన భూ యజమానులు సంప్రదింపుల ద్వారా నష్టపరిహారం తీసుకునుటకు అంగీకారము తెలిపినారు. ఈ వివరములు దిగువ చూపబడినవి.
గ్రామం: హకీంపేట్ మండలం: దుద్యాల్ జిల్లా: వికారాబాద్

| క్ర.సం. | పట్టాదారు పేరు / లబ్ధిదారు పేరు | సర్వే నెంబర్ | విస్తీర్ణం | రిమార్కులు |
|---|---|---|---|---|
| 53 | దొరెమోని మల్లేష్ S/o వెంకటయ్య | 252/118 | 1.20 | |
| 54 | దొరెమోని రమేష్ S/o వెంకటయ్య | 252/119 | 1.20 | |
| | మొత్తం విస్తీర్ణం (ఎకరములు గుంటలు) | | 95.21 | |


సం/- తహశీల్దార్ దుద్యాల మండలం
సం/- సబ్-కలెక్టర్ తాండూర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా

DIPR RO NO. 232/LA/PP/Advt/Pub/2025-26


## ఎర్రవల్లి ఫాంహౌస్‌లో జారిపడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

* తొంటి విరిగి యశోదలో చికిత్స
* పరామర్శించిన కెసిఆర్, కవిత

ప్రజాపక్షం/జనగామ : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పెద్ద ప్రమాదమే జరిగింది. కెసిఆర్‌కు చెందిన ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో జారిపడ్డారు. దీనితో ఆయన తొంటి విరిగింది. వెంటనే ఫాంహౌస్ సిబ్బంది హుటాహుటిన హైదరాబాద్‌లోని యశోద హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనను మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన కూతురు కవిత, ఎమ్మెల్యే హరీష్‌రావు, మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో పాటు పలువురు పరామర్శించారు. ఎలాంటి ప్రమాదం లేదని హాస్పటల్ వైద్యులు తెలిపారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి బిఆర్‌ఎస్ రజతోత్సవాల్లో పాల్గొనేందుకు డల్లాస్ వెల్లారు. అక్కడి నుండి ఈనెల 8న హైదరాబాద్ తిరిగి వచ్చిన పల్లా మంగళవారం జనగామలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 11న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ముందు హాజరు కానున్న నేపథ్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో కలిసి ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు వెళ్లారు. రాత్రి అక్కడే ఉన్న ఆయన తెల్లవారు జామున బాత్‌రూంలో కాలు జారిపోడియనట్లు స్థానికులు చెబుతున్నారు. ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని యశోద హాస్పటల్‌కు తరలించారు. తొంటి భాగం విరిగిపోవడంతో ఆపరేషన్ చేసినట్లు తెలుస్తుంది. కాగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే కోలుకోవాలని జనగామ నియోజకవర్గ కార్యకర్తలు పూజలు చేయడంతో పాటు వేడుకుంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి తొంటి విరిగినందున ఆయన కోలుకోవడానికి రెండు మాసాలు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా ఆయన జారిపడడంతో జనగామ ప్రజలు, కార్యకర్తలు, బిఆర్‌ఎస్ నాయకులు మథనపడుతున్నారు.



## టిజిటిడిసిలో తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయండి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎఐటియుసి నేతలు విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో 23 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అలాగే పదవీ విరమణ 61 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. ఈమేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, ఉపాధ్యక్షుడు తిరుపతి బుధవారం టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టూరిజం కార్పొరేషన్లో 166 మంది కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌గా వీరితో పాటు 350 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులుగా 70 డైలీవేజ్ కార్మికులుగా పని చేస్తున్నామని మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులు రిటైరయిన వారి స్థానంలో మాలో ఎవరిని పర్మినెంట్ చేయలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో అటవీ శాఖ, హెల్త్ విభాగం, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ లాంటి అనేక సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వయోపరిమితిని 61 సంవత్సరాలుగా పరిగణించి వారిని కొనసాగిస్తున్నారని, కానీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను 58 సంవత్సరాలకే పదవీ విరమణ చేస్తున్నారని యూనియన్ నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరించారు. టూరిజం హోటల్స్, రెస్టారెంట్‌లను టూరిజం కార్పొరేషన్ నడిపించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల మాదరిగా ఔట్సోర్సు ఉద్యోగులకు ఎల్.టి.సి. సౌకర్యం కల్పించాలని కూడా కోరారు. జీతభత్యాలు పెంచి ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఎంతటి వారైనా సమాధానం చెప్పాల్సిందే

### ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందే నని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కృంగిపోయిందని, కానీ ఆ అప్పు మాత్రం మిగిలిందని, విచారణ కమిషన్ ముందు హాజరై నిజాలు చెప్పడం కెసిఆర్ బాధ్యత అని తెలిపారు. కెసిఆర్ విచారణకు హాజరవ్వడాన్ని కొందరు రాద్ధాంతం చేయడం సమంజసం కాదని సూచించారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశం బుధవారం జరిగింది. కాగా ప్లీనరీ సమావేశానికి ముందుగా గోషామహల్‌లో కోదండరాం టిజెఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, ర్యాలీగా నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సమావేశంలో టిజెఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్, కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, మహిళా జన సమితి అధ్యక్షురాలు లక్ష్మి , కార్యదర్శి పుష్పలత గౌడ్, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్,రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, ముజాయుద్దీన్, నగర నాయకులు అఫ్జల్, ఇస్మాయిల్, రవికాంత్, ఎం.లక్ష్మ ణ్, జైపాల్ రెడ్డి, జహీర్, జహురుద్దీన్, మెరుగు శ్రీనివాస్ యాదవ్, కాకునూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు & భవనాల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

CTN No.05/SE/R&B/KMM/2025-26 తేది: 02.06.2025 ఖమ్మం, సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్ ప్రకారం ఖమ్మం జిల్లాలో 1 నెం. బిల్డింగ్ పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం కింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. ఆసక్తిగల బిడ్డర్లు టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ:** 26.06.2025న మ.3.30గం.ల లోపు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్ :: ఖమ్మం

DIPR R.O. No. : 3426-PP/CL/ADVT/1/2025-26, Date: 11-06-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్.

NIT No. 09/EE-7(4B)/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణ పనులు

**పని పేరు:** క్ర.సం. 01 నుండి 09 వరకు, **అంచనా విలువ:** రూ.96.99 లక్షలు, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 12.06.2025న మ.02.00గం.లకు, బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది: 17.06.2025న మ.02.15గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి. ఏకాంబరం, ఇఇ (ఎఫ్‌ఎసి), సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, మస్కతి గ్రౌండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నం. 7673951166. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 3436-PP/CL/ADVT/1/2025-26, Date: 11-06-2025

ప్రజాపక్షం
గురువారం, 12 జూన్

## గాజాకు ప్రపంచ సంఘీభావం

గాజా స్ట్రిప్‌లో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న పాలస్తీనియన్లకు అనుకూలంగా, ఒక జాతిని ఏరివేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ఇజ్రాయెల్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యావత్ ప్రపంచం ఏకం కావడం హర్షణీయం. కరవుతో అల్లాడిపోతున్న గాజా వాసులకు అంతర్జాతీయ సమాజం అందిస్తున్న మానవతా సాయాన్ని కూడా ఇజ్రాయెల్ అడ్డుకోవడం దుర్మార్గం. అమెరికా అండతో విచక్షణారహితంగా మారణ హోమం సాగిస్తున్న ఇజ్రాయెల్‌ను అడ్డుకోకతప్పదు. గాజా స్ట్రిప్‌లో మరణవేదన అనుభవిస్తున్న వేలాది మందికి తక్షణ సాయం అందించడం అత్యవసరం. ఈ లక్ష్యంతోనే సుమారు 50 దేశాలకు చెందిన వేలాదిమంది స్వచ్ఛంధ సేవకులు చేపట్టిన 'గ్లోబల్ మార్చ్ టు గాజా' కొత్త ఉద్యమ పంథాకు శ్రీకారం చుట్టనుంది. ఈ వారాంతంలో ఇజ్రాయెల్ సరిహద్దులకు చేరుకోనున్న వేలాది మంది సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల సంస్థలకు చెందిన ప్రతినిధుల కోసం గాజా వేయికళ్లతో వేచిచూస్తున్నది. నిరంతర దాడులు, బాంబుల మోతల నుంచి విముక్తి కోరుతున్నది. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకులు కైరో నుంచి రఫా క్రాసింగ్ వరకూ నిర్వహించే 'గ్లోబల్ మార్చ్' ఇజ్రాయెల్‌కు కనువిప్పు కావాలి. పాలస్తీనాను ప్రపంచ చిత్రపటంలో లేకుండా చేయడమే ఇజ్రాయెల్ లక్ష్యమన్నది జగద్విదితం. జాత్యహంకాన్ని ప్రదర్శిస్తూ, మరో జాతికి నామరూపాలు లేకుండా అణచివేయాలన్న ధోరణి అహంభావానికి పరాకాష్ట. 'పెద్దన్న' పాత్ర పోషిస్తున్నట్టు నటిస్తూ, ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న అమెరికా, గాజా పరిస్థితులపై ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నది. ఒక వైపు 'మానవతా సాయం అందాల్సిందే', 'కాల్పుల విరమణ జరగాల్సిందే' అని ఘనంగా ప్రకటనలు గుప్పిస్తూనే, మరోవైపు ఇజ్రాయెల్ అమానుష వైఖరిని సమర్థిస్తున్నది. గాజాలో శాశ్వత కాల్పుల విరమణ కోరుతూ భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన ఒప్పంద ముసాయిదాను 'వీటో' చేయడంతో అమెరికా వికృత రూపం మరోసారి బయటపడింది. పాలస్తీనాపై కక్షకట్టిన ఇజ్రాయెల్, అమెరికా వైఖరిని ఖండిస్తూ, వేలాదిగా తరలివస్తున్న యూనియన్లు, మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు గురువారానికి ఈజిప్టు రాజధాని కైరో చేరుకోనుండడం, ప్రపంచ రాజకీయాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టడం ఖాయం. గాజాపై విధించిన 'అమానవీయ' దిగ్బంధనను ఎత్తివేయాలన్నది ఈ యాత్ర ప్రధాన డిమాండ్. ఎటువంటి రాజకీయ అనుబంధాలు లేదా అధికారిక స్పాన్సర్‌షిప్ లేకుండా, ప్రపంచ సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి జరుగుతున్న ప్రయత్నం ప్రశంసనీయం. కుట్రపూరిత విధానాలు అవలంభిస్తూ, వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని పాటిస్తున్న ప్రభుత్వాలపై సామాజిక ఒత్తిడి పెంచడమే లక్ష్యం. రఫా క్రాసింగ్ వద్ద నిర్వహించే శాంతియుత ప్రదర్శనలు, యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తాయి. మానవతా సహాయం ప్రవేశంపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దిగ్బంధనం తొలగితే, ఈ యాత్ర లక్ష్యం నెరవేరినట్టే. ఇప్పుడు కూడా గాజా పరిస్థితులపై మౌనం వీడని దేశాలను చరిత్ర క్షమించదు. పాలస్తీనియన్ల ఉనికి లేకుండా చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఫలించవని ఇజ్రాయెల్, దానికి మద్దతునిస్తున్న అమెరికా ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. గాజా హ్యూమనిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్)కు పెరుగుతున్న ఆదరణను నిర్లక్ష్యం చేస్తే, భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదు. ప్రపంచం మొత్తం పాలస్తీనా వెనుక ఉంది. సంఘీభావం ప్రకటిస్తున్నది. మానవతా సాయం అవసరాన్ని చాటుతున్నది. 'గ్లోబల్ మార్చ్ టు గాజా' సృష్టించబోయే నిరసన సునామీని ఎదుర్కోవడం ఇజ్రాయెల్‌కు అసాధ్యం. యుద్ధాలతో ఒక ప్రాంతాన్ని లేదా ఒక జాతిని లేదా ఒక దేశాన్ని నామరూపాల్లేకుండా తుడిచివేయడం అసాధ్యమని చరిత్ర పుటలు తిరగేస్తే స్పష్టమవుతుంది. ఇజ్రాయెల్ అలాంటి భ్రమల్లో ఉంటే... కఠినమైన వాస్తవాన్ని తెలుసుకునే రోజు ఎంతోదూరంలో లేదు.

# రాహుల్‌గాంధీ ఆరోపణలపై ఇసి డొంకతిరుగుడు

**అరుణ్ శ్రీవాస్తవ**

పరిశీలన అనేది వాస్తవాలు, క్షేత్రస్థాయి వాస్తవాలపై నిశితమైన, సమగ్ర పరిశీలన. ఈ విశ్లేషణలలో వ్యక్తిగత పక్షపాతం ఉండవచ్చు, కానీ అది రాజకీయ ఎజెండాను నిర్దేశించడానికి ఉపయోగించబడకూడదు. అయినప్పటికీ, రాహుల్ గాంధీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం పాత్రపై చేసిన విమర్శలను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రిక నిపుణులు పరిశీలించడం, ఈ ఆపరేషన్‌కు కాషాయ వ్యవస్థ ముద్ర ఉందని అనే అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

తమ పరిశీలనను విపులీకరించడం సమంజసం కాదని నిపుణులు భావించారు : 'గాంధీ విమర్శలు రికార్డులలో ఎంపిక చేసుకున్న అంశాలనే పేర్కొంటూ, కీలకమైన సందర్భాన్ని విస్మరించారు'. రాహుల్ ప్రస్తావించని రికార్డులపై వారు మరింత దృష్టి సారించి ఉంటే, అది పాఠకులకు అవగాహన కల్పించి, రాహుల్ మేధో దివాళాకోరుతనాన్ని బయటపెట్టి ఉండేది. రాహుల్ తన ప్రారంభ పేరాలో ఇలా పేర్కొన్నారు– 'ఓటర్ల జాబితాలు, సిసిటివి ఫుటేజ్ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగించాల్సిన సాధనాలు. అవి తాళం వేసి ఉంచాల్సిన ఆభరణాలు కావు. ఏ రికార్డులు కూడా నాశనం కాలేదని లేదా భవిష్యత్తులో నాశనం కాబోవని భారతదేశ ప్రజలకు హామీ ఇచ్చే హక్కు ఉంది' అని ఆయన చెప్పడం చాలా ముఖ్యమైనది. ఈ నేపథ్యంలో నిపుణుల పని మరింత స్పష్టమైంది.

ఎన్నికల కమిషనర్ల నియామకానికి బాధ్యత వహించే ప్యానల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో నరేంద్ర మోదీ ఒక క్యాబినెట్ మంత్రిని నియమించడంపై రాహుల్ చేసిన వ్యాఖ్యను నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇది 2023 సుప్రీంకోర్టు తీర్పును అతిక్రమించడమే కాకుండా, ఎంపిక ప్రక్రియ నిష్పాక్షికతపై ఆందోళనలను పెంచుతుంది. కాంగ్రెస్ ద్వేషించే రాజకీయ నాయకుడి మాదిరిగానే, నిపుణులుగా చెప్పబడే వీరు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు న్యాయమూర్తుల నియామక యంత్రాంగాన్ని సంస్థాగతం చేయనందుకు నిందిస్తున్నారు. తమ వాదనకు మరింత బలం చేకూర్చడానికి, 2007లో కాంగ్రెస్ నాయకుడు ఎం.వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పరిపాలనా సంస్కరణల కమిషన్ (ఎఆర్‌సి), ఎన్నికల సంఘం 'విస్తృత ప్రభావం చూపే ప్రాముఖ్యత'ను ఉటంకిస్తూ, ఎన్నికల కమిషనర్లను నియమించడానికి కొలీజియం వ్యవస్థను సిఫార్సు చేసిందని నిపుణులు అంటున్నారు.

> **ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు, న్యాయ శాఖ మంత్రి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌తో కూడిన ఒక ఎంపిక ప్యానల్‌ను ఎఆర్‌సి ప్రతిపాదించింది. కానీ ఈ సిఫార్సు ఎన్నడూ అమలు కాలేదు. ఇదే తరహాలో జస్టిస్ ఎ.పి. షా నేతృత్వంలోని 20వ లా కమిషన్ చేసిన ప్రతిపాదనతో కూడిన నివేదికను 2015లో ఎన్‌డిఎ ప్రభుత్వానికి సమర్పించింది. అది కూడా అమలు కాలేదు. ఎన్నికల కమిషనర్లను ప్రధాన మంత్రి, హోం మంత్రులిద్దరూ త్రిసభ్య కమిటీలో 2:1 మెజారిటీతో ఎంపిక చేసేలా ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం–2023 చూసింది. ఎందుకంటే మూడవ సభ్యుడు, ప్రతిపక్ష నాయకుడు ఎల్లప్పుడూ ఓడిపోవచ్చు.**

అయితే, కాంగ్రెస్, నరేంద్ర మోదీ మధ్య ఒక ప్రాథమిక వ్యత్యాసం ఉంది. కాంగ్రెస్ ఎఆర్‌సి సూచించిన విధంగా ఒక కమిటీని ఏర్పాటు చేయనప్పుడు, మోదీ ప్రజాస్వామ్య నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి ఒక ఎంపిక కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, ఒక క్యాబినెట్ మంత్రి సభ్యులుగా త్రిసభ్య కమిటీని ఆయన ఏర్పాటు చేశారు. మోదీ 2:1 మెజారిటీని ఆస్వాదించారు. గతంలో ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి మూడవ సభ్యుడిగా ఉండేవారు. కానీ ఎలాంటి అవకతవకలకు అవకాశం కల్పించదనే ఆందోళనతో మోదీ ప్రాథమిక కూర్పును మార్చేందుకు పూనుకున్నారు. మోదీ విశ్వసించదగిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేసారనే పేరుతో ఆయన చర్యను సమర్థించడానికి, 'ఇప్పుడు, సంప్రదింపులు ఉన్నాయి, పారదర్శకత ఉంది, మెజారిటీ భావన ఉంది' అని ఒక ఇసి అధికారి చేసిన వ్యాఖ్యలను నిపుణులు ఉటంకిస్తున్నారు.

రాహుల్‌గాంధీని నిపుణులు నిందించే మరో అంశం, 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల మధ్య ఐదు నెలల్లో మహారాష్ట్రలో 41 లక్షల మంది కొత్త ఓటర్లు చేరడాన్ని 'అద్భుతమైన పెరుగుదల' అని ఆయన చేసిన పరిశీలన. అందులో వారు ఎలాంటి తప్పును కనిపెట్టలేదు. వాస్త వానికి, 2019 శాసనసభ ఎన్నికలలో మహా రాష్ట్రలో నమోదైన ఓటర్ల సంఖ్య 8.98 కోట్లు అని, ఇది 2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటికి 9.29 కోట్లకు పెరిగిందని ఇసి ధృవీకరించింది. 2024 నవంబర్ శాసనసభ ఎన్నికల నాటికి, ఈ సంఖ్య 9.70 కోట్లకు పెరిగింది. ఐదేళ్లలో 31 లక్షలు పెరిగితే, కేవలం ఐదు నెలల్లో 41 లక్షలు పెరిగింది.



రాహుల్‌గాంధీ | కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం

బూత్ లెవెల్ ఏజెంట్(బిఎల్ఎ)ల పాత్ర గురించి నిపుణులు మాట్లాడే తీరు, వారికి వారి పాత్ర గురించి స్పష్టమైన అవగాహన లేదని స్పష్టం చేస్తుంది. బిఎల్ఎలు నిర్దిష్ట బూత్ వద్ద పోలింగ్ ప్రక్రియను పరిశీలించాలి. వారు 'ప్రిసైడింగ్ అధికారి'తో సంభాషించాలి కానీ 'ఎన్నికల అధికారి'తో కాదు. ప్రిసైడింగ్ అధికారి గత ఎన్నికలలో ఓటర్ల సంఖ్య, పోలైన ఓట్ల వివరాలను అందించాల్సిన అవసరం లేదు. ఆయన రోజువారీ ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉంటుంది. క్రితం సారితో పోలిస్తే ఓటర్ల సంఖ్యలో పెరుగుదల గురించి తెలుసుకోవలసిన అవసరం ఆయనకు లేదు. ఐదు నెలల్లో ఓటర్ల సంఖ్యలో ఈ అసాధారణ పెరుగుదల ఎలా జరిగిందో కనుగొనడం ఇసి బాధ్యత. ఇది స్పష్టంగా ఎన్యూమరేటర్లు తమ పనిని అంకితభావంతో చేయలేదని లేదా కొన్ని అవకతవకలు జరిగాయని సూచిస్తుంది. ఎన్యూమరేటర్ల వైఫల్యానికి, ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.

ఇది తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసే ప్రతి దశలో రాజకీయ పార్టీలు పాల్గొంటాయని; అధికారులు రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తారని, వారికి ముసాయిదా, తుది జాబితాల ఉచిత కాపీలను అందిస్తారని ఇసి చేస్తున్న వాదన ఓటర్ల పెరుగుదల అంశాన్ని నిరాకరిస్తుంది. వారు వివరించిన ప్రకారం ప్రక్రియను కచ్చితంగా పాటించి ఉంటే, ఈ అసాధారణ పెరుగుదలను చాలా ముందుగానే గుర్తించి ఉండాలి.

ఓట్ల సంఖ్య పెరుగుదలపై రాహుల్ ఆరోపణను నిపుణులు కూడా అంగీకరించరు. ఎన్నికల ప్రక్రియలో సాయంత్రం 5 గంటలలోపు లేదా ఇసి నిర్ణయించిన పోలింగ్ సమయానికి పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న లేదా ప్రవేశించిన ఓటర్లను ఓటు వేయడానికి అనుమతించాలి. ఈ నేపథ్యంలో సమయ పరిమితి లేదు. చివరి ఓటరు ఓటు వేసే వరకు బిఎల్ఎలు లోపల కూర్చుంటారు. చివరి ఓటింగ్ తర్వాత పోలింగ్ అధికారి పోలైన మొత్తం ఓట్ల సంఖ్యను బిఎల్ఎలకు తెలియజేస్తారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. కానీ మహారాష్ట్ర విషయంలో పోలింగ్ మరుసటి రోజు ఉదయం పోలైన మొత్తం ఓట్ల సంఖ్యను బహిరంగంగా ప్రకటించిన తన ఏకపక్ష చర్యను ఇసి సమర్థించుకోలేకపోయింది.

రాజకీయ పార్టీలు ఏదైనా అక్రమాలు జరిగాయని అనుమానం పెంచుకుంటే, ఇసి దానిని నివారించడానికి, స్పష్టంగా చెప్పడానికి ఎందుకు వెనుకాడింది? భారీ ఓటింగ్ కారణంగా పోలింగ్ అర్ధరాత్రి దాటినా కొనసాగుతుందని మీడియా ద్వారా ఇసి సందేశాన్ని తెలియజేయాలి. 2024లో మహారాష్ట్రలో సగటున గంటకు 58 లక్షల మంది ఓటర్లు తమ ఓట్లను వేశారని ఇసి పేర్కొంది. దీని ఆధారంగా, చివరి రెండు గంటల్లోనే 116 లక్షల మంది ఓటర్లు ఓటు వేసి ఉండేవారు. అప్పుడు 76 లక్షల మంది ఓటర్ల పెరుగుదల పూర్తిగా నమ్మశక్యంగా మారుతుంది. కానీ విచిత్రంగా, ఓటర్ల సంఖ్యలో పెరుగుదల రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతిగా లేదు. 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి పేలవంగా రాణించిన 85 నియోజకవర్గాల్లోని 12,000 బూత్‌లలో ఈ పెరుగుదల కేంద్రీకృతమై ఉంది.

> **స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో 'ఓటింగ్ గోప్యత' అనే ప్రాథమిక సూత్రం గురించి తెలియని అమాయకుడిగా నిపుణులు రాహుల్‌ను చిత్రీకరించడం నిజంగా హాస్యాస్పదంగా ఉంది. నిజం ఏమిటంటే, ఇసి రాహుల్‌పై ఈ అభిప్రాయాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. ఇసి ఉద్దేశాలు నిజమైతే, పక్షపాతం లేనివైతే, ఓటర్లలో గణనీయమైన పెరుగుదలను 'యువత భాగస్వామ్యంలో స్వాగతించదగిన ధోరణి' అని అభివర్ణించినప్పుడు దానిని దాచాల్సిన అవసరం లేదు. ఇది యువత భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తే, అది రాష్ట్రవ్యాప్తంగా ప్రతిబింబించి ఉండాలి. కేవలం 12,000 బూత్‌లకు పరిమితం కాకూడదు.**

ప్రతిపక్ష నాయకుని అభ్యర్థనను ఇసి అంగీకరించడంలో హాని ఏమిటి? అది దాని ప్రతిష్ట, గౌరవాన్ని ఎంత మాత్రం దెబ్బతీయదు. బదులుగా, రాహుల్ ఓటర్ల పేర్లను తెలుసుకోవాలని కోరుతున్నాడని ఇసి ఒక తప్పుడు కథనాన్ని సృష్టించడానికి ప్రయత్నించింది. ప్రజలలో ఆయన ప్రతిష్టను తగ్గించడానికి ఇది ఒక పన్నాగం. ఆయన అర్ధరాత్రి పోలింగ్ బూత్‌లకు చేరు కున్న ఓటర్ల గురించి తెలుసుకోవాలని కోరాడే తప్ప వారు ఎవరికి ఓటు వేశారో తెలుసుకోవడానికి కాదు.

2024 డిసెంబర్‌లో ఇసి కేంద్రంతో సంప్రదింపుల జరిపిన తర్వాత, ఎలక్ట్రానిక్ రికార్డులను పొందడాన్ని పరిమితం చేయడానికి 1961 నాటి ఎన్నికల నియమావళిని ఎందుకు సవరించిందన్న విషయంపై ఇసి సమాధానం చెప్పాలి. ముఖ్యంగా, గతంలో పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయవాది మెహమూద్ ప్రాచాకు ఫుటేజీని అందజేయాలని ఆదేశించింది. కానీ కమిషన్ ఇవ్వలేదు. సిసిటివి ఫుటేజీని అందించడం ఓటు గోప్యతను ఉల్లంఘించడమే అని ఇసి వివరణ ఇచ్చింది. హైకోర్టు కంటే న్యాయపరమైన చిక్కులు, పర్యవసానాల గురించి తనకు బాగా తెలుసునని ఇసికి భావిస్తుందా?

(ఐపిఎ సర్వీసెస్)

# నేటి బాలలే భావి పౌరులు
# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం!


ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనా ప్రకారం ప్రపంచంలో 5 నుంచి 14 ఏళ్ల లోపు బాల కార్మికులు 15కోట్ల మంది పైచిలుకే ఉన్నారు. భారత్‌లో 7–15 మధ్య వయస్సు ఉన్నవారు 2.8 కోట్ల మంది బాల కార్మికులుగా దుర్భర పరిస్థితులను గడుపుతున్నారని ఒక నివేదిక వివరించింది. వీరం తా పూర్తి కాలం శ్రమ చేసే బాల కార్మికులు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో బాల కార్మికులు గల దేశం కూడా, వీళ్లంతా 14 ఏళ్లలోపు బాలలే.

ఆడుతూ, పాడుతూ, పాఠాలు చదువుతూ, కాలం గడపాల్సిన వీరంతా పరిశ్రమల్లోనూ, పంట పొలాల్లో, పాడి గేదెల మధ్యను, గనులలోనూ, కార్ఖన్నాల్లో నలిగిపోతున్నారు. వెట్టి కార్మికులుగా మగ్గిపోతున్నారు. బలవంతంగా వ్యభిచార కూపంలో కూరుకుపోతున్నారు. అనాథలు, ఆప్తులు వదిలేసిన చిన్నారుల పరిస్థితి మరి దయనీయంగా ఉందని, బాల కార్మికులపై నిర్వహించిన అధ్యయన నివేదిక తెలిపింది.

పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యతల కారణంగా బాల బాలికలు రోజుకు 10 నుండి 12 గంటల వరకు బానిసత్వంలో మగ్గుతున్నారు. పేదరికం అనుభవించే వారిలో తాత్కాలిక ప్రయోజనాలే కనిపిస్తాయి. నోటికి బుక్కెడు బువ్వకు మాత్రమే వారి తపన. రేపటి భవితను గూర్చి ఆలోచనలకు ఆస్కారం ఉండదు.

విశ్వ వ్యాపితమైన బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు అనాదిగా జరుగుతూనే ఉన్నాయి. ఈ పోరాటంలో భాగం గా అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) నేతృత్వంలో ప్రపంచవ్యాప్తంగా జూన్ 12న 'ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని' జరుపుకోవాలని 2002 నుండి అనవాయితీగా వస్తున్నది. ఐఎల్ఓలోని 187 సభ్య దేశాలలో బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి పటిష్ట ప్రణాళికలు తీసుకుంటున్నాయి. ఐఎల్ఓ గణాంకాల ప్రకారం వందల మిలియన్ల బాల కార్మికులను నిర్బంధంలో పని చేయిస్తూ విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ సంతోషాలకు దూరం చేస్తూ, శారీరక మానసిక ఎదుగుదల లేకుండా వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నది.

> **మన దేశంలో 14 సంవత్సరాలు లోపు బాల బాలికలతో ఎలాంటి పనులు చేయకూడదని బాల కార్మిక విమోచన చట్టాన్ని 1986లో దేశంలో తీసుకురావడం జరిగింది. వారిని నిర్బంధంగా బడిలో చేర్పించాలని.. నిర్బంధ విద్య ప్రవేశపెట్టడం, బాలల పోషణకు, వారి మానసిక, శారీరక పెరుగుదలకు ఉపయోగపడే ఆహారాన్ని అందించడం లాంటి చర్యలు చేపట్టడం.. వారు చేస్తున్న సంస్థల్లో.. యజమానుల నుండి పెనాల్టీ రూపంలో వసూలు చేసి బాల కార్మికుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుటకు అందించాలని చట్టంలో పేర్కొనటం జరిగింది. రెవెన్యూ, కార్మిక శాఖలు పర్యవేక్షిస్తూ.. బాల కార్మిక కుటుంబాలలో అవేర్‌నెస్ తీసుకొస్తూ.. బాల కార్మిక వ్యవస్థను కొంతవరకు నిర్మించగలుగుతున్నాం.**

2000 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 246 మిలియన్ల(5–17 వయస్సు ఉన్నవారు) ఉన్న బాల కార్మికుల సంఖ్య 2016 నాటికి 153 మిలియన్లకు తగ్గిందని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, బాలలను పనులలో వినియోగించే వారిని నిరోధించడం, ప్రమాదకర పనులను గుర్తించి పిల్లలను దూరంగా ఉంచడం, ఉచిత విద్య హక్కును కల్పించడం, కుటుంబాలకు కనీస పని దినాలను కల్పించడం, బాలల హక్కులను కాపాడుతూ అతిక్రమించిన వారిని కఠినంగా దండించడం వంటి కఠిన చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో ప్రభుత్వ, స్థానిక, స్వచ్ఛంద, పౌర అంతర్జాతీయ సమాజంతో బాల కార్మిక సంస్కృతికి మంగళం పాడాల్సి ఉంది.




> **ఏటా జూన్ 12న విశ్వవ్యాప్తంగా బాల కార్మిక దురాచారానికి వ్యతిరేకంగా విశేష కార్యక్రమాలను చేపట్టడం అనివార్యంగా జరపాలని ఐఎల్ఓ పిలుపు నిచ్చింది.**

భారతదేశ ప్రతిష్టకు భంగం కలిగించే అంశాలలో బాల కార్మిక వ్యవస్థను ఒక ముఖ్యమైన రంగంగా పరిగణించాలి. పసి వయసులో ఉన్న వారిని కాని పనులకు బలి చేయకుండా ఉండేందుకు బాల కార్మిక నిషేధ చట్టం 1986లో రూపొందించారు. 1935 లో బాల కార్మికుల ఉద్యోగ చట్టం (ఎంప్లాయిమెంట్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్)ను తొలగించి ఈ చట్టం రూపొందించారు. ఈ చట్టం కింద 14 సంవత్సరాల వయసు పూర్తికాని బాలుడు డబ్బు రూపేనా లేదా వస్తు రూపంలో వేతనం తీసుకొని పని చేసేందుకు నియమితుడైన ఆ వ్యక్తి 'బాల కార్మికుడు' 1989 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్నవారిని బాల్య దశగా గుర్తించాలని చెప్పింది. 2018 లో 18 సంవత్సరాలలోపు బాల బాలికలను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రెండు చట్టాలను అమలు చేయవలసి ఉంటుంది. దీనిని పకడ్బందీగా అమలుపరిచేందుకు ప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకు బాల కార్మిక సాంకేతిక సలహా మండలి కేంద్రం ఏర్పాటు చేసింది. అదేవిధంగా రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ సలహా మండలిని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో బాల కార్మికులు లేని సమాజాన్ని తీర్చిదిద్దాలని ఆశిద్దాం!

(నేడు బాలకార్మిక నిర్మూలన దినోత్సవ సందర్భంగా)

# నెహ్రూ నుంచి బంగారు పతకం అందుకున్న ప్రఖ్యాత వైద్యుడు భూంరెడ్డి

ఉత్తర తెలంగాణలో డాక్టర్ భూం రెడ్డి అంటే తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదు. కరీంనగర్ కేంద్రంగా చేసుకొని తొలితరం సివిల్ సర్జన్‌గా ఆయన చేసిన అపారమైన వైద్య సేవలు అనన్యసామాన్యం, అభినందనీయం. వైద్య రంగంలో ఉత్తర తెలంగాణ భీష్మ పితామహుడిగా పేరొందిన డాక్టర్ భూం రెడ్డి దవాఖానా అంటేనే రోగులకు ఒక నమ్మకం, ప్రాణం మీద ఓ గట్టి భరోసా. గ్రామీణ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం నుంచి ఎదిగిన డాక్టర్ భూం రెడ్డి జీవన ప్రస్థానం మనందరికీ, ముఖ్యంగా నేటి వైద్యులకు దారి దీపంగా నిలుస్తుంది.



**జంగంపల్లి నుంచి ఎయిమ్స్–ఢిల్లీ వరకు విద్యా ప్రస్థానం**

1936 జూలై 9న వి.లక్ష్మి దేవి కిష్టారెడ్డి దంపతులకు నిజామాబాద్ జిల్లా, కామారెడ్డి సమీప జంగంపల్లి గ్రామంలో జన్మించిన భూం రెడ్డి పాఠశాల విద్యను జంగంపల్లి, దోమకొండ, కామారెడ్డిల్లో పూర్తి చేసి, 1953–55లో హైదరాబాద్ నిజాం కళాశాలలో పియూసి (ఇంటర్) పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా మెడికల్ కళాశాలలో 1955–60 మధ్య ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అనంతరం ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ లేదా ఎయిమ్స్, ఢిల్లీలో ఎంఎస్ జనరల్ సర్జరీని 1963లో ప్రథమ స్థానంలో పూర్తి చేసి, నాటి దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ సగర్వంగా అందుకున్న అత్యున్నత వైద్య నిపుణులు మన ప్రియతమ తెలంగాణ ముద్దు బిడ్డ డాక్టర్ భూం రెడ్డి. అంతే కాకుండా నెహ్రూకు అనారోగ్యం కలిగినపుడు వైద్యం కూడా చేసిన ఘనుడు మన డాక్టర్ భూం రెడ్డి. ఎయిమ్స్‌లో జనరల్ సర్జరీ పూర్తి చేసిన తర్వాత అమెరికన్లు తమ దేశం రావాలని కోరినప్పటికీ తన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఏకైక లక్ష్యంతో తెలంగాణలో స్థిరపడిన దేశ భక్తుడు మన డాక్టర్ భూం రెడ్డి.

**ఉద్యోగ, వైద్య వృత్తి పర్వం**

1963–64లో ఢిల్లీ ఎయిమ్స్‌లో రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ భూం రెడ్డి అనంతరం ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసారు. 1964 అక్టోబర్ నుంచి 1969 వరకు వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో రిజిస్ట్రార్‌గా, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీగా అటు బోధనలో, ఇటు వైద్య చికిత్సల్లో విస్తృత అసమాన్య సేవలు అందించారు. 1969 నుంచి 1976 వరకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ స్థాయిల్లో విశేష వైద్య సేవలను అందించారు. తర్వాత కరీంనగర్ పట్టణంలో డాక్టర్ భూం రెడ్డి దవాఖానాను ప్రారంభించి గత ఐదు దశాబ్దాలుగా శస్త్ర చికిత్స నిపుణుడిగా అవిశ్రాంత సేవలను అందించారు. పేదల పక్షపాతిగా, ప్రజా వైద్యులుగా, ప్రజలకు నమ్మకమైన వైద్యులుగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎనలేని సేవలను అందించిన మన డాక్టర్ భూం రెడ్డి నిరాడంబరత మనందరికీ ఆదర్శం.

**బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రియతమ డాక్టర్**

నాటి తొలి తరం జనరల్ సర్జన్‌గా వైద్యరంగంలో అపారమైన సేవలను అందించిన డాక్టర్ భూం రెడ్డి ఉత్తర తెలంగాణ పౌర సమాజానికి ఎనలేని సేవలను అందించారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, ఐఎంఎ కరీంనగర్ శాఖకు జీవితకాల గౌరవ సలహాదారుగా నేటి వైద్యులకు, ఆసుపత్రులకు చక్కటి మార్గనిర్దేశనం చేస్తూ వచ్చిన డాక్టర్ భూంరెడ్డి వ్యక్తిత్వం మహోన్నతం, ప్రవర్తన ప్రశంసనీయం. కరీంనగర్‌లో చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల, రేకుర్తి లయన్స్ కంటి ఆసుపత్రి, కరీంనగర్ ఐఎంఎ భవన నిర్మాణం, శుశ్రూత క్యాన్సర్ ఆసుపత్రి లాంటి ముఖ్య ఆసుపత్రుల స్థాపనలో ప్రధాన భూమికను నిర్వహించారు. ముఖ్యంగా ఆర్‌బివిఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం కరీంనగర్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆయన చూపిన చొరవ, చేసిన కృషి నేటికీ అందరి మనస్సుల్లో నాటుకొని పోవడం హర్షదాయకం.

**వైద్యోనారాయణోహరి**

డాక్టర్ భూం రెడ్డి అతి సాధారణంగా కనిపించే అపర మేధావి. ఎన్నడూ నేల విడిచి సాము చేయని మహామనీషి. మానవీయతకు చిరునామా, మనుషుల్లో దేవుడు, వైద్యోనారాయణోహరి. సరోజినీ దేవిని వివాహ మాడిన డాక్టర్ వి.భూంరెడ్డికి పుత్రుడు ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.సూర్యనారాయణ రెడ్డి, ముగ్గురు యోగ్యులైన కుమార్తెలు ఉన్నారు. నేడు డాక్టర్ వి.భూం రెడ్డి కుటుంబంలో పలువురు వైద్య నిపుణులు ఉండడం, వారు ప్రజా సేవలో పునీతులు కావడం ఉత్తర తెలంగాణ ప్రజలు చేసుకున్న పుణ్యంగా భావిస్తారు. డాక్టర్ భూం రెడ్డి చేయి పడితేనే రోగులకు ఉపశమనం కలిగేది అంటే నమ్మశక్యంగా ఉండని వాస్తవం. డాక్టర్ భూం రెడ్డి విస్తృత పౌర సంబంధాలను కలిగి ఉండడం, ఆయన వైద్య చికిత్సలతో బయటపడిన రోగులు/కుటుంబాలు బోరున విలపించడం, అందరినీ ఆత్మీయంగా పలకరించడం అనుభవించిన వారందరూ నేడు అశ్రునయనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలకడం జరుగుతోంది.

**గత కొన్ని రోజులుగా వయస్సు రీత్యా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, 2025 జూన్ 9న సాయంత్రం 4:40 గంటలకు తుది శ్వాస విడిచారు డాక్టర్ భూంరెడ్డి.** అతి సాధారణ కూలీ నుంచి మంత్రుల వరకు అందరూ ఆయన చేసిన వైద్యపరమైన, ఇతర రంగాల సేవలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టడమే ఆయన చేసిన అమూల్య సేవలకు నిదర్శనం. ఆయన చూపిన బాటలో నేటి తరం వైద్యులు నడవాలని, ఆయన ఎదిగిన క్రమం నేటి యువతకు ప్రేరణ కావాలని, ఆయన చూపిన వాత్సల్యం నేటి పౌర సమాజానికి దారి దీపం కావాలని కోరుకుందాం, డాక్టర్ భూం రెడ్డి అమర్ రహే అంటూ కన్నీటి నివాళులు అర్పిద్దాం.

– డా.బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆర్థిక వ్యవస్థలో ప్రగతి.. ఆదాయంలో అసమానతలు!

సుమారు 4.2 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం రూపాంతరం చెందింది. జపాన్‌ను వెనక్కి నెట్టి అమెరికా, చైనా, జర్మనీ తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది. మరికొన్నేళ్లలో జర్మనీని సైతం అధిగమించే అవకాశముంది. అయితే ఇది ఒకవైపు మాత్రమే. మరోవైపు నామినల్ పర్ క్యాపిటా జిడిపిలో మాత్రం భారత్ తీవ్రంగా వెనకబడి ఉంది. 196 దేశాలతో పోల్చుకుంటే 143వ స్థానంలో ఉంది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం భారతదేశ తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. అంటే సుమారు రెండున్నర లక్షల రూపాయలు. జిడిపిలో టాప్ 5లోని దేశాల్లో ఉన్న తలసరి ఆదాయం కంటే ఇది ఎంతో తక్కువ.

**పర్ క్యాపిటా జిడిపిలో ఎంతో దూరం**

టాప్ 5 జిడిపి దేశాల్లో ఉన్న పర్ క్యాపిటా జిడిపితో పోల్చుకుంటే భారతదేశం ఎంతో వెనకబడి ఉంది. 30.34 ట్రిలియన్ డాలర్లతో జీడీపీలో మొదటి స్థానంలో ఉన్న అమెరికా.. 89,108 డాలర్ల (సుమారు రూ.75 లక్షలు) పర్ క్యాపిటా జిడిపితో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉన్నది. 19.53 ట్రిలియన్ డాలర్లతో జిడిపిలో రెండో స్థానంలో ఉన్న చైనా 13,657 డాలర్ల (సుమారు రూ.11.65 లక్షలు)తో తలసరి ఆదాయంలో 70వ స్థానంలో ఉన్నది. 4.92 ట్రిలియన్ డాలర్లతో జిడిపిలో మూడో స్థానంలో ఉన్న జర్మనీలో పర్ క్యాపిటా జిడిపి 55,952 డాలర్లు (రూ.47.67 లక్షలు) కాగా, తలసరి ఆదాయంలో ఆ దేశం 19వ స్థానంలో ఉన్నది. అదే భారతదేశానికి వస్తే 4.187 ట్రిలియన్ డాలర్లతో జిడిపిలో నాలుగో స్థానంలో ఉండగా, పర్ క్యాపిటా జిడిపి మాత్రం 2,897 డాలర్లు (రూ.2.5 లక్షలు) మాత్రమే. ప్రపంచ ర్యాంకింగ్ లో 143వ స్థానంలో ఉంది. మరోవైపు ఇటీవల భారత్ అధిగమించిన జపాన్ 4.186 ట్రిలియన్ డాలర్లు కాగా, ఆ దేశం 34, 146 డాలర్ల (సుమారు రూ.28.92 లక్షలు) తో పర్ క్యాపిటా జిడిపిలో 28వ స్థానంలో ఉండడం గమనార్హం. దీంతో జిడిపి ఆధారంగా దేశాల ఆర్థిక వ్యవస్థలను పోల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

– మహమ్మద్ ఆరిఫ్,
7013147990




# జాతీయం
NATIONAL & GENERAL NEWS

### రాహుల్‌గాంధీపై విమర్శలు..
## డిగ్గీరాజా సోదరుడిపై బహిష్కరణ వేటు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన దిగ్విజయ్ సింగ్ సోదరుడు లక్ష్మ ణ్ సింగ్‌పై ఆ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై బహిష్కరణ వేటు వేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్‌గాంధీపై, వాయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రాపైన లక్ష్మ ణ్‌సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వెనుకాముందు ఆలోచించకుండా ముఖ్యనాయకులను అవమానించే వ్యాఖ్యలు చేసినందుకు మల్లికార్జున్‌ఖర్గే.. లక్ష్మ ణ్ సింగ్‌ను బహిష్కరించారని కాంగ్రెస్ పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. ఆరేళ్లపాటు ఆయనను బహిష్కరించినట్లు తెలిపింది. రాహుల్‌గాంధీ, రాబర్ట్ వాద్రా అమాయకుల్లా మాట్లాడుతున్నారని, వారి తెలివితక్కువతనం వల్ల దేశం అనేక పరిణామాలను ఎదుర్కొంటోందని పహల్గాం ఉగ్రదాడిపై లక్ష్మ ణ్‌సింగ్ వ్యాఖ్యానించారు. కించపర్చేలా మాట్లాడిన మీపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలుపాలని పేర్కొంటూ కాంగ్రెస్ హైకమాండ్ షోకాజ్ నోటీసులు పంపింది. ఆ నోటీసులకు లక్ష్మ ణ్ సింగ్ సమాధానం ఇవ్వకపోవడంతో ఆయనపై బహిష్కరణ వేటు వేసింది.

# 11ఏళ్లు, 33 తప్పిదాలు
## మోదీ సర్కార్‌పై మండిపడిన ఖర్గే

**కలబురగి:** నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన కేవలం అబద్ధాలు, యువకులను మోసం చేయడానికే పరిమితమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 11 ఏళ్లలో 33 తప్పిదాలు చేశారని, పార్లమెంటులో కూడా తాను ఇదే మాట చెప్పిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పడం, యువకులను మోసం చేయడం, పేదలను కడగండ్లపాలు చేస్తున్న ఇలాంటి ప్రధానికి తన రాజకీయ జీవితంలోనే చూడలేదని ఘాటుగా విమర్శించారు. బుధవారం ఖర్గే బాలబురగిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ ఎన్ని హామీలు ఇచ్చారో, వాటిలో ఎన్ని నెరవేర్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచడంపై ప్రభుత్వాన్ని ఖర్గే నిలదీశారు. ప్రధాన విపక్ష పార్టీకి ఆ పదవి దక్కాల్సి ఉందని చెప్పారు. ఆ ఖాళీని భర్తీ చేయకపోవడం చట్టవిరుద్ధమని, విపక్షాలకు చిన్న పోస్ట్ కూడా మోదీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు నమ్మకం లేదనడానికి ఇదే నిదర్శమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మోదీకి లేఖ కూడా రాసినట్టు చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఖర్గే ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్



కుంభకోణానికి సంబంధించి బళ్లారి ఎంపి, ముగ్గురు ఎమ్మెల్యేలపై ఇడి దాడులను ఖర్గే మీడియా సమావేశంలో ప్రస్తావించారు. ఇడి దాడుల ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపిలను బిజెపి టార్గెట్ చేసిందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలికలు తేలేదని, పార్టీ ఐక్యంగా ఉందని చెప్పారు. కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమగ్ర దర్యాప్తు జరిగేంత వరకూ తమ పార్టీ ఎలాంటి వ్యాఖ్యలు చేయదని ఖర్గే చెప్పారు. ఈ స్కామ్‌కు ఇడి ఎలాంటి ట్విస్ట్ ఇస్తుందో చూడాలనుకుంటున్నామని అన్నారు. నిధుల దుర్వినియోగం అంశ ఇడికే వదిలిపెడుతున్నామని, కేసు విచారణలో తాము జోక్యం చేసుకోవమని తెలిపారు. ఎన్నికల్లో ఎవరు, ఎంతెంత ఖర్చుపెట్టారో అందరికీ తెలుసునని, ఈడీ దాడులు కొత్తేమీ కాదని, ఇలాంటి దాడులతో కాంగ్రెస్ పార్టీని విడగొట్టడం మాత్రం అసాధ్యమని అన్నారు.

### మంత్రివర్గ విస్తరణ, కులగణనపై..

కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ ఇప్పటికిప్పుడు లేదని ఖర్గే తెలిపారు. బెంగళూరులో ఇటీవల జరిగిన తొక్కిసలాట సహా పలు అంశాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు మంగళవారం నాడు ఢిల్లీలో రాహుల్ సమక్షంలో చర్చించినట్టు చెప్పారు. కర్ణాటకలో మళ్లీ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని ఖర్గే సమర్థించారు. కులగణనలో సోషియా ఎకనామిక్ క్రయిటీరియాను ఇప్పటికే ప్రభుత్వం పాటిస్తోందని, ఇందులో చోటుచేసుకోని మరో క్రయిటీరియాను కొత్త సర్వేలో చేర్చాల్సి ఉంటుందని చెప్పారు. బెంగళూరులో తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ సిద్ధరామయ్య రాజీనామాకు బిజెపి డిమాండ్ చేయడంపై అడిగినప్పుడు, ఈ ఏడాది మొదట్లో కుంభమేళాలో విషాదం చోటుచేసుకుందని, సిఎం రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తొక్కిసలాట ఊహించలేదని, దానికి క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని, బాధిత కుటుంబ సభ్యులకు తాము (ప్రభుత్వం) అండగా నిలబడమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఖర్గే చెప్పారు.

### పహల్గామ్‌పై పార్లమెంటులో
# పూర్తిస్థాయిచర్చకు ఇప్పుడైనా అంగీకరిస్తారా?

ప్రధానమంత్రిని ప్రశ్నించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి ఘటన అనంతరం దేశ భద్రత, విదేశాంగ విధాన సవాళ్ళపై పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చ చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికైనా అంగీకరిస్తారా? అని కాంగ్రెస్‌పార్టీ ప్రశ్నించింది. ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ బుధవారంనాడు పోస్టింగ్ పెట్టారు. కార్గిల్ యుద్ధానంతరం కె.సుబ్రహ్మణ్యం సారథ్యంలో ఒక సమీక్షాసంఘాన్ని ఏర్పాటు చేసి నివేదికను పార్లమెంటుకు సమర్పించినవిధంగానే ఆపరేషన్ సింధూర్‌పై కూడా నిపుణులతో కూడిన ఒక సమీక్షా సంఘాన్ని ఏర్పాటు చేసి పార్లమెంటుకు జవాబుదారీ చేయాలని జైరామ్ రమేశ్ కోరారు. 2023 డిసెంబరులో పూంఛ్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో, 2024లో గగన్‌గిర్, గుల్మార్గ్‌లలో జరిగిన దాడుల్లో భాగస్వాములైన ఉగ్రవాదులే పహల్గామ్‌లో కూడా పర్యాటకులపై హింసాకాండ సాగించారనీ, వారిని పట్టి దేశానికి తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి రెట్టింపు కృషి చేస్తారా? లేదా? అని కూడా ప్రశ్నించారు. అదేవిధంగా భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో డోనాల్డ్ ట్రంప్ తన గొప్పతనాన్ని చాటుకుంటూ చేసిన ప్రకటనలపై కూడా వివరణ ఇవ్వాలని కోరారు.

పాకిస్థాన్ ఉగ్రవాద దుశ్చర్యలు, ఉగ్రవాదులతో ఆ దేశానికి ఉన్న అనుబంధం, భారతదేశ వైఖరి గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ఆపరేషన్ సింధూర్ తర్వాత 32 దేశాలకు వెళ్ళివచ్చిన ఏడు పార్లమెంటరీ బృందాల సభ్యులను కలుసుకున్న



ప్రధానమంత్రి ఇక ఇప్పుడైనా పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో, ''పహల్గామ్ అనంతర దేశ భద్రత, విదేశాంగ విధానం''పై చర్చకు సిద్ధంగా ఉన్నారా? అందుకు అంగీకరిస్తారా? అని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. అఖిలపక్షాలకు చెందిన నాయకులతో ప్రధానమంత్రి ఒక సమావేశం ఏర్పాటు చేసి కనీసం ఆ సమావేశానికి అధ్యక్షత వహించి సంబంధిత విషయాలను చర్చించేందుకు, అన్ని రాజకీయపార్టీ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునేందుకు అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. పాకిస్థాన్ దురాగతాలను ప్రపంచదేశాలకు తెలియజెప్పేందుకు వెళ్ళిన బహుళపక్ష ప్రతినిధులతో కూడిన బృందాలు, పార్లమెంటేరియన్లు, మాజీ దౌత్యవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం (10వ తేదీ)నాడు విందు ఏర్పాటు చేశారు. ఈ ఏడు బృందాలకు చెందిన బహుళపక్ష ప్రతినిధులు దాదాపు 15 రోజులుపైగా వివిధ దేశాలలో పర్యటించారు.

''ఏడు పార్లమెంటరీ ప్రతినిధి బృందాల సభ్యులను ప్రధానమంత్రి కలుసుకున్నారు, ఇప్పుడైనా ఆయన అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి, ఈ సమావేశానికి అధ్యక్షత వహించి పార్టీల నాయకుల అభిప్రాయాలను కనీసం ఇప్పుడైనా వినాలి, చైనా, పాకిస్థాన్ రెండు దేశాలతో భారతదేశ భవిష్యత్ వ్యూహం గురించి అఖిలపక్ష నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి, సింగపూర్‌లో జరిగిన వార్షిక సమావేశం సందర్భంగా ఒక టీవీ చానల్ ఇంటర్వ్యూలో రక్షణశాఖ ప్రధానాధిపతి (సిడిఎస్) భారత వైమానికి దళానికి జరిగిన నష్టం గురించి చేసిన వ్యాఖ్యల పూర్వరంగంలో జైరామ్ రమేశ్ ఈ ప్రకటన చేశారు. పాకిస్థాన్‌తో ఆపరేషన్ సిందూర్, అనంతరం సైనిక చర్యల తర్వాత భారతదేశం తన యుద్ధ నైపుణ్యాలను ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉందని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో జరిగిన సమావేశంలో వ్యాఖ్యానించారు. ఐతే భారత్‌కు చెందిన ఆరు యుద్ధ విమానాలను తాము కూల్చివేశామని పాకిస్థాన్ చేస్తున్న ప్రచారాన్ని జనరల్ అనిల్ చౌహాన్ కొట్టిపారేశారు. ''నష్టం జరిగింది, యుద్ధ విమానాలను కోల్పోయాం'' అని ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి విదేశీ గడ్డపై జనరల్ అనిల్ చౌహాన్ టీవీ ఇంటర్వ్యూలో అంగీకరించడం స్వదేశంలో ఆగ్రహావేశాలకు దారితీసింది. ఆయన వ్యాఖ్యలపై ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వం తగిన వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని మరోసారి కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. పహల్గామ్ దాడుల ఘటనపై యావత్ దేశం ఏకాభిప్రాయంతో ఉందని చాటి చెప్పడానికి ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలని ''ఇండియా కూటమి'' పార్టీలు ప్రధానమంత్రిని కోరాయిఇ. కానీ దురదృష్టవశాత్తూ ప్రధానమంత్రి తిరస్కరించారు. కనీసం ఇప్పుడైనా వర్షాకాల పార్లమెంటు సమావేశాలో ఈ విషయం సమగ్రంగా చర్చించేందుకు ఒప్పుకోవాలని జైరామ్ రమేశ్ కోరారు.

## నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయుడికి సంకెళ్ళు



**న్యూఢిల్లీ :** అమెరికాలోని నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయుడికి సంకెళ్ళు వేసి, నేరస్థుడిని చూసినట్లుగా వ్యవహరించిన ఘటనను అమెరికా దృష్టికి భారతదేశం తీసుకెళ్ళినట్లు అధికారులు వెల్లడించారు. హర్యానాకు చెందిన ఆ వ్యక్తి సరైన వీసా లేకుండా అమెరికాలో అక్రమంగా ప్రవేశించాడని, కోర్టు ఆదేశాల ప్రకారం అతన్ని భారతదేశానికి తిప్పిపంపారని న్యూయార్క్‌లోని అమెరికా కాన్సులేట్ తెలిపింది. ఈ విషయాన్ని న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం దృష్టికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీసుకెళ్ళినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ యువకుడికి సంకెళ్ళు వేసి, నేలపై పడుకోబెట్టిన వీడియో వైరల్ అయింది. వాషింగ్టన్ డి.సి.లోని భారత రాయబార కార్యాలయం, న్యూయార్క్‌లోని ఎంబసీ ఈ ఘటన పూర్తి సమాచారం తెలుసుకునేందుకు అమెరికా అధికార యంత్రాంగంతో సంప్రదిస్తున్నదని అభిజ్ఞవర్గాలు వెల్లడించాయి. న్యూయార్క్‌లోని భారత్ కాన్సులేట్ ఆ వ్యక్తి హర్యానకు చెందిన వ్యక్తిగా నిర్ధారించిందని, అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించడంతో కోర్టు ఆదేశాల మేరకు అతన్ని వెనక్కి పంపే సమయంలో నెవార్క్‌లో ఆ వ్యక్తి ప్రవర్తన ప్రయాణం చేసేందుకు అనువుగా లేదని గుర్తించారని, అందుకే అతన్ని పట్టుకొని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారని అధికార వర్గాలు తెలిపాయి. అతను కోలుకున్న తరువాత భారత్‌కు పంపబతాడని పేర్కొన్నాయి. ఈ అంశంపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ అమెరికా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ఇక తత్కాల్‌కు ఆధార్ అథెంటికేషన్ విధిగా..!

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. తత్కాల్ రైలు టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసింది. ఆధార్ అథెంటికేషన్ చేసిన యూజర్లు మాత్రమే జులై ఒకటో తేదీ నుంచి ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్, యాప్ ద్వారా తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోగలుగుతారని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. జులై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ ఒటిపి తప్పనిసరని పేర్కొంది. ఈ మేరకు మంత్రిత్వశాఖ జారీ చేసిన ప్రకటనలో సిస్టమ్ జనరేటెడ్ ఒటిపి ధ్రువీకరించిన తర్వాత మాత్రమే తత్కాల్ టికెట్లు భారతీయ రైల్వేల కంప్యూటరైజ్డ్ పిఆర్‌ఎస్ (ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్) కౌంటర్లు, ఏజెంట్ల ద్వారా బుకింగ్ కోసం అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అత్యవసర సమయాల్లో ప్రయాణాలు చేసే వారి కోసం రైల్వేశాఖ తత్కాల్ టికెట్లను తీసుకువచ్చింది. దళారులు, బుకింగ్ ఏజెంట్లు దుర్వినియోగం చేస్తున్నట్లు రైల్వేశాఖ గుర్తించింది. క్షణాల్లోనే కోటా ముగుస్తుండడంతో రైల్వేశాఖ ఈ విషయంలో దృష్టి సారించింది. ఇందులో భాగంగా దళారులు, ఏజెంట్లకు అడ్డుకట్ట వేసేందుకు కొత్తగా నిబంధనలు తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో పాటు ఆధార్ ఒటిపి వెరిఫికేషన్ ప్రక్రియ అమలులోకి తీసుకువచ్చింది.

### ఓటర్ల జాబితా తయారీ...
## క్లిష్టతరమైన కసరత్తుల్లో ఒకటి

ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్‌కుమార్

ఇటీవల కాంగ్రెస్ సహా ప్రతిపక్షపార్టీల విమర్శల నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా రూపకల్పన అనేది ప్రపంచంలోనే అత్యంత క్లిష్టతరమైనదని, పారదర్శక కసరత్తులలో ఒకటి అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ గత కొంతకాలంగా పదేపదే విమర్శలు చేస్తున్న నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతీ ఏడాది ఎన్నికల సమయంలో సవరణ సమయంలో, ఎన్నికలకు ముందు కూడా చట్టప్రకారం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలతో అభిప్రాయాలు పంచుకుంటామని ఆయన గుర్తుచేశారు. ఆయన మంగళవారం ఎన్నికల సమగ్రతపై స్టాక్‌హోమ్ అంతర్జాతీయ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 1960 సంవత్సరం నుంచి గుర్తింపు పొందిన రాజకీయపార్టీలతో ఓటర్ల జాబితాల సవరణలపై అభిప్రాయాలను పంచుకుంటున్నామన్నారు. అంతేకాకుండా వాటిపై అభ్యంతరాలు, అప్పీళ్లకూ అవకాశం కల్పిస్తున్నామని సిఇసి జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. వారి ఆరోపణలను ఎన్నికల అధికారయంత్రాంగం తేలిగ్గా కొట్టిపారేసింది. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను తయారుచేయడం అనేది ప్రపంచంలోనే అత్యంత క్లిష్టతరమైనదని, పారదర్శక కసరత్తులలో కీలకమైనదని, ఎన్నికల ప్రక్రియ ఖచ్చితత్వాన్ని, సమగ్రతను బలోపేతం చేయడంలో శక్తివంచనలేని కృషి చేస్తున్నామనిజ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకులు, మీడియాతో ముడిపడి ఉందని, వారు వివిధదశలలో ఏకకాలిక ఆడిటర్లు మాదిరిగానే వ్యవహరిస్తారని ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ తెలియజేశారు. 20మిలియన్ల సిబ్బంది సహా పోలింగ్ స్టాఫ్, పోలీస్ బలగాలు, అదికారులు ఉంటారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఎన్నికల సంఘం అనేక జాతీయ ప్రభుత్వాలు, ప్రధాన ప్రపంచ సంస్థల సంయుక్త శ్రామిక శక్తిని అధిగమించి భారతదేశంలోని ఒక బిలియన్ మంది ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోగలగడం ఒక విశేషం అన్నారు.

## క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

కార్మిక హక్కులు, సామాజిక న్యాయం క్యూబా లక్ష్యం

ఐఎల్‌ఒ 113వ సదస్సులో మంత్రి మార్తా కాబ్రెరా



**జెనీవా:** జెనీవాలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) 113వ వార్షిక సదస్సు శుక్రవారంనాటితో ముగియనున్నది.ఈనెల రెండో తేదీన ప్రారంభమైన ఈ సదస్సులో 187 సభ్యదేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, కార్మికసంఘాల ప్రతినిధులు, ఉద్యోగ ప్రతినిధులు పాల్గొంటున్నారు. క్యూబాపై అగ్రరాజ్యం విధించిన ఆంక్షలను ఆ దేశం తరపున పాల్గొన్న ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఆంక్షలను తొలగించాలిన వారు కోరారు.

కార్మికుల రక్షణ, నూతన ప్రపంచంలో ఆధునిక సాంకేతికత ప్రభావం, పనిప్రదేశాలలో అంతర్జాతీయస్థాయి ప్రామాణికతలు, కార్మికుల పనితీరు మెరుగుదల, ఆర్థిక వ్యవస్థ ప్రభావం, కార్మికుల భద్రత, వివిధ దేశాలలో ఉన్న విభిన్న పరిస్థితులు వంటి అనేక అంశాలను ఈ సదస్సులో ఇప్పటికే చర్చించారు. గవర్నరింగ్ బాడీ సభ్యులు భవిష్యత్ సదస్సు లక్ష్యాలను, గత ఏడాది లక్ష్యాల పురోగతిని చర్చించారు. సామాజిక న్యాయ సాధనకు ప్రపంచదేశాల సమన్వయం గురించి చర్చించారు. క్యూబా కార్మిక, సామాజిక భద్రతాశాఖ మంత్రి మార్తా ఎలెనా ఫీటో కాబ్రెరా బుధవారం నాడు మాట్లాడుతూ, సామాజిక న్యాయంకోసం క్యూబా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. న్యాయబద్ధమైన ఆదాయాలు సాధించడంకోసం కార్మికులు చేసే ఉత్పాదకతకు, సామాజిక న్యాయానికి, దేశాభివృద్ధిలో, క్యూబా నిలకడగా స్థిరమైన అభివృద్ధి సాధించడంలో ఈ రెండూ జమిలిపోగుల్లా కలిసే ఉంటాయన్నారు. కార్మిక హక్కుల సంరక్షణకే కట్టుబడి ఉంటుందని అదే విధంగా సమానత్వం, మానవ గౌరవసంరక్షణ ప్రభుత్వధ్యేయమన్నారు. బహుళ వ్యవస్థకు క్యూబా ప్రభుత్వం కట్టుబడిందని, కార్మికులు సంపూర్ణస్వేచ్ఛతో తమ ఉత్పాదకశక్తిని ఉపయోగిస్తున్నారన్నారు. ఉచిత విద్య, ఉచిత ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత వందశాతం దేశంలో అందరికీ అందుబాటులో ఉన్నాయని క్యూబా మంత్రిమార్తా ఎలెనాఫీటో కాబ్రెరా చెప్పారు. వనరులను సద్వినియోగం చేసుకోనివ్వకుండా, ప్రజలజీవన ప్రమాణాలు ఎదగనివ్వకుండా అగ్రరాజ్యం విధించిన ఆంక్షలు పెద్ద సమస్యగా మారాయని, ఆంక్షలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. నవీన ఆవిష్కరణలకు, బహుళత్వ రక్షణకు, విజ్ఞానశాస్త్రాన్ని విస్తరించేందుకు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నదన్నారు. అమెరికా కార్మికశాఖ సహాయమంత్రి కెయిత్ సోందర్‌లింగ్ సారథ్యంలో ఒక ప్రతినిధిబృందం సదస్సులో ట్రంప్ చెబుతున్న 'అమెరికా ఫస్ట్' లేబర్ ఎజెండాను ఈ ప్రతినిధిబృందం సదస్సు ముందుంచింది.

## నిఘావ్యవస్థను మరింత విస్తృతం చేయాలి

ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

**న్యూఢిల్లీ :** ఆధునిక యుద్ధరీతిని పరిగణనలోనికి తీసుకుని నిఘా వ్యవస్థను ఒక సరిహద్దుకో లేదా ఒక ప్రాంతానికో పరిమిత ం చేయకుండా మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమీకృత రక్షణ సిబ్బంది ప్రధానాధికారి, ఎయిర్‌మార్షల్ అశుతోష్ దీక్షిత్ అన్నారు. ఆయన బుధవారం ఇక్కడి సుబ్రతో పార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ ప్రదర్శించిన స్వదేశీ ఆవిష్కరణలు అంతర్జాతీయ ఆవిష్కరణల ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోవని నిరూపించాయని, అంతకుమించి కూడా అధిగమించాయని నొక్కిచెప్పారు.'నిఘా, ఎలక్ట్రో ఆప్టిక్స్ (ఇ.ఒ) ఎంతగానో అభివృద్ధి చెందింది. అది శక్తిని వృద్ధి చేసేది' అని తెలిపారు.అది ప్రస్తుతం ఆధునిక సైనిక కార్యకలాపాల పునాదిని పటిష్ఠం చేస్తున్నాయని ఎయిర్‌మార్షల్ అశుతోష్ దీక్షిత్ చెప్పారు. 'ఈ పరివర్తనను నేను నా కెరీర్ ద్వారా ప్రత్యక్షంగా చూశాను. అందుకే నేనే సాక్ష్యంగా ఉన్నాను. ఫలితంగా ఈరోజు మనం విప్లవాత్మక మార్పులతో శిఖరాగ్రాన నిలబడ్డాం' అని దీక్షిత్ తెలిపారు.ఇటీవలి కాలం దీనికి అద్భుతమైన సాక్షాధారాలను అందించాయని ఆయన నొక్కిచెప్పారు. సమకాలీన యుద్ధంలో లోతైన నిఘా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ పాఠాలు ఇప్పటికిప్పుడే మన సైన్యం అర్థం చేసుకోలేకపోవచ్చన్నారు. ఆధునిక యుద్ధరీతులు సాంకేతికపరిజ్ఞానం ప్రాధాన్యతను, దూరం, దుర్బలత్వం మధ్య ఏవిధమైన సంబంధం ఉంటుందన్న ప్రాథమిక అవగాహనను పెంపొందించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడి అక్కడి ఉగ్రవాద స్థావరాలను సమూలంగా నాశనం చేయడానికి




భారతదేశం దీర్ఘ శ్రేణి ఆయుధ వ్యవస్థలను, ప్లాట్‌ఫారాలను ఉపయోగించిందని వివరించారు. ఎయిర్ మార్షల్ దీక్షిత్ తన ప్రసంగంలో చైనా సైనిక అంతరిక్షకార్యక్రమం గురించి కూడా ప్రస్తావించారు. 2010లో చైనా 36 శాటిలైట్లను మాత్రమే నిర్వహించేదని, 2024నాటికి 1,000కి పైగా శాటిలైట్లను నిర్వహిస్తోందని చెప్పారు. ఏ సత్యం స్పటిక స్పష్టతతో బయటపడుతుందో, దేనినైతే తొలుత పక్కకు చూస్తామో, ఏదైతే దూరంగా కనిపిస్తుందో, ఏది అత్యంత ఖచ్చితంగా కనిపిస్తుందో అదే విజయం సాధిస్తుందని ఎయిర్‌మార్షల్ అశుతోష్ దీక్షిత్ నొక్కిచెప్పారు.

### దేశంలో 7,121కి పెరిగిన కొవిడ్ క్రియాశీల కేసులు..
# 24గంటల్లో ఆరుగురు మృతి

**న్యూఢిల్లీ :** దేశంలో మరోసారి కరోనా వైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఒక్క రోజే 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 306 మందికి పాజిటివ్‌గా తేలింది. కేరళలో అత్యధికంగా 24 గంటల వ్యవధిలో 170 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 114 కేసులు వెలుగు చూశాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 8,573 మంది మహమ్మారిబారి నుంచి కోలుకున్నారు. 24 గంటల్లో ఆరు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఒకరు, కర్ణాటకలో ఇద్దరు, కేరళలో ముగ్గురు కొవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 74కి ఎగబాకింది.

### రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ 1,223, ఢిల్లీ 757, పశ్చిమ బెంగాల్ 747, మహారాష్ట్ర 615, కర్ణాటక 459, ఉత్తరప్రదేశ్ 229, తమిళనాడు 204, రాజస్థాన్ 138, హర్యాణా 125, ఆంధ్రప్రదేశ్ 72, మధ్యప్రదేశ్ 65, ఛత్తీస్‌గఢ్ 48, బీహార్ 47, ఒడిశా 41, సిక్కిం 33, పంజాబ్ 33, తెలంగాణ 11, జార్ఖండ్ 10, పుదుచ్చేరి 10, జమ్ము కశ్మీర్‌లో తొమ్మిది, అసోం, గోవా రాష్ట్రాల్లో ఆరు చొప్పున,



చండీగఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మూడు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో రెండు కేసులు, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు యాక్టివ్‌గా ఉంది.

### ప్రధానితో మీటింగ్‌కు ముందు ఆర్‌టిపిసిఆర్ టెస్టు తప్పనిసరి..!

కొవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో భేటీకి ముందు మంత్రులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్‌టిపిసిఆర్ టెస్టు చేయించుకోవాలని పిఎంఒ సూచించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## నిర్ణీత ఫార్మాట్‌లోలేని అవినీతి ఫిర్యాదులను స్వీకరించం
# 'లోక్‌పాల్' స్పష్టీకరణ

తన ఆదేశాలను సమీక్షించే అధికారం తనకు లేదని ఇటీవలి 'సర్క్యులర్' వెల్లడి

**న్యూఢిల్లీ :** నిర్దేశిత ఫార్మాట్‌లో లేని అవినీతి ఫిర్యాదులను ఎట్టి పరిస్థితులలోనూ స్వీకరించబోమని భారతదేశ అవినీతి నిరోధక విచారణాధికారి (అంబుడ్స్‌మెన్) లోక్‌పాల్ ఇటీవల స్పష్టం చేసింది. తన ఆదేశాలను సమీక్షించే అధికారం తనకు లేదని జూన్ 5వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌లో తెలిపింది. 'దాని తీర్పును తిరిగి సమీక్షించాలనుకునే సందర్భాలు పెరుగుతున్నాయి' అని ఆ సర్క్యులర్‌లో లోక్‌పాల్ పేర్కొంది. అవినీతి ఫిర్యాదును భారత లోక్‌పాల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ, రిసెప్షన్‌లో లేదా తన రిజిస్ట్రీ కార్యాలయంలో స్వయంగా గానీ, పోస్ట్‌ద్వారా గానీ లేదా ఆన్‌లైన్ (https:lokpalonline.gov.in/lokpalonline)లో చేయవచ్చని తెలియజేసింది. ఎసిబి విచారణాధికారి లోక్‌పాల్‌కు అందిన ఫిర్యాదులతో వ్యవహరించే విధానంపై సర్క్యులర్ ప్రకారం భారత లోక్‌పాల్‌కు అందిన ఫిర్యాదులను ఏవిధంగానైనా నిర్ణీతరూపంలో తీసుకోలేకపోయినా ఏ స్థాయిలోనూ తీసుకోకూడదు. అంతే కాకుండా ఎటువంటి చర్య లేకుండానే దాఖలు చేయబడుతుంది.భారతదేశ లోక్‌పాల్ జారీచేసిన ఆదేశాలను పున: పరిశీలించాలని, సమీక్షించాలని ఫిర్యాదులు కోరుకునే సందర్భాలు పెరుగుతున్నాయని ఆ ప్రకటన వెల్లడించింది. ప్రాథమిక విచారణ సమయంలో మెటీరియల్, సమాచారం, పత్రాలఆధారంగా వ్యాఖ్యలు చేయాలని,ఆరోపణల యోగ్యతను ముందస్తుగా అంచనా వేయవద్దని అవినీతి నిరోధక విచారణాధికారి లోక్‌పాల్ సంబంధిత అధికార యంత్రాంగానికి సూచించింది. సంబంధిత వాస్తవాల ఉనికి లేదా లేకపోవడం గురించి వ్యాఖ్యలకు బదులుగా పరిశీలనలో ఉన్న ఆరోపణల సత్యసంధత గురించి కాంపిటీటివ్ అథారిటీ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని లోక్‌పాల్ పరిశీలనలో తెలిసింది.'విచారణ పూర్తి కాకముందే వారు ఆరోపణల యోగ్యతలను ముందే అంచనా వేస్తున్నారని గమనించిబడింది'అనిఆసర్క్యులర్ తెలియజేసింది. లోక్‌పాల్‌ముందస్తుఅనుమతిలేకుండాసభ్యులకు,ఇతర మీడియాసంస్థలకు ఎలాంటి సమాచారాన్ని అందించకూడదనని,అధికార ప్రతినిధిగా నామినేట్ చేయబడిన అధీకృత అధికారి మాదత్రమే సంబంధిత సమర్థ అధికారి ఆదేశం మేరకే పత్రికలు, మీడియాతో సంభాషించవచ్చని లోక్‌పాల్ జూన్ 5న జారీ చేసిన సర్క్యులర్ తెలియజేసింది.2013 చట్టం ప్రకారం గోప్యతను పాటించడానికి ఇచ్చిన కేసులోని ఆదేశాలను స్పష్టంగా అప్‌లోడ్ చేయనిపక్షంలో, ఫిర్యాదును పరిష్కరించే తుది ఉత్తర్వులను సంబంధిత సభ్యులు సంతకం చేసిన వెంటనే దానిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని లోక్‌పాల్ పేర్కొంది.పైన పేర్కొన్న మినహాయింపునకు సంబంధించిన ఆర్డర్‌లు అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడవని, ఆర్డర్‌కు పైభాగాన కుడి వైపున పెద్దగా 'నాట్ టు బి అప్‌లోడెడ్' ఉండాలి అని సర్క్యులర్ తెలిపింది.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం
E.A. No.38/2025 in
E.P.No.3/2024 in
O.S.No.168/2018
సిహెచ్. రామసుబ్బయ్య ...వాది
Vs.
పోతంశెట్టి వెంకట సుబ్బారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు
నోటీసు
To
1. కాంద్రు రజని, W/o. శ్రీహరిబాబు, (R2) వయస్సు 65 సం., C/o. బంటి ఇంటర్నెట్ పాయింట్, దిల్‌షుక్‌నగర్ బస్టాండు వెనుక వైపు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురు, హైదరాబాదు, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావాలో వాది పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు అక్షేపణలు ఉన్నయెడల తేది: 19-06-2025 పైన తెలిపిన కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేది : 19-06-2025
బి. వేణుగోపాల్
పిటీషనరు తరపు న్యాయవాది
రామవరం (ఆర్.ఎస్), మార్కాపూర్, ప్రకాశం జిల్లా, ఎపి.
సెల్: 7981529185, 9866775547.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం
E.A. No.39/2025 in
E.P.No.3/2024 in
O.S.No.168/2018
సిహెచ్. రామసుబ్బయ్య ...వాది
Vs.
పోతంశెట్టి వెంకట సుబ్బారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు
నోటీసు
To
1. కాంద్రు రజని, W/o. శ్రీహరిబాబు, (R2) వయస్సు 65 సం., C/o. బంటి ఇంటర్నెట్ పాయింట్, దిల్‌షుక్‌నగర్ బస్టాండు వెనుక వైపు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురు, హైదరాబాదు, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు పిటీషనులో వాది పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు అక్షేపణలు ఉన్నయెడల తేది: 19-06-2025 పైన తెలిపిన కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేది : 19-06-2025
బి. వేణుగోపాల్
పిటీషనరు తరపు న్యాయవాది
రామవరం (ఆర్.ఎస్), మార్కాపూర్, ప్రకాశం జిల్లా, ఎపి.
సెల్: 7981529185, 9866775547.

## బ్రిడ్జి నిర్మాణ పనులు ఇష్టానుసారంగా చేయడం సరికాదు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం వద్ద సుమారు రెండు కోట్లతో నిర్మాణాలు చేపట్టిన బ్రిడ్జి పనులు కాంట్రాక్టర్,అధికారులు ఇష్టానుసారంగా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గొట్టెముక్కుల రాములు ఆరోపించారు. బుధవారం గోవిందాపురంలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద నిర్మాణ పనులపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పట్టణ ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణానికి రెండు కోట్లు నిధులను మంజూరీ చేయడం జరిగిందని, బ్రిడ్జి పనుల డిజైన్‌ను మార్చి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉండేటి బాబు, బండి భాస్కర్,దాసరి శ్రీనివాస్,వీరస్వామి, చిట్టిమల్ల మట్టయ్య, బాస్కర్,అలివేలు,మంగమ్మ,దాసు, కొండలు,వెంకటనర్సు,కృష్ణ,అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బానావత్ స్కైలాబ్ కుమారుడు సాయితాగూర్ ఐఐటీ ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 29వ ర్యాంకు సాదించడం పట్ల వారు బుధవారం వారి ఇంటికి వెళ్లి సాయితాకూర్‌ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయితాగూర్ సాదించిన ఈ ఘనత మిర్యాలగూడకు గర్వకారణమని, ఎంతో మంది యువతకు ఆదర్శమన్నారు. సాయితాగూర్ ఇంకా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, వారికి ప్రభుత్వం నుంచి, తమ నుంచి ఎల్లప్పుడు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులు చదువుపై వహించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, చదువుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని అశోక్‌నగర్ లోటస్ స్కూల్‌లో నెల రోజులు విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన ఉచిత వేసవి శిబిరం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ప్రకటించగానే కొంత మంది జల్సాలకు, ప్రయాణాలకు సమయం కేటాయించకుండా శిబిరంలో నెల రోజులు గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, చేతి రాత, సీసీ ++, జావా, పైథాన్ అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించామని ట్రస్ట్ వ్యవస్థాపకులు ఛైర్మన్ ముఫ్తీ ఉమర్ అఖిల్‌ఖాస్మీ తెలిపారు. కార్యక్రమంలో ఎజాజ్ హాష్మీ, ఎండి.హాఫీజ్, జర్నలిస్టులు ఖాజా హమీదొద్దిన్, ఎండి.అస్లాం, రఫీయొద్దిన్, టీచర్లు ఫౌజియా, లూసిడా, నాజియాలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** పేదల సొంతింటి కల తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఎంఎల్ఏ నివాసంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై దేవరకొండ నియోజకవర్గ ఎంపిడివోలతో సమీక్ష సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు. తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను పేద వాళ్లతో బహుపేదవాళ్లకు ఇవ్వడం జరుగుతుందని మిగతా రెండు, మూడు, నాలుగు విడతలలో కూడా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని అన్నారు. లబ్దిదారుల కళ్లల్లో ఆనందం, పేదల కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తుందనే సాక్ష్యం అన్నారు. ఇందిర సౌర గిరి జల వికాసం పథకం కింద నియోజకవర్గంలో 93 మందికి మంజూరు కావడం జరుగుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ డిఈ నాగేందర్‌గౌడ్, డిటిడివో ఛత్రు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఎంపిడివోలు, ఏఈలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలే



**ప్రజాపక్షం/డిండి:** ప్రజా పోరాటాలు ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శేషాయికుంట సిపిఐ గ్రామశాఖ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలో 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సిపిఐ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మనకు అనుకూలంగా ఉన్నటువంటి స్థానాలలో పోటీ చేయాలని ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసి మండలంలో మన సత్తాను చటాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని నేరవేర్చి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, మండల కౌన్సిల్ సభ్యులు చక్రి, చంద్రయ్య, శాఖ కార్యదర్శి తిరుపతయ్య, లచ్చయ్య, అంజయ్య, నారయ్య, కృష్ణయ్య, ఈదమయ్య, నాగరాజు, బాలిది, బక్కమ్మ, శంకరయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

## త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు అధికారులను ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.పోచంపల్లి మండలంలోని 22 గ్రామాలలో పోచంపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని వార్డులలో జిల్లా కలెక్టర్ మంజూరు ఇచ్చిన 695 ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి ప్రగతిని గురించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాపర్తి భాస్కర్ మున్సిపాలిటీ కమిషనర్ అంజన్ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితులలో రాబోయే రెండు రోజుల్లో ప్రభుత్వం మంజూరు ఇచ్చిన అన్ని ఇండ్లకు సంబంధించి ముగ్గులు పోయించి ఇందిరమ్మ ఇండ్ల అప్లికేషన్లో ఫోటోలను పొందుపరచాలని పంచాయతీ కార్యదర్శులను వార్డ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి జిల్లా ప్రాజెక్టు అధికారి విజయ్ సింగ్ డిప్యూటీ ఇంజనీరు టీ.నాగేశ్వరరావు, సహాయం ఇంజనీరు మేఘన, వంక మామిడి కార్యదర్శి పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటిని వృథా చేయొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడం జరుగుతుందని, నీటి అవసరాల మేరకు పట్టుకుని నీరు వృథా పోకుండా నల్లాలకు మూతలు బిగించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 10వ రోజు పట్టణంలోని 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో ప్రజలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇండ్లలోనిచెత్తను తడి,పోడి చెత్తగా ఏర్పాటు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు శివప్రసాద్, నరేష్, రఫీ, శ్వేత, నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** దేశ భవిష్యత్ విద్యార్థుల మీదనే ఆధారపడి ఉందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. నేటి ఆలోచనే రేపటి గమ్యస్థానమని, సమాజంలో విద్య ద్వారానే శాశ్వతమైన మార్పు, అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఆకాశమే హద్దుగా విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరారు. బుధవారంజిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ అధికారులతో బడిబాట కార్యక్రమంపై సమీక్ష, పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలు మొదటి అడుగుగా భావించి విద్యార్థులు కష్టపడి ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. బడి బయట ఒక్క విద్యార్థి లేకుండా అందరూ చదువుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హతగల ఉపాధ్యాయులు ఉన్నారని, మంచి భవనాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నాణ్యమైన పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లాలో ఏప్రిల్ నెలలోనే బడిబాట కార్యక్రమం మొదలు పెట్టడం జరిగిందన్నారు. నేటి నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలన్నారు. పదవ తరగతిలో ప్రతిభకనబర్చిన జిల్లాలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు రూ.లక్ష, 90వేలు, 80వేలు, అలాగే మండల పరిషత్ పాఠశాలలకు 90వేలు, 80వేలు, 70వేలు రూపాయల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పదవ తరగతి లో టాప్ ర్యాంకర్‌గా నిలిచిన టి.జిఎంఎస్ ఇమాంపేటకు చెందిన ఎం.రుతికరెడ్డి 15వేలు, ఎంజెపిటి బిసి బడ్ల్యూఆర్.ఎస్ మద్దిరాలకు చెందిన విద్యార్థిని సిహెచ్ స్నేహలతకు 12వేలు, సూర్యాపేట మండలంలోని టిజిఎంఎస్ ఇమాంపేటకు చెందిన సిహెచ్ ఈశ్వర్‌కు 10వేల నగదుతో పాటు ప్రశంస పత్రం, షీల్డ్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం వింగ్స్‌అఫ్‌ఫైర్ అనే పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. అలాగే జడ్పిహెచ్ఎస్, కెజిబివి, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వేల్ఫేర్ రెసిడెన్సియల్, ఏపి పాఠశాలలో మండల స్థాయిలో పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి మూడువేల రూపాయలు, ద్వితీయ ర్యాంకు వచ్చిన వారికి రెండువేలు, తృతీయ ర్యాంకు వచ్చిన వారికి వేయి రూపాయలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి అశోక్, జిల్లా మైనార్టీ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, సంక్షేమ అధికారి నర్సింహారావు తో పాటు ఆయా మండలాల ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిర్మాణాలకు టిజిఎండిసితోనే ఇసుక సరఫరా

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇకపై అన్ని రకాల నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టిజీఎండిసి) ద్వారానే సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు .ఇందుకుగాను ఇరిగేషన్ ప్రాజెక్టులు, ప్రభుత్వ పనులు,ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పనుల వారిగా సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు జాబితాలను సమర్పించాలని కోరారు.బుధవారం ఆమె తన చాంబర్లో ఇందిరమ్మ ఇండ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భవిత కేంద్రాల నిర్మాణం, ప్రభుత్వ పనులకు సరఫరా చేసే ఇసుక సరఫరా పై సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్న మొత్తం నుండి అధిక మొత్తంలో అవసరమయ్యే ఇసుకను ఇకపై టిజీఎండిసి ద్వారా మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు. అందువల్ల అన్ని నిర్మాణ ఏజెన్సీలు ప్రభుత్వ నియమ నిబంధనలను తూ.చా తప్పకుండా పాటించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుండి నేరుగా ఇసుకను తీసుకోవద్దని, అవసరమైన ఇసుకకై ముందే అనుమతులకు సమర్పించాలని, ఇందులో భాగంగా ఆయా మండలాల వారీగా ఇసుక లభ్యమయ్యే వనరులను మైనింగ్ శాఖ జాబితా సమర్పించాలని జిల్లా మైనింగ్ అధికారిని ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత క్రమంలో ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు .ఇందుకుగాను ఆయా ప్రాజెక్టుల కింద పనులు జరిగేచోట కొత్త ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా మైనింగ్ అధికారి శామ్యూల్ జాకబ్, గృహ నిర్మాణ సంస్థ పిడి రాజ్‌కుమార్, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగార్జున, వై టి పి ఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుపతయ్య ఇరిగేషన్ ప్రాజెక్టు ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితరులు హాజరయ్యారు .

## చిత్తశుద్ధితో హామీల అమలు ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రియా శీల పాత్ర పోషించింది కార్యకర్తలేనని చిత్తశుద్ధితో హామీల అమలు ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని జిల్లా కాంగ్రెస్ నాయకుల తడక వెంకటేశ్వర్లు పునరుద్ఘాటించారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భారత లవ కుమార్ అధ్యక్షతన టై & డై ఫంక్షన్ హాల్ లోజరిగిన పోచంపల్లి మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ క్రీయశీలక కార్యకర్తల సంస్థగత నిర్మాణ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్స్ వరంగల్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ ధనవంతి డా॥ పులి అనిల్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా పెద్ద ఎత్తున పార్టీ కీలక, ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసి ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రభుత్వం పట్ల విశ్వసనీయత పెంచాలని ఆయన కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి,మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు పకీరు నర్సిరెడ్డి, కాసుల అంజయ్య, శ్రీశైలం, సీనియర్ నాయకులు అంబరీష్ రెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, ఫకీరు మల్లారెడ్డి ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్‌తో నేడు పోచంపల్లి చేనేత కార్మికులు ముఖాముఖి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నేడు పోచంపల్లి చేనేత పరిశ్రమ, టూరిజం పార్క్, చేనేత కుటుంబాలను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతోపాటు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన భద్రత నిఘా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బుధవారం భువనగిరి జిల్లా హనుమంతరావు,అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆర్డీవో శేఖర్ రెడ్డి, డీసీపీ అక్షాంశు యాదవ్, ఇతరశాఖల ఉన్నతాధికారులతో కలిసి గవర్నర్ రాక కోసం టూరిజం పార్కులో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.మగ్గాలపై చీరలు నేసే మూడు కుటుంబాలను సందర్శించే ఇళ్లను, పరిసర వీధులను రోడ్లను తనిఖీ చేయాలని ఆదేశించారు చేశారు. మంచి ఆతిథ్యంతో గవర్నర్ టూర్ ను విజయవంతం చేయాలని అధికారులు కోరా రు. నిర్ణయించబడిన చేనేత కార్మికులకు ము ఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు పా సుల జారీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పాసులు ఉన్నవారికి మాత్రమే గవర్నర్తో ఇంటరాక్షన్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు గవర్నర్ పోచంపల్లి టూర్ ప్రకటన నేపథ్యంలో డీసీపీ అక్షాంశ యాదవ్ అదనపు డీసీపీ లక్ష్మీ నారాయణ ఏసిపి మధుసూదన్ రెడ్డి, పోచంపల్లి ఎస్సై భాస్కర్ రెడ్డి,పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. టైం టు టైం గవర్నర్ సందర్శనను రూట్ మ్యాప్ ప్రకారం అధికారులకు వివరించారు.ఎక్కడా ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నిఘా యంత్రాంగం పనిచేయాలని సూచించారు. గవర్నర్ పర్యటన టైం టు టైం షెడ్యూల్ ఇలా.. రోడ్డు మార్గాన హైదరాబాద్ రాజభవన్ నుంచి ఉ గం 9.30ని లకు బయలుదేరి 10 30 నిమిషాలకు పోచంపల్లికి చేరుకుంటారు. 10.30 నుంచి 11.00 వరకు చేనేత కార్మికులు మగ్గాలపై చీరలు నేసే కుటుంబాలను సందర్శిస్తారు.11.00లకు పోచంపల్లి టూరిజం పార్కు చేరుకుని మ్యూజియంలోని చరిత్ర, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వివిధ విభాగాలలో చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలిస్తారు.11.15 నుంచి 11.45వరకు టూరిజం హాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశ గదిలో నేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం.11.45ల నుండి 12.00వరకు లబ్ధిదారులకు నేతన్న భీమా పొదుపు స్కీం చెక్కులను పంపిణీ చేస్తారు. మ 12.00 లకు తిరిగి హైదరాబాద్‌కు పయనమయి ఒంటిగంటకు రాజ్ భవన్ కు చేరుకుంటారు.

# ఐదవ శక్తిపీఠం అభివృద్ధికి చర్యలు

దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానాన్ని పునఃవైభవంతో తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అలంపూర్ ప్రసాద్ పథకం బిల్డింగ్ లోని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి, శాఖల వారిగా కార్యాచరణ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఖర్చు అంచనాలపై సమగ్రమైన చర్చ జరిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ మాట్లాడుతూ అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం 5వ శక్తిపీఠంగా ప్రత్యేక ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థానం కలిగి ఉందని ఈ పవిత్ర క్షేత్రాన్ని పునర్వైభవంతో అభివృద్ధి చేయడం అత్యవసరమని సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని ఆమె పేర్కొన్నారు. ఈఅభివృద్ధి ప్రణాళికలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ఈ క్రమంలో ప్రణాళిక అమలుపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ మూడు సమీక్షా సమావేశాలు నిర్వహించి, అవసరమైన చర్యలను ప్రారంభించారని తెలిపారు. అలంపూరు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జోగులాంబ ఆలయం జాతీయ రహదారి పరిధిలో ఉండటంతో, గద్వాల నుంచి అలంపూరు వరకు రోడ్డు సైడ్‌లో అర్చులు, అవెన్యూవ్ ప్లాంటేషన్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జద్చర్ల నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో ఈ సూచికల ఏర్పాటుతో భక్తులకు స్పష్టమైన దిశానిర్దేశం కలుగుతుందన్నారు. ఆలయం వద్ద శుభ్రమైన వాతావరణం, బస్టాండు, సౌకర్యవంతమైన గదులు, శుద్ధమైన ఆహారం, పార్కింగ్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలంపూర్ శాసనసభ్యులు విజయుడు అలంపూర్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తవ్వాలని, వచ్చే పుష్కరాల నాటికి అన్ని సౌకర్యాలు అందుబాటులోకి ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ అలంపూరు అభివృద్ధి పై ఇప్పటివరకు పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించామని, అన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి అలంపూరు జోగులాంబ దేవస్థానం, పాపినాశి, సంగమేశ్వర ఆలయాలలో క్షేత్రస్థాయి సందర్శనలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, అలంపూరు మార్కెట్ యార్డు చైర్మన్ దొడప్ప, ఆర్డీవో అలివేలు, ఆర్కిటెక్టు సూర్యనారాయణ మూర్తి, టెంపుల్ డిజైనర్ గోవింద హరి, స్థాపతి వాలి నాయగం, ఎండోమెంట్స్ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, రాష్ట్ర టూరిజం శాఖ ఎస్ఈ సరిత, ఈఓ పురేందర్, ఆర్‌అండ్‌బి పబ్లిక్ హెల్త్ మిషన్ భగీరథ, టూరిజం, పునరావస్థ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత కేంద్ర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అటవీ భూములు పొందిన గిరిజనులకు ఇందిర సౌర గిరిజన వికాస పథకం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** అటవీ హక్కుల ద్వారా పట్టా పొందిన గిరిజన లబ్ధిదారులకు సోలార్ ప్లాంట్స్‌తో సాగునీరు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిర సౌర గిరిజన వికాస పథకం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.శంకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకాన్ని సత్వరమే అమలు కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు అదేశించారు. జిల్లాలో మఠంపల్లి, పాలకీడు, చింతలపాలెం మండలాల్లో అటవీ భూములు పొందిన గిరిజన రైతులు ఉన్నారని, సోలార్ విద్యుత్‌పై రైతులకు అవగాహన పర్చి ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవిశాఖ అధికారి సతీష్‌కుమార్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి బాలునాయక్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా రవాణశాఖ అధికారి, జిల్లా హర్టికల్చర్ అండ్ సెరికాల్చర్ శాఖ అధికారి నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, మఠంపల్లి, పాలకీడు, చింతలపాలెం మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోనే సామాజిక న్యాయం

టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ పార్టీలోనే సామాజిక న్యాయం అమలవుతుందని నూతన టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. టిపిసిసి ప్రకటించిన కమిటీలో కొండేటినీ రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియమించడంతో బుధవారం నల్లగొండలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణు లు, అభిమానులు ఆయనను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఏ పదవిలో ఉన్నా క్రమశిక్షణతో పనిచేశానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, దళిత, ఎమ్మార్పీఎస్ నాయకులు వచ్చి ఆయనను గజమాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## 17న రజకుల మహాధర్నా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వివిధ సమస్యలపై ఈనెల 17న హైదరాబాద్ లో జరిగే రజక వృత్తిదారుల మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైళ్ళ ఆశయ్య పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హుజూర్‌నగర్ పట్టణ కమిటీ అధ్యక్షులు ఇందిరాల నర్సయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. 17న హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద జరిగే రజక వృత్తిదారుల ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ రజక, నాయీబ్రాహ్మణ వృత్తిదారుల ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని,విధ్యుత్ అధికారుల వేధింపులు ఆపాలని, అధిక బిల్లులను రద్దు చేయాలన్నారు. ఈ పథకాన్ని కేటగిరి ఎల్‌టి2 నుండి ఎల్‌టి4 కేటగిరికి మార్చాలని,మోడ్రన్ దోభిఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు.


## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/కోదాడ:** నేడు కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి బాలాజీనగర్ ఫీడర్ మరమ్మతులు, పోల్స్‌కు అల్లుకుపోయిన చెట్లను తొలగించడం కోసం ఉదయం 9గంటల నుండి 10 గంటల వరకు, ఉత్తమ్ పద్మావతినగర్ పీడర్ మరమ్మతులు, అల్లుకుపోయిన చెట్లను తొలగించడం కోసం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉండనున్నదని ఎఇ బాణోతు నర్సింహానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకొన్న సింగరేణి అధికారులు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని రైతు బజార్ ఏరియాలో సింగరేణి స్థలంలో అనుమతి లేకుండా వ్యాపారస్తులు కూరగాయల దుకాణాల కోసం అక్రమం గా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా జేసీబీ తో త్రవ్వకాలు మొదలుపెట్టగా ఎస్టేట్ సెక్యూరిటీ సిబ్బంధి అడ్డుకొన్నారు. ఈ సంధర్భం గా ఎస్టేట్ అధికారులు సెక్యూరిటీ సిబ్బంధి సంబందిత కూరగాయల వ్యాపారస్తులతో సింగరేణి స్థలములలో ఎస్టేట్ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, అలా కాకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు కట్టినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదే విధంగా అట్టి నిర్మాణాలను కూడా కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్టేట్స్ అధికారులు మోహన్ రావు, సర్వేశ్, శ్రీనివాస్, భువనేశ్వరి, ఎస పిసి జూనియర్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, జమేదార్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో రూ. ఐదు లక్షలు ఆస్తి నష్టం




**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరు మండల పరిధిలోని మంగళవారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, మెరుపులు ఉరుములతో కూడిన వర్షంతో పిడుగుపాటు వలన మధు గృహాలలో టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు ,లాప్టాప్ లో దగ్ధం కాగా విద్యుత్ శాఖలో బత్తుల పల్లి లోని నియంత్రిక కల్లూరు లోని ఒక విద్యుత్ నియంత్రికలు దగ్ధం కావడంతో విద్యుత్ శాఖకు రెండు లక్షల పది గృహాలలో విద్యుత్ పరికరాలు దగ్ధం అయినట్లు గృహస్తులు మౌర్య నిర్మల్ కుమార్, శ్రీనివాసరావు, బ్రహ్మం ప్రసాద్, సుబ్బారావు లతోపాటు విద్యుత్ శాఖ అధికారి పివెంకట్ లు తెలిపారు. అర్ధరాత్రి పిడుగుపాటుకు గృహ పరికరాలు దగ్ధమవుతున్న సమయంలో విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందించలేదని వారు తెలిపారు. అదేవిధంగా విజయ్ నగర్ లో ఒక నియంత్రిగాను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారికి తెలిపారు ఈ విషయమై పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

## ఈవిఎం గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలకు వెళ్లి ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గది లోపల కలెక్టర్ పరిశీలించారు. తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిసి కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డుకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ పర్యవేక్షకులు సిహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు గోపాలరావు, శ్రీనివాస్, రవీంధర్, ప్రకాష్, సతీష్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక






కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన వీసంశెట్టి

సహాయ కార్యదర్శిగా నాగరాజు

91 మందితో నూతన మండల సమితి ఏర్పాటు

**ప్రజాపక్షం/కొతగూడెం టౌన్ :** సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని పాండురంగాపురం లో జరిగిన సిపిఐ పాల్వంచ మండల 19వ మహాసభ జరిగింది వివిధ సమస్యలుపై చర్చించి డిమాండ్ల సాధనకు తీర్మానాలు చేశారు. అనంతరం నూతనంగా 91మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వీసంశెట్టి పూర్ణచందర్ రావు, సహాయ కార్యదర్శిగా గుండాల నాగరాజు లు తిరిగి ఎన్నిక అయ్యారు వారితో పాటు 39 మందితో కార్యవర్గం, 91 మందితో కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వైరాలో మూతపడనున్న పాఠశాలలు!



ఇప్పటికే మూతబడ్డ గౌండ్లపాలెం పాఠశాల

అష్ణగుర్తి పాఠశాలలో విద్యార్థులే లేరు

**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలంలోని అష్ణగుర్తి పాఠశాల నిర్వహణ ప్రశ్నార్ధకంగా మారిపోయింది. ఈ పాఠశాలలో విద్యార్థులు చేర్పించేందుకు అక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు గ్రామస్థులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించిన ఎలాంటి స్పందన కనిపించలేదని ఆరోపణ వినిపిస్తున్నాయి. నేటి నుండి పాఠశాల తెరుచుకోనున్న నేపద్యంలో అష్ణగుర్తి పాఠశాలలో విద్యార్థులు వస్తారా రారా అనేది ఇప్పుడు ప్రశ్నార్ధకంగా మారింది. మూసివేత దిశగా వైరా మండలంలో రెండు పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే గౌండ్లపాలెం గ్రామంలో సుమారు మూడు సంవత్సరాల నుండి ఇక్కడ పాఠశాల మూసి వేయడం జరిగింది. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులను కూడా వేరే ప్రాంతానికి పంపించడం జరిగింది. కాని బడిబాట కార్యక్రమం నిర్వహించడానికి కూడా అక్కడ ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తుంది. అదేవిధంగా అష్ణగుర్తి గ్రామం పాఠశాలల ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ గ్రామంలో పిల్లలు ఎవరు ఆ పాఠశాలలో చదువుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఉపాధ్యాయులు ఉన్నారు తప్ప ఈ పాఠశాలలో విద్యార్థులు లేరు. అయితే గ్రామంలోని ప్రజలు తమ ఊర్లోని పాఠశాల మూతపడకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయి. లేదా అనేది నేటితో తెలియుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతూ ఉంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేసేందుకు అందరు ముందుకు రావాలని అవగాహన ఏర్పాటు చేసిన కూడా స్పందన లేకపోవడం బాధాకరం. వైరా మండలంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు మూత దిశగా ఉన్నాయి.

## 'హెల్ప్‌లైన్ 181'ను ఉపయోగించుకోవాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

లైంగిక వేధింపుల నిరోధక చట్టం గోడపత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హెల్ప్ లైన్ 181 నెంబర్‌ను మహిళలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మహిళా సాధికారత కేంద్రం ఖమ్మంజిల్లా ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహనకు రూపొందించిన గోడప్రతులు, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసే ఫిర్యాదుల స్వీకరణ పెట్టెలను కలెక్టర్ పరిశీలించారు. మహిళల భద్రత కోసం లైంగిక వేధింపుల చట్టం పివోఎస్‌హెచ్ యాక్ట్ మహిళలు పని చేసే ప్రదేశాల్లో మగవారు అనుచితంగా ప్రవర్తించడం, లైంగిక దాడులు, అవాంచనీయ, అసాంఘిక ప్రవర్తన ద్వారా వేధించిన వారికి ఈ చట్టం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. మహిళల ఫిర్యాదు కోసం కలెక్టరేట్ గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలోని టాయిలెట్ల వద్ద ఫిర్యాదుల స్వీకరణ పెట్టెలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. హెల్ప్‌లైన్ 181 నెంబర్‌ను ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఛైర్‌పర్సన్ భారతిరాణి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి విష్ణుచందన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందాలి

ప్రతి ఆవాసానికి స్వచ్ఛమైన తాగునీరు

కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంజీత్

జల్ జీవన్ ప్రాజెక్టులపై ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి ప్రధాన మంత్రి కృషి సంచయి యోజన (పిఎంకెఎస్‌వై) జల్ జీవన్ మిషన్ (జెజెఎం) ప్రాజెక్టులపై ఇరిగేషన్, మిషన్ భగీరథ, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖమ్మంజిల్లాలో పిఎంకెఎస్‌వై క్రింద చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనుల పురోగతి వివరాలు, మిషన్ భగీరథ, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు వివరాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ సంజీత్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేవిధంగా ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకరాలు అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఖమ్మంజిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు సరఫరా చేసే నీటి నాణ్యత చాలా బాగుందని, రెగ్యులర్‌గా శుద్ధి చేసిన త్రాగునీరు ప్రజల ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నందుకు వారు కూడా చాలా సంతోషంగా ఉండటం గమనించామన్నారు. ప్రతి ఆవాసానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, ప్రజలకు సరఫరా చేసే మంచినీటి నాణ్యతను గ్రామ పంచాయతీ పరిధిలో రెగ్యులర్‌గా పరీక్ష చేసేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చివరి ఇంటి వరకు త్రాగునీటి సరఫరా అవుతుందా, అక్కడ నీటి నాణ్యత ఎలా ఉంది వంటి అంశాలు గ్రామ పంచాయతీ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తయారు చేసిన డిపిఆర్ లక్ష్యాల ప్రకారం ఆయకట్టుకు సాగునీరు అందుతుందా లేదా పరిశీలించాలన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టు రావడం వల్ల రైతులకు వచ్చిన అదనపు ఆదాయం, సాగు పద్దతుల్లో మార్పు, మారిన పంటలు వంటి అంశాలపై స్టడీ చేసి రిపోర్టు అందించాలని ఆయన సూచించారు. ఖమ్మంజిల్లా పరిధిలో నీటిపారుదల ప్రాజెక్టు సాగునీరు సరఫరా కోసం పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వాటిని పూర్తి చేసేందుకు కేంద్రం సహకరిస్తుందని, కేంద్రం నుంచి ఎటువంటి సహాయం కావాలో ప్రణాళికలు తయారు చేసి ప్రతిపాదనలు అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 7.70 లక్షల ఎకరాల వ్యవసాయ భూమికి గాను 4.5 లక్షల ఎకరాలకు నీటి పారుదల వ్యవస్థ క్రింద ఆయకట్టు ఉందన్నారు. సన్నరకం వడ్ల సాగుకు ప్రభుత్వం బోనస్ ఇస్తున్న నేపథ్యంలో వరి పంట విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గతేడాది ఐదువేల ఎకరాల నుంచి 35వేల ఎకరాలకు పెరిగిందని జిల్లాలో మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖమ్మంజిల్లాలో స్టోరేజ్ వాటర్ లేవని కేవలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆయకట్టు స్థిరీకరణ చేసేందుకు, నూతన ఆయకట్టు సృష్టించేందుకు ప్రస్తుతం గోదావరి పై సీతారామ ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నాయన్నారు. గతేడాది వచ్చిన వరదల కారణంగా మారుమూల ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్ కొంత మేరకు దెబ్బతినడంతో లోకల్ సోర్స్ ద్వారా అక్కడ త్రాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. మిషన్ భగీరథ ద్వారా 60 జనావాసాలకు అవసరం మేరకు త్రాగునీటిని సరఫరా చేయలేకపోతున్న కారణంగా ఆ ప్రాంతాల్లో లోకల్ సోర్స్ వాడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సిజిడబ్ల్యూబి టెక్నికల్ అధికారి మాధవ్, సిడబ్ల్యుసి టెక్నికల్ అధికారి రూపేష్, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ డివి రమేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ శివధర్మతేజ, మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, జెడ్పి సిఈవో దీక్షారైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి

కల్తీ లేని ఉత్పత్తులకు కేరాఫ్‌గా మహిళా మార్ట్ నిలవాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా న్యాయబద్ధంగా మహిళా సంఘాలు వ్యాపారాన్ని నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కల్తీ లేని, నాణ్యమైన ఉత్పత్తులకు కేరాఫ్ గా మహిళా మార్ట్ నిలవాలన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని మహిళా మార్ట్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. మహిళా మార్ట్ నిర్వహణలో మహిళలు ఎదుర్కొన్న అనుభవాలను ప్రభుత్వపరంగా ఏమైనా సౌకర్యాలు కల్పించాలా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యాపారాన్ని విస్తరించేందుకు కొత్త కొత్త ఆలోచనలు, కొనుగోలు దారులకు అవసరమైన ఉత్పత్తులను ఉంచేవిధంగా ఏర్పాటు చేస్తూ వారి యొక్క సలహాలను తీసుకోవాలని మహిళా సభ్యులకు కలెక్టర్ సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్తీ లేని నాణ్యమైన పదార్థాలు సరసమైన ధరలకు ఖమ్మం మహిళా మార్ట్‌లో లభిస్తాయనే నమ్మకం ప్రజల్లో ఏర్పడుతుందని దానిని నిలబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా మార్ట్‌లో ప్యాకింగ్ కూడా అద్భుతంగా ఉందని ఇదే విధానం కొనసాగించాలన్నారు. ఖమ్మం మహిళా మార్ట్‌లో ఎటువంటి పదార్థాలు విక్రయించాలో జిల్లా మహిళా సమాఖ్యలో చర్చించుకుని నిర్ణయించాలన్నారు. ఒక ర్యాకులో మహిళా సంఘాలు తయారుచేసే పదార్థాలు ప్రత్యేకంగా పెట్టాలన్నారు. మహిళా మార్ట్ నుంచి వచ్చే లాభాలతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనారోగ్యం కలిగించే పదార్థాలను మహిళా మార్ట్‌లో విక్రయించడానికి వీలు లేదని, విస్తరాకులు సన్నరకమైన ప్లాస్టిక్ లేనివి విక్రయించాలన్నారు. మహిళలపై అపారమైన నమ్మకంతో అవకాశం కల్పించామన్నారు. మహిళా మార్ట్‌లో స్టాక్ ఎంట్రీ, ఇతర పనులు చేసేందుకు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లతో ఏర్పాటు చేయాలని అవసరమైన సామగ్రిని కలెక్టరేట్ నుంచి అందిస్తామన్నారు. బ్యాగ్ డిపాజిట్, పాదరక్షల కోసం ప్రాంగణం బయట ఒక ర్యాక్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఖమ్మం మహిళా మార్ట్ ద్వారా ఇతర లోగో పదార్థాలను విక్రయించవద్దన్నారు. ఖమ్మం మహిళా మార్ట్‌కు మరింత పేరు తీసుకురావాలన్నారు. మహిళా మార్ట్‌లో ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ బ్యాగులు వాడాలన్నారు. అనంతరం మహిళా మార్ట్‌లో కొన్ని వస్తువులు, పిండి వంటలను కలెక్టర్ కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా బిల్లు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి ద్వారా సమస్యల పరిష్కారం


ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం వల్ల ప్రతి ఒక్క రైతు సమస్య పరిష్కారమవుతుందన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. బుధవారం నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం లింగపాలెం, సత్తుపల్లి మండలం తుమ్మూరు గ్రామాలలో సత్తుపల్లి తహశీల్దార్ పున్నం సత్యనారాయణ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకుగాను రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాగమయి హాజరై మాట్లాడుతూ గతం బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వలన నష్టపోయి రోడ్డున పడ్డ కుటుంబాలను ఈ రాష్ట్రంలో చూసామన్నారు. నాటి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా భూ సమస్యలు ఉన్న వారి నుండి దరఖాస్తు లు తీసుకొని, భూ భారతి చట్టం పై ప్రజలకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తుందన్నారు.భూ భారతి చట్టం ద్వారా సమస్యలన్ని పరిష్కారమవుతాయన్నారు.భూభారతి చట్టం రూపకల్పనలో అనేక పరిశోధనలు ,మేధావుల సలహాలు,సూచనలు ద్వారా ఈ తెలంగాణ భూ భారతి చట్టాన్ని తీసుకురావటం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని.ప్రజలు కష్ట సుఖాల్లో తోడు, నీడగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోరంపూడి జగన్, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, సీనియర్ నాయకులు జెల్ది జగన్మోహన్ రావు, ఎర్రా సత్యం, వేంసూరు మాజీ సర్పంచ్ ఫైజుద్దీన్, వేంసూరు మండలం, లింగపాలెం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్, సీపర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారికి నక్కా రాజేశ్వరరావుకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మటూరి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత విద్యా సంవత్సరం రావాల్సిన మెనూ బిల్లు వేతనాలను తక్షణమే చెల్లించాలని, రానున్న రోజుల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇబ్బంది లేకుండా పత్తి నెల 5న బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. స్వీపర్ల సమస్యను పరిష్కరించి వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు కే బసవయ్య, టి రామారావు, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకమ్మ, మహదేవ లక్ష్మి, పొదిలి సావిత్రి,జరీనా, సీత, షేక్ రహీం మున్నీషా, సత్యవతి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి ,కృష్ణవేణి, స్కావెంజర్స్ యూనియన్ నాయకురాలు మహాలక్ష్మి , సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు

ఎడిఎ కొంగర వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలను కొనుగోలు చేయాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాంక్యాతండా, ఎన్‌వి బంజర గ్రామాల్లో వానా కాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని దీని వల్ల అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో పాటు అంతర పంటలుగా మొదటి మూడేళ్లు మిరప, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేయవచ్చునని లేదా కోకో, వక్క వంటి ఇతర పంటను కూడా సాగు చేయవచ్చునని తెలిపారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు కంపెనీల మోసాల బారీన పడకుండా కంపెనీ నుంచి బాండ్ తీసుకుని విత్తన మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా నానో డిఏపి వాడకం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో వేదవ్యాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


## అమాయక ఆదివాసీలపై మోదీ, అమిత్ షా యుద్ధం

రాజ్యాగాన్ని ఉల్లంఘిస్తున్న కేంద్రం చర్యలను ఎండఘట్టాలి

ఆపరేషన్ కగార్"ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంఘనే


హత్యాకాండను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలి


వామపక్ష, విపక్షాల సదస్సులో నేతలు




**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** మధ్యభారతంలోని అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతోందని, ఈ చర్యలను దేశ ప్రజలు ముక్తకంఠంతో కండించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్,టిజెఎస్ జిల్లా నాయకులూ మల్లెల రామనాథం, మాస్ లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గౌస్ పాషా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, బిఎస్పి జిల్లా నాయకులు కురుమల్ల శంకర్, టిపిఎఫ్ జిల్లా నాయకులు ప్రశాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం శేషగిరిభవన్ లో జరిగిన వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాయకులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, ఆదివాసీ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉల్లంగించి ఆపరేషన్ కగార్ పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, అమాయక ఆదివాసీ బిడ్డలను పొట్టనపెట్టుకుంటోందని ఆరోపించారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ఉంచాల్సిన సైనికులను ప్రజలకోసం పోరాడుతున్న మావోఇస్టులపైకి ఉసిగొల్పుతూ హత్యలకు ప్రేరేపిస్తోదని విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు కోరుకోవడం లేదని, పేదరిక నిర్మూలన, పూర్తి స్థాయిలో విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బాధ్యతగా కేంద్ర పాలకులు ప్రకటిస్తే ప్రజలు స్వాగతిస్తారని అన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజ సంపదకు కాపలాదారులుగా ఉన్న గిరిజనులను, మావోయిస్టులను మట్టిబెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ కు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. తక్షణమే ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తి చెప్పి శాంతి చర్చలను కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గౌని నాగేశ్వరరావు, కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఫహీమ్, కె.ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీష్, గోపాల్ రావు, దేవదానం, రమేష్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ మాఫియా







**ప్రజాపక్షం/వైరా :** వైరాలో రేషన్ రీసైక్లింగ్ మాఫియా జోరుగా కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా పంపిణీ చేస్తున్న మూడు నెలలకు ఒకసారి రేషన్ బియ్యం పంపిణీ దళారులకు మిల్లర్లకు వరంగా మారింది. వైరాలోని కొన్ని రేషన్ షాపుల నుండి నేరుగా ప్రజాపంపిణీ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులకు తరలిస్తున్నారు. పేరు ప్రఖ్యాతిగాంచిన కొంతమంది మిల్లర్లు ఇటీవల కాలంలో ప్రభుత్వం ధాన్యాన్ని బదులుగా ఇచ్చే సిఎంఆర్ రైస్ క్రింద ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని మిల్లర్లు దింపుకుంటున్నారు. ఈ క్రమంలో ధాన్యం ఇచ్చేనా దానికి బదులుగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యంలో రేషన్ బియ్యాన్ని జత చేసి పంపిస్తున్నారని తెలుస్తుంది. అందించాల్సిన బియ్యాన్ని పంపించే క్రమంలో బస్తాలను కూడా తనిఖీ చేసిన సందర్భాలు కనపడలేదు. ఇటీవల కాలంలో ప్రజాపక్షంలో బియ్యంలో నాణ్యత పరిశబులించేది ఎవరైనా శీర్షికను ప్రచురించడం కూడా జరిగింది. దీనిపై డిఎస్‌వో సీరియస్ అయి తాటిపూడి గౌడాన్ వద్ద తనిఖీలు నిర్వహించి హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే వైరాలోని ప్రముఖ మిల్లులకు ఈ రేషన్ బియ్యాన్ని జోరుగా తరపున చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కొన్ని వందల క్వింటాల బియ్యాన్ని ఆ మల్లుకి తరలించారు అనే ఆరోపణ లేకపోలేదు. అసలు రేషన్ డీలర్లకు మిల్లర్లకు మధ్య కుదిరిన ఒపపదం ఏమిటి. కొంతమంది దళారులు ఈ రేషన్ బియ్యం వ్యాపారాన్ని వృత్తిగా ఎంచుకొని డైరెక్ట్‌గా రేషన్ షాపుల వద్ద నిలబడి వాటిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. కొంతమంది రేషన్ షాపు డీలర్లు అసలు నేరుగా బియ్యాన్ని వారే మిల్లర్లకు తరలిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. వైరాలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తే రేషన్ షాపుల వద్ద జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం దందా, అదేవిధంగా మిల్లర్ల వద్ద పెద్ద ఎత్తున నిల్వ ఉంచి సిఎంఆర్ పేరుతో కలిసి ప్యాకింగ్ చేస్తున్న వ్యవహారాలుకూడా బయటకు వస్తాయి.

## నెక్కొండ రైల్వేస్టేషన్లో కనీస సౌకర్యాలు లేని దుస్థితి

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని రైల్వే స్టేషన్ లోని రెండవ నెంబర్ ప్లాట్ ఫారం పై కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు నిత్యం ఎదుర్కొంటున్నారు.
కూర్చోవడానికి కుర్చీలు లేవు, నిలువ నీడ లేదు, తాగడానికి నీరు లేదు. దాదాపు పది మండలాలకు ఒకే ఒక రైల్వే స్టేషన్ సంవత్సరానికి లక్షలాది రూపాయల ఆదాయం ఇస్తున్న కనీస వసతులు కరువై ప్రజలు నిలబడి రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. కూర్చోవడానికి కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు, ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు కనీస వసతుల సౌకర్యాలు కల్పించాలేని దుస్థితి కొందరు ప్రయాణికు లైతె ఫ్లై ఓవర్ వంతెన మెట్లపై కూర్చుంటున్నారు. ఇంత దీనమైన పరిస్థితి ఏ రైల్వే స్టేషన్ లో కూడా ఉండకపోవచ్చు అని ప్రయాణికులు వారి అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పోగుల శ్రీనివాసరెడ్డి సేవలు చిరస్మరణీయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పోగుల శ్రీనివాసరెడ్డి సేవలు చిర స్మరణీయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో పోగుల శ్రీనివాస్ ఇంటికి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. తమ కుటుంబానికి ఎల్లవేళలా సిపిఐ అండగా ఉంటుందని ఆయన బరోసా ఇచ్చారు. గత మూడు దశాబ్దాలుగా పోగుల శ్రీనివాస్ విద్యార్థి దశనుండి పార్టీకి అందించిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, పంజాల రమేష్, కుమారుడు గోపి, కుమార్తె హరిత పాల్గొన్నారు.

## ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్‌కు ప్రమాదం

స్వల్ప గాయాలతో తప్పిన ప్రాణాపాయం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ కారు కు ప్రమాదం జరిగింది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లో యూనియన్ మీటింగ్ కార్యక్రమాలు ముగించుకొని ఉదయం 8 గంటల సమయంలో టీఎస్ 25 ఎఫ్ 8274 గల తన కారులో భూపాల పల్లికి బయలు దేరి వస్తున్న సమయంలో ములుగు జిల్లా తాడ్వాయి కి రాగానే కారు ముందు టైర్ ఒక్కసారిగా పేలి కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్ట డంతో అందులో ప్రయాణిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, తన డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డారు. అక్కడినుండి వెంటనే వేరే కారులో నేరుగా భూపాలపల్లి సింగరేణి ఏరియా హాస్పిటల్ కు చేరుకొని చికిత్స చేయించుకున్నారు. రాజ్ కుమార్ కు డాక్టర్ల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి ప్రమాదం లేదని తేల్చి చెప్పారు. రాజకుమార్ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

**పరామర్శించిన ఎఐటియుసి నాయకులు**

ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ ప్రమాద వార్త తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు హాస్పటల్లో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి రావు, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీలు గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, మధు గాని విజేందర్, గంగసారపు శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, ఎంఆర్‌సి రెడ్డి ఏఎల్పి ఫిట్ కార్యదర్శి గంగాధర్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, తాళ్ల పోశం, లు పరామర్శించినారు. ఎలాంటి ప్రమాదం లేదని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## పలువురు కాంగ్రెస్ నేతలను కలిసిన ఎమ్మెల్యే, పిసిసి ఉపాధ్యక్షురాలు



**ప్రజాపక్షం/పాలకుర్తి:** నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరెడ్డి తనకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ పదవి లభించిన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి పలువురు నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతకు ఇది గుర్తింపు, బాధ్యతగా భావించి ప్రతి ఒక్క కార్యకర్తను మద్దతుగా నడిపించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ బాధ్యతను నిస్వార్థంగా పనిచేసేందుకు వీలు పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు అందరితో పని చేసి విజయానికి కృషి చేస్తామన్నారు.

## కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి రూ.10వేలకు పెంచాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి రూ.10వేలకు పెంచాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి రూ.10వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని సాదా బైనామా దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టా చేయాలని, సమగ్ర పంటల భీమా పథకం తీసుకురావాలని మరిగడి గ్రామంలో భూ సదస్సులో తహశిల్దార్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతు ఋణాలు మాఫీ చేయాలని, ఋణ విమోచన చట్టం చేయాలని, గిట్టుబాటు దరల గ్యారంటీ చట్టం చేయాలని, ఫసల్ బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా మార్చాలని, తదితర హామీలను అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం గ్రామ కార్యదర్శి మల్లేష్, సమ్మయ్య, బాలకిష్టయ్య, కర్ణాకర్, రమేష్, విజయ్‌కాంత్, రాజు, రైతులు పాల్గొన్నారు.

## వంగర పోలీసులను అభినందిస్తూ ట్విట్టర్లో సిఎం పోస్ట్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వంగర పోలీస్ స్టేషన్ ఎస్ఐ దివ్య ఆధ్వర్యంలో పోలీసులు నిన్నటి రోజు సైకిల్ పై గ్రామ సందర్శన సంబంధించి వివిధ పత్రికలో వచ్చిన కథనాలపై స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంఘిక దురాచారాలపై ప్రజలకు చైతన్యం కలిగిస్తూ ఇతర పోలీసులకు ఆదర్శంగా నిలిచిన వంగర పోలీసులను అభినందనలు తెలుపుతూ పోస్ట్ చేయడం జరిగింది.

# విద్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి

విద్యాలయాలలో ఏర్పాట్లపై సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష

కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండ జిల్లా 2025–26 విద్యా సంవత్సరం గురువారం నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యాలయాల్లో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసి ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ జిల్లా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురుకుల డిగ్రీ కళాశాలల్లోని వివిధ కోర్సులు, ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురుకుల డిగ్రీ కళాశాలలో అందిస్తున్న కోర్సుల్లో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్యా బోధనతో పాటు కల్పిస్తున్న వసతులు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన అధ్యాపకులతో విద్యా బోధన, క్రీడలు, కెరీర్ గైడెన్స్, ప్రాంగణ ఎంపికలతో పాటు జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం ఉన్న వివరాలను తెలియజేస్తూ గురుకులాల్లో విద్యార్థులనమోదు శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. గురుకులాల్లో వసతులను కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.



**మడికొండ విద్యార్థినికి ఐఐటీ ఎంట్రన్స్‌లో అత్యుత్తమ ర్యాంక్**

మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని జి. సిందుజ జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ర్యాంకును సాధించినట్లు ప్రిన్సిపల్, జిల్లా సమన్వయ అధికారిణి ఉమామహేశ్వరి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఐఐటీలో ప్రవేశాలకు సంబంధించి 336వ ర్యాంకును సింధుజ సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని సాధించిన ప్రతిభను తెలియజేస్తూ రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి ఐఐటి ప్రవేశాలలో 336వ ర్యాంకు సాధించి స్ఫూర్తిగా నిలవడం పట్ల కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన పరుశురామ్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ మంత్రిగా నూతనంగా నియమితులైన చెన్నూర్ ఎమ్మెల్యే జి వివేక్ వెంకటస్వామిని హైధరాబాద్ లోని తన క్యాంప్ కార్యాలయంలో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా. జేరిపోతుల పరుశురామ్ మర్యాదపూర్వకంగా కలిసి కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, అనిల్, నోమేష్, వసంత్, వరుణ్, పాల్గొన్నారు



## రోగులకు సరిపడా మందులు

ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** వందల కిలోమీటర్ల నుండి రిటైర్మెంట్ కార్మికులు ఏరియా హాస్పిటల్ కు వస్తున్నారని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెల రోజులకు సరిపడు షుగర్, బిపి, థైరాడ్, మెడిసిన్ అందజేయాలని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో నల్ల రమేష్ ఫిట్ సెక్రెటరీ అధ్యక్షతన భూపాలపల్లి సింగరేణి ఏరియా హాస్పిటల్ ఏసిఎంఓ కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ నాయకులు మాట్లాడుతూ, గత రెండు నెలల నుండి భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ లో బీపీ, షుగర్, తైరాడ్ మొదలగు దీర్ఘకాలిక వ్యాధుల మందులు నెలకు సరిపడే విధంగా ఇవ్వడం లేదని, సింగరేణి కార్మికులు పదవి విరమణ పొందిన కార్మికులు 100 ,200 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి మందులు తీసుకొని వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మందులను సకాలంలో నెలకు సరిపడే విధంగా ఇవ్వగలరని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు ఎం విజేందర్, గంగసరం శ్రీనివాస్, తాళ్ల పోశం, పి నారాయణ, దోర్నాల తిరుపతి, పి.శ్రీనివాస్, ఏ.సది, పర్వేజ్ ఖాన్. నూనె రమేష్, శివ పార్వతి, రవికుమార్. సతీష్ ధనుంజయ్, అరుణ్ కుమార్, ధర్మరాజు,కే కృష్ణ స్వామి. సంపత్, జి శ్రీనివాస్ వెంకట స్వామి, రామయ్య, మాదరబోయిన శ్రీనివాస్, సంపత్ రెడ్డి, టి.రమేష్, వి.రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్

**ప్రజాపక్షం/నర్సంపేట :** గుడిసె వాసుల సమస్యలను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని సిపిఐ కాలనీ, మాదన్నపేట రోడ్డు కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, త్రాగునీ రు, రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు సమస్య, పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టివ్వాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సిపిఐ కాలనీ అభివృద్ధి కోసం పనిచేస్తానని, మీకు ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయాలని, మీ సమస్యల పరిష్కారం కోసమే మా ప్రభుత్వం ఉందని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దానిలో భాగంగానే నర్సంపేట నియోజకవర్గంలో 5000 ఇళ్లకు పైగా కట్టి ఇవ్వడం జరుగుతుందని అందులో భాగంగానే సిపిఐ కాలనీ వాసులకు ఇళ్లపట్టాలి ఇప్పించి పక్క గృహాలు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాలనీ కార్యదర్శి గడ్డం నాగరాజు, సహాయ కార్యదర్శి పిట్టల సతీష్, మహిళా సంఘం నాయకులు చెట్టే మమత, అరుణ, సరిత, భవాని, శ్రీలత, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# అనుమతి లేని షాహీన్ హై స్కూల్ సీజ్

ఎఐఎస్ఎఫ్, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** షహీన్ హై స్కూల్‌ని సీజ్ చేసి యాజమాన్యంపై చట్టరీత్యా క్రిమి కేసు నమోదు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్‌బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని ఎల్బీనగర్ ప్రాంతంలో ఉన్నటువంటి షహీన్ హై స్కూల్ ముందు ధర్నా నిర్వహించి స్కూల్ బోర్డులు హోర్డింగ్స్ ఫ్లెక్సీలు తీసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా ప్రజలకు మభ్యపెడుతూ నగర నడిబొడ్డున షాహిన్ హై స్కూల్ పేరుతో స్కూల్ ను స్థాపించి లక్షల రూపాయల ఫీజులు దోచుకుంటున్న విద్యాశాఖ అధికారులు చూసి చూడకుండా వ్యవహరిస్తూ షాహిన్ హై స్కూల్ యాజమాన్యానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అనుమతి లేకుండా స్థాపించిన ఈ పాఠశాలను సీజ్ చేయాలని , అనుమతి లేని ఈ షాహిన్ హై స్కూల్లో విద్యార్థులు అడ్మిషన్ తీసుకొని మోసపోవద్దని వారు విద్యార్థులకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి రోహిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఇందిరమ్మ ఇండ్ల కల సాకారం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో భారీ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నగర మేయర్ గుండు సుధారాణితో కలసి 11వ డివిజన్ రంగంపేటలో ఫాతిమున్నిసా, 29వ డివిజన రామన్నపేట లో టుంగుటూరి శ్రీదేవికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరుసగా జరుగుతున్న శంకుస్థాపనలతో ప్రజల్లో విశ్వాసం బలపడుతోందని, ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేస్తున్నామని వెల్లడించారు.ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు చిరకాల స్వప్నం నెరవేర్చడం తన బాధ్యత అని పేర్కొన్నారు.ఇది ఓటువేసిన ప్రజలకు రుణం తీర్చుకునే తరుణమని, వారి ఆశల్ని వమ్ము చేయం చేయకుండా 3500 మంది పేదలకు ఇండ్లు అందించాల్సిన బాధ్యత తన భుజాలపై ఉందని అన్నారు. వచ్చే 5 ఏళ్లలో ప్రతి అర్హుడికి ఇల్లు ఇవ్వాలన్నది తన ముఖ్య సంకల్పం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు పత్రాల పంపిణీ



**ప్రజాపక్షం/టేకుమట్ల:** పేదలకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల ఫైలెట్ గ్రామమైన టేగామమైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా మాచర్ల సంధ్య రాజేష్ లకు చెందిన నూతన గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గోన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేసారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడుతలో ప్రభుత్వం ఇండ్లు మాంజూరు చేస్తుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, లంచాలకు అస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంనర్సింహరెడ్డి, సతీష్ గౌడ్, తిరుపతిరెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్, హౌసింగ్ ఎఈ సౌమ్య, తహసీల్దార్ విజయలక్ష్మీ శ్రీకాంత్, కొడారి రాజు, ప్రవిణ్‌రావు, గందం సారయ్య, సతీష్‌రావు శ్రీనివాస్‌రావు పాల్గోన్నారు.

## మాడల్ మార్కెట్ పనులు వేగవంతం

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** పట్టణంలోని దయానిలయం వద్ద నిర్మాణమవుతున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ వాసుల సౌలభ్యం కోసం నిర్మాణం చేపట్టిన మాడల్ మార్కెట్ పనులను నెలరోజులలో పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ, ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

**బాలల హక్కులను పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత**

బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జూన్ 11వ తేదీన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా కార్మిక సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్, జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి కుమారస్వామి, జిల్లా విద్యాధికారి భోజన్న, బాలల సంక్షేమ కమిటి చైర్‌పర్సన్ ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆగ్రోస్ సెంటర్‌లో విత్తనాలు సీజ్

జిల్లా వ్యవసాయ అధికారి



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పలు ఎరువుల దుకాణాలు విత్తనాలు దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆగ్రోస్ రైతు సేవ సెంటర్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వారి విత్తనాల బ్యాగు లోనై సరైన లేబుల్ లేని కారణంగా 190 బస్తాల వారి విత్తనాలను షేర్ చేశారు. ఈటీవీలో 194500, ఉంటుంది. అలాగే ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లైసెన్సులో నమోదు లేని కారణంగా షాపులో నిలువ ఉంచిన పురుగుమందులను సీజ్ చేశారు. వీటి విలువ 185600 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి భూభారతి



కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడ గూడూరు బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని రెవెన్యూ సదస్సులు అంగన్వాడి వసతి గృహాలను పాఠశాల భవనాలను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ఆకస్మీకంగా తనిఖీ చేశారు.మండలంలోని మట్టేవాడ రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన నూతన భూబారతి రెవెన్యూ చట్టం 2025 రెవెన్యూ సదస్సులు రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకోవాలని వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులను పక్కాగా వినియోగించుకోవాలని సూచించారు.గూడూరు మండల కేంద్రంలో ఆశ్రమ హైస్కూల్‌ని సందర్శించిన వేసవి సెలవుల అనంతరం విద్యసంస్తలు అంగన్వాడి కేంద్రాలు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులపాటు మిషన్ మోడ్ యుద్ధ ప్రతిపాదికన ప్రత్యేక అధికారులు విద్యాసంస్థలు అంగన్వాడి కేంద్రాలు శినిటేషన్ పరిశుభ్రత విద్యుత్ ఫ్యాన్స్ టాయిలెట్స్ క్లాస్రూమ్స్ బ్లాక్ బోర్డ్ యూనిఫామ్ తదితర అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని పాఠశాలను ప్రారంభించేందుకు ఒక పండుగ వాతావరణం లో అన్ని చర్యలుతీసుకోవాలని అన్నారు. చిన్నారులు ఇష్టపడే పౌష్టికాహారాన్ని అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్నట్ల ఈసందర్భంగా ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి జిల్లా వెల్ఫేర్ అధికారి ధనమ్మ సిడిపివోలు నిలోఫర్ అద్మి పాల్గోన్నారు.

# క్రీడ

## రెండో స్థానంలోనే మంధాన



ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ స్మృతి మంధాన రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ వికెట్ కీపర్, బ్యాటర్ అమీ జోన్స్ తాజాగా ఐసిసి మహిళల ర్యాంకింగ్స్‌లో సత్తా చాటారు. వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి వన్డేలో ఆమె సంచలనాత్మక సెంచరీ సాధించారు. ఈ ప్రదర్శన తర్వాత, జోన్స్ మూడు స్థానాలు ఎగబాకి ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి చేరుకున్నారు. అంతటితో ఆమె ఆగిపోలేదు. రెండో వన్డేలోనూ 98 బంతుల్లో 129 పరుగులు సాధించారు. ఈ అత్యుత్తమ ప్రదర్శనతో ఆమె ప్రస్తుతం 689 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. 738 పాయింట్లతో లారా వోల్వార్డ్ మొదటి స్థానంలో, 727 పాయింట్లతో స్మృతి మంధాన రెండో స్థానంలో, 719 పాయింట్లతో నటాలీ స్కైవర్‌బ్రంట్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తున్న జోన్స్ ర్యాంకింగ్‌లో మరింత దూసుకుపోయే అవకాశం ఉంది. త్వరలో జరగనున్న భారత పర్యటనలో ఆమె.. ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంది.

## బిసిసిఐపై గంగూలీ గరం గరం!




ఇంగ్లాండ్ పర్యటనకు శ్రేయాస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకోకపోవడంపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయ్యర్ ఇటీవల మెరుగ్గా రాణిస్తున్నాడని.. తనికి అవకాశం ఇవ్వాల్సిందన్నారు. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్–భారత్ మధ్య ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్ జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టు ఇంగ్లాండ్‌కు చేరుకుంది. ప్రాక్టీస్ సైతం షురూ చేసింది. అయితే, టెస్టు జట్టులోకి అయ్యర్‌ను గంగూలీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఏడాది కాలంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నాడని.. అతను జట్టులో ఉండి ఉండాల్సిందని పేర్కొన్నారు చాలాకాలం జట్టుకు దూరంగా ఉన్న ఆటగాడని.. ఇప్పుడు ఒత్తిడిలోనూ పరుగులు సాధిస్తున్నాడని, బాధ్యత తీసుకుంటున్నాడని గుర్తు చేశాడు. షార్ట్ బాల్స్ బాగా ఆడుతున్నాడని.. టెస్ట్ క్రికెట్ భిన్నంగా ఉన్నప్పటికీ సిరీస్‌లో అతన్ని జట్టులో చేర్చాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశాడు మాజీ కెప్టెన్.

## ఫైనల్‌లో రబాడ స్వింగ్ షో..

### ఒకే ఓవర్లో 2 వికెట్లు

క్రికెట్ మక్కాగా పేరుగాంచిన లార్డ్స్ మైదానంలో బుధవారం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌ను సౌతాఫ్రికా జట్టు అద్భుతంగా ప్రారంభించింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా జట్టు రెండు పెద్ద షాకులను ఇచ్చింది. తొలి 10 ఓవర్లలోనే కగిసో రబాడ తన సత్తాను చాటాడు. కగిసో రబాడ ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాకు క్రీజులో నిలదొక్కుకునే అవకాశం ఇవ్వలేదు. డబ్ల్యుటిసి ఫైనల్‌లో ఖవాజా ఒక్క పరుగు కూడా చేయకుండానే.. 20 బంతులు ఆడి డకౌట్ అయి పెవిలియన్ చేరాడు. చాలా కాలం తర్వాత మైదానంలోకి తిరిగి వచ్చిన కామెరూన్ గ్రీన్ కూడా బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపరిచి కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు.

**కగిసో రబాడ విజృంభణ**

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ దక్షిణాఫ్రికా అనుకూలంగా పడటంతో, కెప్టెన్ టెంబా బావుమా బౌలింగ్ ఎంచుకున్నాడు. కగిసో రబాడ, మార్కో జాన్సెన్ తొలి మూడు ఓవర్లలో కట్టుదిట్టమైన బౌలింగ్ వేసి, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్‌లకు ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు. రబాడ, జాన్సెన్ వ్యూహంలో ఖవాజా పూర్తిగా చిక్కుకుపోయాడు.



రబాడ వేసిన ఏడో ఓవరల్ మూడో బంతి స్వింగ్ అయ్యి ఖవాజా బ్యాట్ అంచుకు తాకింది. స్లిప్‌లో ఉన్న డేవిడ్ బెడింగ్‌హామ్ క్యాచ్ అందుకోవడంలో ఎలాంటి పొరపాటు చేయలేదు. ఖవాజాను డకౌట్ చేసిన తర్వాత రబాడ్ అదే ఓవర్లో గ్రీన్‌ను కూడా ఔట్ చేశాడు. ఓవర్ చివరి బంతి గ్రీన్ బ్యాట్ లోపలి అంచుకు తగిలి మార్‌క్రమ్ చేతుల్లోకి వెళ్లింది. గ్రీన్ కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు.

**టెంబా బవుమా అద్భుతమైన కెప్టెన్సీ రికార్డు**

దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాకు టెస్ట్ క్రికెట్‌లో అద్భుతమైన కెప్టెన్సీ రికార్డు ఉంది. బవుమా కెప్టెన్సీలో ఇప్పటివరకు సౌతాఫ్రికా జట్టు ఒక్క టెస్ట్ మ్యాచ్‌లో కూడా ఓటమి పాలు కాలేదు. బవుమా ఇప్పటివరకు మొత్తం 9 మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించగా.. వాటిలో ఆ జట్టు 8 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇప్పుడు ఈ రికార్డును డబ్ల్యూటీసీ ఫైనల్‌లో కూడా బవుమా కొనసాగించగలుగుతాడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

# ఫోకస్ కళారంగం

## విస్తరిస్తున్న ఎన్‌ఎఫ్‌టి టెక్నాలజీ



కళారంగంలో ఇటీవల చోటు చేసుకున్న ప్రధాన మార్పుల్లో 'నాన్ ఫంజిబుల్ టోకెన్స్' (ఎన్‌ఎఫ్‌టి) సాంకేతికతను ప్రధానంగా ప్రస్తావించుకోవాలి. భవిష్యత్తు మొత్తం ఈ విధానానేనని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. డిజిటల్ కళాకారులు తమ కళాకృతులకు ఎన్‌ఎఫ్‌టి సొబగులు అద్దుతున్నారు. డిజిటల్ కళాకారులకు తమ సృష్టిపై పూర్తి నియంత్రణ కలిగి ఉండటానికి, కొత్త డిజిటల్ ఆదాయ వనరులలో పాల్గొనడానికి ఈ టెక్నాలజీ అవకాశం కల్పిస్తుంది. వేలం ఇళ్లు, మ్యూజియంలు, గ్యాలరీలు ఎన్‌ఎఫ్‌టిలను ఇంటిగ్రేట్ చేసుకుని, డిజిటల్ కళాకారులతో సహకరించడం కొనసాగిస్తాయి. అదే విధంగా కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత కళ మరింత అభివృద్ధి చెందుతున్నది. 1960 దశకం నుండి కళాకారులు ఎఐ ప్రక్రియను ఉపయోగిస్తున్నప్పటికీ, జనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్‌వర్క్‌లు (జిఎఎన్) వంటి ఆధునిక టెక్నాలజీలు కళాకారులకు సాంప్రదాయ ఫైన్ ఆర్ట్‌కు సమానమైన దృశ్య ప్రభావాలను సృష్టించడానికి వీలు కల్పిస్తున్నాయి. పదాలతో వర్ణిస్తే, అద్భుతమైన చిత్రాలను ఎఐ సృష్టిస్తున్నది. ఈ పరిస్థితుల్లో చిత్రకారులు సునిశిత మేధస్సుతో, మరింత సృజనతో వ్యవహరించక తప్పదు. కాగా, డిజిటల్ ఆర్ట్ భవిష్యత్తులో మరింత ఇంటరాక్టివ్ అవుతుంది. ప్రేక్షకులతో సంభాషించే ఇన్‌స్టాలేషన్‌లు ఇమ్మెర్సివ్ అనుభవాలను సృష్టిస్తాయి, ఇందులో వినియోగదారులు కళాకృతిలో చురుకుగా పాల్గొనవచ్చు. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటేడ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ వంటి టెక్నాలజీలు కళాకారులకు పూర్తిగా కొత్త ప్రపంచాలను సృష్టించడానికి అవకాశం ఇస్తాయి. ఇంటర్నెట్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా, కళాకారులు తమ కళాకృతులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులతో పంచుకోవడం కొనసాగిస్తున్నారు. ఈ లక్షణం కళకు ప్రాప్యతను పెంచింది. కళా సమాజానికి డిజిటల్ అవసరాలను కనుగొనడానికి, అభినందించడానికి వీలు కల్పిస్తుంది. ఎన్‌ఎఫ్‌టి ఆర్ట్ కమ్యూనిటీలు కళాకారులను, కళా పోషకులను ఒకచోట చేరుస్తాయి, కళాకారులకు మరింత గుర్తింపు మరియు డిజిటల్ ఆర్ట్ ప్లాట్‌ఫారమ్‌లపై దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయి. సరికొత్త ఆలోచనా విధానం డిజిటల్ ఆర్ట్‌లో కీలక లక్షణంగా కొనసాగుతుంది. పెరుగుతున్న సాంకేతిక పరిణామం, కొత్త సృష్టి సాధనాల ఆవిర్భావం కళాకారులకు కొత్త ప్రాంతాలను అన్వేషించడానికి అనేక రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుంది. అధునాతన ఎడిటింగ్ ప్రోగ్రామ్‌లు, 3డి మోడలింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ టూల్స్ డిజిటల్ ఆర్ట్‌ను ముందుకు నడిపిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలలో కొన్ని మాత్రమే. టెక్నాలజీ నిరంతరం అభివృద్ధి చెందుతున్నందున, డిజిటల్ ఆర్ట్ మీ కళా వృత్తిలో తదుపరి అడుగు కావచ్చు. ఎన్‌ఎఫ్‌టిల ఉపయోగం డిజిటల్ ఆర్ట్‌ను కొనడం మరియు విక్రయించడాన్ని ప్రపంచవ్యాప్తంగా సులభతరం చేయడమే గాదు.. అందుబాటులో కూడా ఉంచింది. క్యారెక్టర్ డ్రాయింగ్, యానిమేషన్ మరియు స్కెచింగ్‌లో మీ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడం మీకు సరైన ఎన్‌ఎఫ్‌టి మార్కెట్‌ప్లేస్‌లో మీ కళను ప్రదర్శించడానికి, విక్రయించడానికి మార్గాలు కల్పిస్తున్నది.

### కళలపై 'సాంకేతిక' ప్రభావాలు..

సాంకేతిక విప్లవ ప్రభావాలు కళలపై స్పష్టంగా కనిపిస్తున్నది. పారిశ్రామిక విప్లవం నుండి ఆధునిక సాంకేతిక విప్లవం వరకు, ఈ మార్పులు కళారంగాన్ని పూర్తిగా మార్చివేశాయి. పారిశ్రామిక విప్లవం (1760–1840) కాలంలో యంత్రీకరణ, కొత్త ఉత్పత్తి పద్ధతులు, ఆవిరి శక్తి వంటి ఆవిష్కరణలు కళలపై కూడా ప్రభావం చూపాయి. ఈ కాలంలో, కళాకారులకు కొత్త పదార్థాలు, రంగులు, వస్త్రాలు అందుబాటులోకి వచ్చాయి. ముద్రణ సాంకేతికత అభివృద్ధి చెందడంతో సాహిత్య కళలు విస్తృతంగా వ్యాపించాయి. పారిశ్రామిక విప్లవం సృష్టించిన సామాజిక మార్పులు కళా విషయాలలో ప్రతిబింబించాయి. 20వ శతాబ్దంలో సాంకేతిక విజ్ఞానం మరింత వేగంగా అభివృద్ధి చెందడంతో, కళలపై ప్రభావం ఇంకా పెరిగింది. డిజిటల్ టెక్నాలజీ ద్వారా కొత్త కళా రూపాలు (డిజిటల్ ఆర్ట్, వర్చువల్ రియాలిటీ ఆర్ట్) ఆవిర్భవించాయి. సంగీత రంగంలో ఎలక్ట్రానిక్ వాయిద్యాలు, కంప్యూటర్ ఆధారిత సంగీత నిర్మాణం సాధ్యమయ్యాయి. ఫోటోగ్రఫీ, సినిమా, వీడియో ఆర్ట్ వంటి కొత్త కళా మాధ్యమాలు పుట్టుకొచ్చాయి. సోషల్ మీడియా ద్వారా కళాకారులు ప్రపంచవ్యాప్తంగా తమ కళను ప్రదర్శించే అవకాశాలు పెరిగాయి. అయితే సాంకేతిక విప్లవం కొన్ని సవాళ్లను కూడా తెచ్చింది. సంప్రదాయ కళా రూపాలు కొన్ని అంతరించిపోతున్నాయి. భౌతిక కళల స్థానాన్ని డిజిటల్ కళలు ఆక్రమించడం ప్రారంభించాయి. కళాకారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. సాంకేతిక విప్లవం కళలను ప్రజాస్వామ్యీకరించడంలో కూడా కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ఎక్కువ మంది కళాకారులు తమ కళ నైపుణ్యాలను ప్రదర్శించగలుగుతున్నారు. ఎక్కువ మంది ప్రేక్షకులు వాటిని ఆస్వాదించగలుగుతున్నారు.



## ఉపాధి కూలీలకు ఆత్మీయ భరోసా రూ.12వేలు తక్షణమే అందించాలి



వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఆత్మీయ భరోసా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నేరేడుచర్ల మండలం తెలగరామయ్యగూడెం గ్రామంలో జరిగిన మండల వ్యవసాయ కార్మిక సంఘ సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకునేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకునేందుకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని, యుపిఎ ప్రభుత్వ హాయంలో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకాన్ని తీసుకవచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద వ్యవసాయ కార్మికులకు జీవిత భద్రత కల్పించేందుకు సాధించుకున్న ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ సంవత్సరానికి 12వేల రూపాయలతో పాటు జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రథమ ప్రాధాన్యత పేద వ్యవసాయ కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సోమగాని వెంకటేశ్వర్లు, రావుల సత్యం, చిలకరాజు శ్రీను, సోమగాని ప్రసాద్, యల్లావుల నరేష్, చలకమీద ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి**




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, స్థానిక ప్రజల హక్కు లు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల సిపిఐ మూడవ మహాసభ కొత్త తండలో బుట్ట వీరన్న, కోటేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత బట్టు వీరన్న సిపిఐ ప తాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలన్నారు. మరోప్రక్క మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతోందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ కోరారు. పేద ప్రజలకు ఎర్ర జండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘపోరాటాలు, త్యాగాలతో నిరమితమైన ఎర్రజండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్ళైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతిని ధ్యం ఉండేలా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భర జీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నాంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్రజెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని విజయసారథి స్పష్టం చేశారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, కృష్ణమూర్తి, మద్దివంచ మా ద్దివంచ మాజీ ఉప సర్పంచ్ బీముడు, దారావత్ వీరన్న, సింగర్ రమేష్, నాగేష్, దుపాడు జనార్ధన్, కట్టెబోయిన బిక్షమయ్య, రాగం సత్యనారాయణ, మాగం లోకేష్, రాగం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు :సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) :** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మారుపాక వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని సింగారం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ మహాసభ పంజాల లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ అర్హులైన పేదలకే ఇవ్వాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలైనా రేషన్ కార్డులు ఇవ్వలేదు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. పథకాలు అమలు చేయని యెడల భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా పంజాల లక్ష్మీ నరసయ్య, సహాయ కార్యదర్శిగా భూతరాజు యాదగిరిలతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి జక్కయ్యకర్ రెడ్డి, పంజాల భద్రాద్రి, పంజాల చంద్రమౌళి,పంజాల ఆంజనేయులు, మారుపాక సోమయ్య, మారుపాక స్వామి,అనుబత్తుల సిద్ధులు,దాసరి బిక్షపతి భూతరాజు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడేది సిపిఐ

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత వంద సంవత్సరాల నుంచి నిరంతరం పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ మాత్రమేనని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు అన్నారు. మండల పరిదిలోని కొత్తకాచారంలో సిపిఐ గ్రామశాఖ మహాసభ బండారుపల్లి భాస్కర్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతు కూడు, గుడ్డ నినాదంతో దళిత, గిరిజనులు, పేదలు బడుగు బలహీన వర్గాలకోసం భూపోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాలు భూమి లేని నిరుపేదలకు పంచిన ఘనత సిపిఐకే దక్కిందని అన్నారు. నేటి పాలకులు అవలంబిస్తున్న విధానాలవలన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. సమాజంలో ఆర్థిక దోపిడి ఎక్కవయిందని తెలిపారు. వచ్చే డిశంబర్‌కు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మునిగె కోటేశ్వరరావు, మా జీ సర్పంచ్ మోదుగు చిన్నవెంకటి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తకాచారం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా తేళ్లూరి రాములును, సహాయ కార్యదర్శిగా కన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




## పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటక పు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యద ర్శి ఎస్‌కే సాబీర్ పాషా విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని రాజేపేట గ్రామంలో సిపిఐ ములకలపల్లి మండల 17వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, మహాసభ ప్రారంభ సూచీగా అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధా కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి తో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసు ను సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతమెందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్‌కౌంటర్లు చేస్తుండటం, మరో పక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న విషయమని స్పష్టమవుతుందన్నారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పో రాటాలు, త్యాగాలతో




నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదన్నా రు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధం గా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమా జ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్‌కే జబ్బార్, నరాటి ప్రసాద్, కోర్రి భద్రం, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యు లు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరావు, డివిజన్ కార్యదర్శి ఎస్‌డి సలీం, సిపిఐ మండల కార్యదర్శి ఎండీ యూసుఫ్, నాయకులు కోర్స భద్రం తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐలో చేరిన ముఖమామిడి తండా గ్రామస్తులు....**


సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు నరాటి ప్రసాద్ సమక్షంలో భూక్యా దేవ్ సింగ్, బాలు, భద్రు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు సిపిఐలో చేరారు.

## మావోయిస్టులతో చర్చలు జరపాలి




- ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలి
- ఈనెల 14వ తేదీన వరంగల్‌లో ర్యాలీ, ధర్నా
- సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో జరిగిన వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల సమావేశానికి న్యూ డెమొక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో వేర్పాటు వాదులతో, ఉగ్రవాదులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించుకున్న దాఖలాలు అనేకం ఉన్నాయని, కానీ నేటి మోడీ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకుండా మావోయిస్టులను వచ్చే మార్చి కల్లా అంతం చేస్తామని ప్రకటించడం సమంజసం కాదని, హింసకు హింస పరిష్కారం ఎన్నటికీ కరెక్ట్ కాదన్నారు. మావోయిస్టులు, ఆదివాసీలు తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మావోయిస్టులు, ఆదివాసీలు అడ్డుగా ఉన్నారనే కారణంతోనే ఈ ఆపరేషన్ కగార్ అని అన్నారు. ఈనెల 14 వ తేదీన ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ రైల్వే స్టేషన్ నుండి ఉదయం 10 గంటలకు ప్రదర్శన నిర్వహించి సెంటర్‌లో ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాను విజయవంతంచేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, సిపిఐ(ఏంఎల్ )న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యులు వెంగల్ రెడ్డి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## పాఠశాలల వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

జిల్లా రవాణా అధికారి రామ్ చందర్ నాయక్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న దృష్ట్యా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందాలని జిల్లా రవాణా అధికారి రామ్ చందర్ నాయక్ తెలిపారు. చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సును నడపడానికి అనుమతించడం జరగదని, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న బస్సులను గుర్తించడానికి ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్‌లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రవాణా వాహనాలు చెల్లుబాటు అయ్యే పత్రాలు కలిగి ఉండాలని, త్రైమాసిక పన్ను చెల్లించి జరిమానాలను నివారించాలని తెలిపారు.

## అమ్మ మాట-అంగన్‌వాడీ బాట..




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ శ్యామల ఆధ్వర్యంలో అమ్మ మాటా-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని బుధవారం చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ సాధికార సంస్థ అధికారి శైలజ,హెచ్ఎం కవిత,అంగన్వాడీ టీచర్లు సరళ దేవి,మెప్మా వరలక్ష్మి ,విఓఏలు,ఏడబ్ల్యూటీలు మానస,మమత,చందు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టు పిల్లలకు నూరు శాతం ఫీజు రాయితీని కల్పించాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టియూడబ్ల్యుజె ఐజెయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్‌ధోత్రేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాల వారే ఎక్కువ మంది జర్నలిస్టులు ఉన్నారని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వారి పిల్లలకు ఫీజు రాయితీ కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. జర్నలిస్టు పిల్లలకు నూటికి నూరు శాతం రాయితీని అందే విధంగా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టియూడబ్ల్యుజే నాయకుడు నగరారే తారు పాల్గొన్నారు.

## పాఠశాలలకు ఏకరూప దుస్తులు



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏకరూప దుస్తులు ఆయా పాఠశాలలకు చేరుకున్నాయని మండల విద్యాశాఖ అధికారి తి రుపతిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం కేజీబీవీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు ఎంపీడీఓ గంగాధర్ చేతుల మీదుగా పాఠశాల టీచర్‌లకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంనారాయణగౌడ్, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారులకు పదోన్నతులు



**ప్రజాపక్షం/ మందమర్రి :** మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంకు బదిలీపై వచ్చిన ఐఇడి శాఖ అధికారి రాజ్‌కుమార్‌కు మందమర్రిలో ఎఎస్ఓగా చేస్తున్న అధికారి రవీందర్ బదిలీపై భూపాలపల్లి ఏరియాకి వెళ్తున్న సందర్భంగా మందమర్రి ఎఐటియూసి బ్రాంచ్ నాయకులు ఇరువురిని సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, స్ట్రక్చర్ కమిటి సభ్యులు సివి రమణ, సిఇఆర్ క్లబ్ సెక్రటరీ బానయ్య, జిఎం ఆఫీస్ కమిటి సభ్యులు అనంతలక్ష్మి , జ్యోతి, జలధి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోషకాహారం అందాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** అంగన్‌వాడీ పిల్లలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి తెలిపారు. బుధవారం నర్సాపూర్ మండలంలో పరిధిలోని రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ నూతనంగా ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యాని పథకాన్ని ప్రారంభించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇటీవల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్గ్రేడ్ చేసి వేతనాలు పెంచినట్లు తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు, ఆట వస్తువులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు ఎగ్ బిర్యానీ ప్రారంభించిందన్నారు. ప్రతి బుధవారం పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు పోషకాహారంతో పాటు సృజనాత్మకతను వెలికి తీస్తూ ఆటపాటలతో విద్య నేర్పిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ హేమా భార్గవి, ఎంపిడిఒ మధులత సూపర్వైజర్ సరళ కుమారి అంగన్‌వాడీ టీచర్, పిల్లలు, తల్లులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాంతో కలిసి వైద్యాధికారులతో మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైల్ ఏరియా వంటి వ్యాధులు ప్రబలకుండా నియంత్రించాలని, కలుషిత నీరు త్రాగడం వల్ల కలిగే వ్యాధుల ప్రభావంపై ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఆశ, అంగన్వాడీ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. నెలలు నిండిన గర్భిణులను ప్రసవం కొరకు ముందస్తు ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా వంట చేసే సిబ్బందికి స్థానికంగా వైద్య పరీక్షలు నిర్వమించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





### భూసమస్యల పరిష్కారానికి సదస్సులు

**వాంకిడి :** భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. బుధవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం అర్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సందర్శించి ఆర్జీదారుల సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల సమస్యలపై వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారిగా వేరు చేయాలని, దరఖాస్తులను పరిశీలించారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించవలసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి తమ పరిధిలో లేని దరఖాస్తులను పై స్థాయికి పంపించాలని తెలిపారు. రైతులు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు సమర్పించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.కవిత, మండల సర్వేయర్ పుల్లం రామకృష్ణ, గిర్దవార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలు

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వివిధ శాఖల సహకారంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు నిర్వహించిన దాడులు, స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఆ విభాగం నిజామాబాద్ జోన్ డీఎస్పీ సోమనాథం అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇటీవలి కాలంలోనే సుమారు రూ. 42.98 కోట్ల విలువ చేసే అల్ప్రాజోలం నిల్వలను సీజ్ చేయటం జరిగిందన్నారు. అల్ప్రాజోలం విక్రేతలను పట్టుకుని పకడ్బందీ విచారణ జరపటంతో పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని పలు జిల్లాలో వాటి మూలాలున్నట్లు కనుగొని అనేక కంపెనీలపై దాడులు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలు పెద్ద ఎత్తు నపట్టుబడ్డాయన్నారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పని తీరును అదనపు కలెక్టర్ అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించే అల్ప్రాజోలం, క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించే దిశగా అంకితభావంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని హితవు పలికారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే వీటి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందని అదనపు కలెక్టర్ గుర్తు చేశారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారమందించాలని టోల్‌ఫ్రీ నెం. 1908 కు కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని అదనపు కలెక్టర్ ప్రజలకు సూచించారు. సమాచారమందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.




## బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ప్రభుత్వ బడిబాట విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పూల బాట అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మంభోజిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి, ఆవుసులపల్లి ప్రాథమికొన్నత పాఠశాల వరకు సంబంధిత అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్‌డిఒ రమాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, సంబంధిత ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మెదక్ పట్టణ యువత, పోలీస్ యంత్రాంగంతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ బడిబాట కార్యక్రమం 10కె రిలే వాక్ కార్యక్రమాన్ని మంబోజి పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో సరికొత్త సాంకేతిక విద్యా విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని ప్రభుత్వ పాఠశాలలో, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మంచి మౌలిక వసతులు కల్పించడం జరిగిందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడం కోసం ఈ అవగాహన ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం అవుసులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ వివరించి, విద్యార్థుల నమోదును పత్రాలను కలెక్టర్ స్వయంగా అందించారు. కార్యక్రమంలో ఇతర జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో



**ప్రజాపక్షం/బోధన్ :** రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సూచించారు. బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ మోస్రా మండలంలోని రెవెన్యూ సదస్సును పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సదస్సులలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతితోనే భూ సమస్యలకు పరిష్కారం అవుతాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరంపై సిబిఐ విచారణ

బిజెపి శాసనసభ ఉపపక్షనేత పాయల్ శంకర్ డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరిపించాలని బిజెపి శాసనసభ పక్ష ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ లక్ష్యంగా, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్న మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 11ఏళ్లలో జరిగిన దేశాభివృద్ధి పేదల సంక్షేమం, మహిళలు బడులు బలహీన వర్గాల సాధికారత వంటి అంశాలపై జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, వివిధ రంగాల నిపుణులతో జరిగిన చర్చాగోష్టి కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, కార్యదర్శి మురళీధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడారు. మోదీ పరిపాలన చూసి కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు భయం పట్టుకుందన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న మోదీకి ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. ప్రధాని కావాలని కలలు గంటున్న రాహుల్‌గాంధీ దేశ ఆర్థిక పరిస్థితిని తక్కువ చేసేలా మాట్లాడటం శోచనీయమన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు ఒక్కటేనని, కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. అవినీతి పాలన చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు బొంద పెట్టారని, అదే తరహాలో కాంగ్రెస్ పార్టీని త్వరలోనే ప్రజలు బొంద పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7500 కోట్లు అప్పులు చేస్తే, రెండేళ్లలోపు కాంగ్రెస్ ప్రభుత్వం 2500 కోట్లు అప్పులు చేసిందని, ఐదేళ్లలో పది వేల కోట్ల అప్పులు చేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బిజెపి బలంగా ఉందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం మాదేనన్నారు. సమావేశంలో రాజు, లక్ష్మీ నారాయణ, వినోద్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.




## క్యాన్సర్ బాధితురాలికి జగ్గారెడ్డి చేయూత

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** నియోజకవర్గంలో క్యాన్సర్‌తో బాధపడే నిరుపేదలకు చికిత్స కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నానని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం సంగారెడ్డి పట్టణంలోని సోమేశ్వరవాడకు చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రాణమ్మకు చికిత్స కోసం నాలుగు లక్షలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ ట్రీట్ మెంట్‌కు లక్షల రూపాయలతో కూడుకున్న వ్యవహారం కావడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. క్యాన్సర్ అనేది ఎవ్వరికి రావ్వదన్నారు. క్యాన్సర్ బాదితుల ది టెన్షన్ లతో కూడిన జీవితమన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో బతకడం లేరన్నారు. ట్రీట్‌మెంట్ కోసం అప్పులు చేసిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన ఆర్థిక స్థోమత లేని పేద క్యాన్సర్ పేషెంట్లకు ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నని తెలిపారు. ఇటీవల సదాశివపేటలో క్యాన్సర్ పెషంట్‌కు రూ.10లక్షల రూపాయలు, సంగారెడ్డి పట్టణానికి చెందిన క్యాన్సర్ పెషంట్‌కు రూ.4లక్షలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఆరోగ్య సమస్యల చికిత్స కోసం సహాయం కావాలని ఎంతో మంది వస్తారు, వారికి నా ద్వారా వీలైనంత సహాయం అందుతుందన్నారు. సహాయంపై తనకు మీడియాలో రావడం ఇష్టం ఉండదన్నారు. ఇలా ఇప్పుడు మీడియా ముందుకు రావడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో ఎంతో మంది దాతలు ఉన్నారని, క్యాన్సర్ పేషంట్‌లకు వారి ద్వారా వీలైనంత సహాయం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో తాను ఇప్పుడు ఆర్థిక సహాయంపై మీడియా ముందుకు రావడం జరిగిందన్నారు.



## రైతుల కన్నీళ్లు తుడిచిన కెసిఆర్‌పై కుట్రలా?

ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల కన్నీళ్లు తుడిచిన కెసిఆర్‌పై కుట్రలా అంటు సంగారెడ్డి నియోజయకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ ముందు మాజీముఖ్యమంత్రి కెసిఆర్ హాజరు సందర్భంగా హైదరాబాద్ బిఆర్‌కె భవన్ వద్ద కెసిఆర్‌కు మద్దతుగా ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసిన ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రయత్నాలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములకు జీవం పోసిన వారు కెసిఆర్ అన్నారు. కాళేశ్వరంతో కరువు నేలను సస్యశ్యామలం చేసిన కెసిఆర్‌పై విచారణ చేపట్టడం అంటే రేవంత్ రెడ్డి కక్షసాధింపు వైఖరి స్పష్టంగా కనబడుతుందన్నారు.



## పోలీసులకు ఫిర్యాదు చేస్తాడనే భయంతో హత్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నగర శివారులోని పాంగ్రా వాగు వద్ద సోమవారం రాత్రి జరిగిన హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పదవీ విరమణ పొందిన ఓ ఎస్సై కుమారుడు ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది? పాంగ్రా శివారులో వ్యక్తి హత్యను సవాల్‌గా స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన వసంతరావు రిటైర్డ్ ఎస్సై కొడుకు ఇద్దరు కలిసి సోమవారం రాత్రి పాంగ్రా కల్లు బట్టిలో కల్లు తాగిన మైకంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా వసంతరావుపై రిటైర్డ్ ఎస్సై కొడుకు దాడి చేశాడు. దాడితో అక్కడి నుండి వెళ్లిపోతున్న వసంతరావు తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాడనే భయంతో వసంతరావుని వెంబడించాడు. అక్కడే ఉన్న బండరాయితో తలపై ముఖంపై మోది అక్కడి నుండి పారిపోయాడు. తీవ్ర గాయాలైన వసంతరావు అక్కడికక్కడే చనిపోయాడు. పూర్తి వివరాలు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలుపనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## పంచాయతీ కార్యదర్శి హత్య కేసులో నలుగురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పి రాజేష్‌చంద్ర

**ప్రజాపక్షం/పిట్లం :** పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి హత్య కేసును బాన్సువాడ సిఐ, వారి పోలీసు బృందం ఛేదించింది. ఈ మేరకు బాన్సువాడ పోలీసులను కామారెడ్డి జిల్లా ఎస్పి రాజేష్‌చంద్ర అభినందించారు. బుధవారం ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. 8 నెలల క్రితం లింగంపేట మల్కయ్య హైదరాబాద్‌కు బతుకు దెరువు నిమిత్తం వెళ్ళి 3 నెలలు అక్కడ కూలిపని చేసి తిరిగి ఇంటికి వచ్చి చిన్నకొడప్‌గల్ గ్రామంలో నివసిస్తున్నాడు. అతడి ఇంటికి వచ్చిన నాటి నుండి తన భార్య సుజాతకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధారావత్ కృష్ణతో సంబంధం ఉందని గుర్తించాడు. దీనిపై ఆయన తరుచూ భార్యతో గొడవలు పెట్టుకుటుంన్నాడు. చివరగా భార్య, భర్తలు ఇద్దరు కలిసి తమ సంసారం చక్కబడడం గురించి సెక్రెటరీ కృష్ణను చంపేయాలని నిర్ణయించుకున్నారు. వారి కులస్థులైన ఏరనోళ్ళ బాలరాజ్, మల్కయ్యల సహాయంతో పథకం పన్ని ఈనెల 5న సుజాత ద్వారా మృతుడు కృష్ణను ఇంటికి పిలిపించారు. ఇంటికి వచ్చిన కృష్ణపై నలుగురు కలిసి కత్తి, గొడ్డలి, ఇనుప రాడ్డు, రోకలితో విచక్షణ రహితంగా కొట్టి చంపేశారన్నారు. తర్వాత కృష్ణ మృతదేహాన్ని, అతని మోటార్ సైకిల్‌ను గ్రామ సమీపంలోని రెడ్డి చెరువు నీటిలో పడేశారు. హత్యకు వాడిన కత్తి, గొడ్డలి, ఇనుపరాడ్డు, రోకలి, రెండు మోటార్ సైకిళ్ళు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్పి వెళ్ళడించారు. కేసును ఛేదించిన డీఎస్పీ విఠల్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సిఐ రాజుష్, పిట్లం ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## జూన్ 18న జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జల్లాలోని నిరుద్యోగ యువకులకు వివిసి మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ లో ఉద్యోగాలు కల్పించుటకు జూన్ 18న బుధవారం రోజున రూమ్ నెంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు బుధవారం తెలిపారు. వివిసి మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలో 60 ఈవి సర్వీస్ టెక్నిషియన్, ఆటోమేటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు 10వ తరగతి , ఐటిఐ/ డిప్లమా, డీగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 1830 లోపు ఉండాలని, వీరికి వేతనం 12 నుంచి 15 వేల రూపాయల మధ్య ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 18 ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7729992061, 9246 26743 నందు సంప్రదించాలని జిల్లా అధికారి వై.తిరుపతిరావు తెలిపారు.

## మత్స్య గిరీంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి:ఎమ్మెల్యే కవ్వంపల్లి



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శ్రీమత్స్య గిరీంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామంలోని మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నూతన పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి ఇప్పటికే వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేశానని, ఇక ముందు సైతం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కొత్తగట్టు ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఎంతో ప్రాశస్త్యం గల కొత్తగట్టు ఆలయానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై కొత్త పాలకవర్గం దృష్టి సారించాలని సూచించారు. అంతకు ముందు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.సుధాకర్ , ధర్మకర్తల మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా కొత్తగట్టు గ్రామానికి చెందిన కోరెం రాజిరెడ్డి, ధర్మకర్తలుగా తాడిచెర్ల తిరుపతి, ఎడ్ల తిరుపతి, రామగిరి తిరుమల, కె.రత్నం, కె.లక్ష్మణరావు, ఎం. రవీందర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు, మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడఃవ, కాంగ్రెస మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, దేవస్థానం మాజీ చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు అజయ్, కోరెం రాజిరెడ్డి, బండారు తిరుపతి, కవ్వ స్వప్న, చింతరెడ్డి పద్మ, మొలంగూర్ సదానందం, ప్రశాంత్‌లున్నారు.

## స్కూల్ బస్సుల ఫిట్నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలి- పి.రంగా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** స్కూల్ బస్సుల ఫిట్నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి పి.రంగా రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 12 నుంచి పాఠశాలలు ఇతర విద్యాసంస్థలు పునప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని విద్యా సంస్థల యాజమాన్యులు తమ యొక్క స్కూల్ బస్సులు ఇతర వాహనాల ఫిట్నెస్ (వాహన సామర్థ్య పరీక్ష) రెన్యువల్ చేసుకోవాలని అన్నారు .ప్రతి స్కూల్ బస్ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 35 కు అనుగుణంగా నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో అపరాధ రుసుము రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫార్సు చేయడం జరుగుతుందని జిల్లా రవాణా అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## పోషణతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం : కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా మహిళా అబివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమన్ని ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామములో నిర్వహించారు.ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో పోషణతో కూడిన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని, అంగన్వాడి కేంద్రాలలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క నమోదులు పెంచడం మరియు పిల్లల యొక్క ప్రీస్కూల్ హాజరును పెంచడమే అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈవిధంగా పిల్లలకు అమ్మ ఒడి తరువాత, అంగన్ వాడి బడి తర్వాతి ఒడిగా ఉంటుందని అన్నారు. ఇలాంటి మెరుగైన సేవలను అంగన్వాడీ కేంద్రం ద్వారా అందజేయడం జరుగుతుందని అందుకని ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమకు దగ్గరగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్ వాడి కేంద్రములో ఏర్పాటు చేసిన బడి గంటను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూధన్, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్, సిడిపిఓ వాణిశ్రీ, సూపర్వైజర్లు పవిత్ర, లత, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పిల్లలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల నిర్మూలనకు కఠిన చర్యలు: కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో డ్రగ్స్, గంజాయి,కల్లుదుకాణల్లో అల్ప్రాజోలం లాంటి వాడకాన్ని పూర్తిగా అంతం చేసేందుకు ఏలాంటి చర్యకైన వెనుకేయమని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను నార్కోటిక్ డిఎస్పీ పుష్పన్ కుమార్‌తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నేటి యువతకు శాపంగా మారిన డ్రగ్స్ గంజాయిని నివారించేందుకు జిల్లాలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. నార్కోటిక్ డిఎస్పీ పుష్పన్ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల వినియోగాన్ని అంతం చేసేందుకు రాష్ట్ర ప్రభు త్వం చేపడుతున్న చర్యలను కలెక్టర్ మను చౌదరికి పూర్తిగా వివరించారు.

## ప్రభుత్వ పథకాలు ప్రతి మహిళకూ చేరాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** స్వయం సహాయ సంఘాలకు ప్రభుత్వం నుంచి వస్తున్న వివిధ రకాల పథకాలు ప్రతి మహిళకూ చేరేలా గ్రామ సంఘం పదాధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామైక్య సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు ఎంపిడివో కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల్లో నిర్ణీత సభ్యులు కంటే తక్కువ సంఖ్య లేకుండా చూడాలని సూచించారు. దివ్యాంగులకు 60 నుంచి 65 సంవత్సరాల లోపు, వృద్ధ మహిళలకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులను, దివ్యాంగులను సభ్యులుగా చేర్చుకునే బాధ్యత వివోలపై ఉందన్నారు. మహిళా సంఘం అంటే ఒక నమ్మకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావివ్వకూడదని సూచించారు. పది పూర్తి చేయని సభ్యులు ఉంటే ఓపెన్ స్కూల్‌లో చేరి పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతి సభ్యురాలు బుక్ కీపింగ్, అకౌంటింగ్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని, సంఘాల్లోని ఖాతా పుస్తకాలను ప్రతి ఒక్కరూ పరిశీలించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపిడివో విజయ్ కుమార్, ఏపిఎం రాంమోహన్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి

- ఆర్‌టిసిలో విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలి
- ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ విద్యార్థుల బస్ పాస్ చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ కరీంనగ్ జిల్లా సమితి ఆద్వర్యంలో రీజినల్ మేనేజర్ బి.రాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా ఏఐఎస్ఎఫ్ అధ్య క్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మ చ్చ రమేష్‌లు మాట్లాడుతూ తెలంగాణలో నిపది లక్షలకు పైగా పేద, మధ్య తరగతి గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి ఆర్టీసీ బస్సుల ద్వారా పట్టణాలకు వెళ్తుంటారని పేర్కొన్నారు. ఈ చార్జీల పెంపు ద్వారా వారిపై పెనుభారం పడుతుందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం నెలకు రూ. 400 ఉన్న బస్ చార్జీని రూ.600కు పెంచుతూ 3 నెలల ప్యాకేజీని రూ.1200 నుంచి రూ.1800 పెంచుతూ 20 శాతం పైగా చార్జీలను పెంచి పేద మధ్య తరగతి విధ్యార్థులపై ఆర్థిక భారం మోపారన్నారు. ప్రభుత్వం విధ్యార్థులకు ఇప్పటికే ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లను ఇవ్వకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రస్తుతం బస్ చా ర్జీలను పెంచడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా బస్సు చార్జీలను పెంచామంటే అదే విధం గా విధ్యార్థులకు స్కాలర్‌షిప్‌లను సైతం పెంచాలన్నారు. ఆర్టీసీలో విధ్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, పెంచిన 20 శాతం బస్సు ఆర్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు కేషబోయిన పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యం

మంత్రి అడ్లూరీ లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్యాంసుందర్ రెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం తరపున మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ జిల్లా కలెక్టర్,ఆర్డీవోతో కలిసి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనందుకు చాలా సంతోషంగా ఉందని, ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి పేదింటి వారి సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టి దాన్ని అమలు చేస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని,ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందని,ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఆరువందల స్క్వేర్ ఫీట్స్లో ఇంటి నిర్మాణం చేపట్టాలని దానికి అనుగుణంగా నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని,పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో కొంత మంది లబ్ధిదారులు ఇంటి నిర్మానాణాలు ప్రారంభించడం లేదని,వారు కూడా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని,ఇంకా ఎవరైనా అర్హత ఉండి ఇల్లు రాని వారు ఉంటే నన్ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ,కలెక్టర్ బి సత్యప్రసాద్ ,ఆర్డిఓ మధు సూదన్ ,ఎంపీడీవో రామ్ రెడ్డి ,తహసిల్దార్ వరందన్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి ,ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఇసుక సరఫరా

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మైనింగ్, రెవెన్యూ, గృహ నిర్మాణ సంస్థ, ఇంజనీరింగ్ అధికారులతో వివిధ రకాల ప్రభుత్వ భవనాలు, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా విధానంపై సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా నిర్మూలించేందుకు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాతో టోకెన్ల జారీ విధానంపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మ్యాపింగ్ చేయాలని సూచించారు. లబ్దిదారుని గృహ నిర్మాణ అవసరాన్ని బట్టి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఈలు ఇసుక టోకెన్ల జారీని చేపట్టాలన్నారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్న ఇసుకపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, మైనింగ్ శాఖ ఏడి రాఘవరెడ్డి, హౌసింగ్ పిడి గంగాధర్, పలు విభాగాల ఇంజనీరింగ్ అధికారులున్నారు.

## త్వరలో జిల్లా పోలీస్ శాఖలో బదిలీలు...

- ఇద్దరు సీఐలు, 6గురు ఎస్సైల బదిలీలు
- స్థానిక ఎన్నికల ముందు తమ మార్కు
- కోసం ప్రజాప్రతినిధుల ఆరాటం



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లాలో పోలీస్ శాఖలో బదిలీలు జరుగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు జూన్ నెలా ఖరులేదా జూలైలో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం జరుగుతున్న దృష్ట్యా చట్ట సభల ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. తహసీల్దార్, ఎంపిడివో, ఎస్సైలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకంగా ఉండగా లా అండ్ ఆర్డర్ మెయింటెన్ చేసే పోలీస్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుంది. అయితే ముందుగా పోలీస్ శాఖలో బదిలీలు చేట్టి, అసెంబ్లీ ఎన్నికల ముందు చేపట్టిన తహసీల్దార్ల బదిలీలు చేపట్టానున్నారు. జగిత్యాల జిల్లా 3పూర్తి స్థాయి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా నాలుగు మండలాలతో 2 అసెంబ్లీ నియోజకవర్గాలతో విస్తరించి ఉన్నది. ధర్మపురి, జగిత్యాల కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో ఉండగా కొడిమ్యాల, మల్యాల మండలాలు చొప్పదండి నియోజకవర్గం , మేడిపల్లి, కథలాపూర్ వేములవాడ నియోజకవర్గంలో ఉన్నాయి. జగిత్యాల జిల్లాకు నూతనంగా కేబినేట్ మంత్రి పదవి ధర్మపురి ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, జగిత్యాల ఎంఎల్ఏ బిఆర్ఎస్ నుంచి గెలుపొంది అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరగా, కోరుట్ల ఎంఎల్ఏ డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బిఆర్ఎస్ పార్టీకి, వేములవాడ, చొప్పదండి ఎంఎల్ఏలు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. సీఐల, ఎస్సైల బదిలీల నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలమైన వారికోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్ సీఐ ల బదిలీలు జరిగి కొత్తవారు జాయిన్ కాగా, జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీలు జరిగే అవకాశాలున్నట్లు తెలిసింది. ఎస్బిఐ, సిసిఎస్, సీఐలు బదిలీల కోసం ప్రజాప్రతినిధుల వద్ద ఎవరి ప్రయాత్నాలు వారు ముమ్మరం చేస్తున్నట్లు విశ్వానీయసమాచారం. ఎస్బిఐ కోరుట్ల కోసం, సీసీఎస్ సీఐ వేరే చోటు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎస్సైల బదిలీలు పెద్ద మొత్తంలో జరుగనున్నట్లు జిల్లాలో టాక్ వినిపిస్తోంది. జగిత్యాల రూరల్ ఎస్సై సుధాకర్‌ను రాయికల్ బదిలీ చేసి , రాయికల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుధీర్ రావును జగిత్యాల రూరల్‌కు బదిలీ చేయాలని, ఒకవేళ రూరల్ ఎస్సై సుధాకర్ రాయికల్‌లో సర్దుబాటు కాకపోతే ధర్మపురి నియోజకవర్గంలోని ఒక ఎస్సైని తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరంగా నడుస్తున్నట్లు తెలిసింది. జగిత్యాల టౌన్‌లో పనిచేస్తున్న ఒక ఎస్ఐ పెగడపల్లికి ట్రై చేస్తున్నట్లు, అయితే సస్పెండ్ అయి మళ్లీ విధుల్లో జాయిన్ అయినా ఎస్ఐ పెగడపల్లి స్టేషన్ ఇవ్వాలని కోరుతున్నట్లు, బుగ్గారం ఎస్ఐ మేడిపల్లికి బదిలీ కోసం ఒక నాయకుడి ద్వారా వేములవాడ ఎంఎల్ఏ కాన్సెంట్ తీసుకున్నట్లు పోలీస్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇవేకాకుండా కొంతమంది ఎస్ఐలు బదిలీలు అయ్యే అవకాశాలు లేకపోలేదన్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే జిల్లాలో ప్రొహిబిషన్ ఎస్ఐలకు పోస్టింగ్‌లు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. ఎవరెన్ని ప్రయత్నాలు చేసుకుంటున్న జిల్లా మంత్రి కాన్సెంట్ లేకుండా బదిలీలు జరిగే అవకాశాలు లేవని పోలీస్ శాఖలో చర్చ జోరుగా నడుస్తోంది.




## జగిత్యాలకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జిల్లా కేంద్రం నుండి టౌన్ హాల్ వరకూ బైక్‌ర్యాలీ

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** రాష్ట్రమంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటిసారిగా జగిత్యాల జిల్లా కేంద్రానికి అడ్లూరి లక్ష్మ న్‌కుమార్ విచ్చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుండి టౌన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించగా మాజీ మంత్రివర్యులు జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులతో కలిసి ర్యాలీ ఘనంగా విజయవంతం చేశారు. పూలమాలలతో, శాలువాతో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌కు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టౌన్ హాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జూన్ 20న గిరిజన గ్రామాల్లో .. స్పెషల్ క్యాంపు నిర్వహణ

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జూన్ 20న గిరిజన గ్రామాల్లో స్పెషల్ క్యాంపు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పీఎం జన్ మాన్, డి.ఏ.జే.జి. యూ.ఏ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్ మాన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ్ మహా అభియాన్), డి.ఏ.జే.జి. యూ.ఏ ( దరతి ఆభా జనజాతి గ్రామ ఉత్కర్ష అభియాన్) కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్న బట్టుపల్లి గ్రా మాన్ని ఎంపిక చేసుకున్నామని, వీటిలో ప్రజలందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆయుష్మాన్ కార్డ్ , రేషన్ కార్డు కిసాన్ కార్డు, ఇతర సదుపాయాలను కల్పించాల్సి ఉంటుందని అన్నారు. ప్రజలందరికీ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం అందించేందుకు అవసరమైన మీసేవ సెంటర్ తో సహా సంబంధిత గ్రామాలలో జూన్ 20 నాడు క్యాంప్ ఏర్పాటు చేయాలని, అర్హులకు ఎవరికైనా రేషన్ కార్డు లేని పక్షంలో వారిచే దరఖాస్తు చేయించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో అంగన్ వాడి కేంద్రాలలో టీచర్ హెల్పర్ అందుబాటులో ఉన్నారా లేదా పరిశీలించాలని లేనిపక్షంలో ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. 6 సంవత్సరాల లోపు గల పిల్లలకు పౌష్టికాహారం అందుతుందో డబుల్ చేక్ చేయాలని అన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్ర మం క్రింద 100 శాతం టీకాలు వేయించాలని , 102 వాహనాల వినియోగం పరిశీలించాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి నెంబర్ వచ్చేలా చూడాలని అన్నారు. ప్రజలందరికీ జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయాలని, పీఎం విశ్వకర్మ ముద్ర స్టాండప్ ఇండియా వంటి వివిధ పథకాల కింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ లీడ్ బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. 100 రోజుల ఉపాధి హామీ పని అమలు తీరు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. పోడు భూముల కింద పట్టాలు జారీ చేసిన లబ్ధిదారులతో కూడా ఆ రోజు సమావేశం ఏర్పాటు చేసి వారికి ఇంది రా గిరి సౌర జల వికాసం పథకం పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కే.సంగీత ,జిల్లా అటవీ అధికారి శివ య్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయండి

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని గోదావరి ఖని బస్టాండ్ కాలనీ లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని బుధవారం సింగరేణి ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ డిజిఎం గారి దృష్టి కి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తీసికెళ్ళగా, డిజిఎం సివిల్ వెంటనే బస్టాండ్ కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా డిజిఎం సివిల్ డ్రైనేజీ వ్యవస్థ ను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్ సోహెల్, సివిల్ డిపార్ట్మెంట్ ఏఐటియుసి కార్యదర్శి దాసరి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ బొల్లి శ్రీనివాస్, సివిల్ సూపర్ వైజర్ బక్కిరెడ్డి, వెంకటేష్ తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/రామడుగుః** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ఎకనామిక్ హిందీ, తెలుగు బోధించేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులకు బిఈడీతో పాటు టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 16న మోడల్ స్కూల్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

# రీల్

## ముస్సోరిలో మెగాస్టార్ షూటింగ్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 157వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముస్సోరిలో జరుగుతోంది. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. అనిల్ రావి పూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన రెండవ షెడ్యూల్ ఇక్కడ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కీలకమైన సన్నివేశాలతో పాటు హాస్యభరితంగా సన్నివేశాలను కూడా ముస్సోరిలోనే చిత్రీకరిస్తామని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి 2026 సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.




## 'అఖండ–2' టీజర్‌కు భారీ రెస్పాన్స్

బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ2 సినిమా టీజర్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. ఈ టీజర్ కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు ఏకంగా 28 మిలియన్ వ్యూస్ తో దూసుకుపోతోంది. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్ లో వచ్చిన అన్ని సినిమాలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. అఖండ సినిమా కూడా భారీ హిట్ అవడంతో దీనికి సీక్వెల్ గా అఖండ 2 సిద్ధం చేస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ సినిమాకు నిర్మాతలు. నందమూరి తేజస్విని సమర్పించుకుంటారు.ఇందంలో బాలకృష్ణ పాత్ర ఎంతో వైవిధ్యంగా ఉంటుందని, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' కొత్త షెడ్యూల్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్, మైత్రి మూవీ మేకర్స్ సెన్సేషనల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ రోజు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో అఫీషియల్‌గా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీతో సెట్స్‌లో జోష్ నెలకొంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్ తో పాటు, సినిమాలోని ప్రముఖ తారాగణం కూడా షూటింగ్‌లో పాల్గొంటోంది.మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఆయనంక బోస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్. రామ్‌లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు.

## 'కట్టలన్'లో సునీల్‌ది కీలక పాత్ర



బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మార్కో విజయం తర్వాత క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత షరీఫ్ మహమ్మద్, తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా కట్టలన్ ను అనౌన్స్ చేశారు. ఇది పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న హైయాక్షన్ థ్రిల్లర్. ప్రముఖ నటుడు ఆంటోనీ వర్గీస్ (పేపే) హీరోగా నటిస్తున్నారు. దర్శకత్వం పాల్ జార్జ్.ఈ చిత్రంలో కీలక పాత్రలో సునీల్ నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. సునీల్ స్టయిలీష్ లుక్‌లో కనిపిస్తున్న అనౌన్స్ మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ మూవీకి కాంతార 2 ఫేం అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనంగా మారింది. వర్షంలో తడిచిన పేపే, చుట్టూ పడి ఉన్న మృతదేహాలు, ఏనుగు దంతాల మధ్య నిలబడి వుండటం కథలో ఉండబోయే వైలెన్స్ సూచిస్తోంది. మార్కో స్థాయిని మించి ఉండబోతోందని సంకేతాలు ఇస్తోంది. జైలర్, లియో, జవాన్, కూలీ లాంటి చిత్రాలకు టైటిల్ ఫాంట్స్ డిజైన్ చేసిన ఐడెంట్ ల్యాబ్స్ ఈ సినిమాకి కూడా టైటిల్ డిజైన్ చేశారు.

## 'వార్ 2' కోసం డబ్బింగ్ చెప్తున్న ఎన్టీఆర్



అయాన్ ముఖర్జీ దర్శకత్వంతో యష్ రాజ్ ఫిలమ్స్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వార్ 2'. ఈ మూవీని ఆగస్ట్ 14న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ భారీ పాన్‌ఇండియా యాక్షన్ దృశ్యాన్ని చూసేందుకు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'వార్ 2' టీజర్ దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ టీజర్ ఒక్కసారిగా సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. ఇక తాజాగా వార్ 2 డబ్బింగ్ పనుల్ని షురూ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఈ మూవీ కోసం డబ్బింగ్ పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న 'వార్ 2'లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీలు ప్రధాన పాత్రలను పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం ఆగస్టు 14, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## సూర్య 46 షూటింగ్ ప్రారంభం



వైవిధ్యమైన పాత్రలు, చిత్రాలతో వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన తమిళ అగ్ర కథానాయకుడు సూర్య, తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేస్తున్నారు. సూర్య 46వ చిత్రంగా రూపొందుతోన్న ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక ద్విభాషా చిత్ర షూటింగ్‌ను నేడు ప్రారంభించారు. ప్రతిభావంతులు సూర్య, వెంకీ అట్లూరి మొదటిసారి చేతులు కలపడంతో.. కేవలం ప్రకటనతోనే తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలలో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అందరి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా 'వేడుక, భావోద్వేగం, వినోదం వైపు తొలి అడుగు' అంటూ సూర్య ముందుకి అడుగు వేస్తున్న అద్భుతమైన పోస్టర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

## 'కుబేర' నుంచి పిపి..డుమ్..డుమ్ సాంగ్ రిలీజ్




ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల 'కుబేర' సినిమా ప్రమోషన్స్ పాన్‌ఇండియా స్థాయిలో జరుగుతున్నాయి. మూవీ టీం వివిధ నగరాల్లో పర్యటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రమోషన్లలో భాగంగా, ఈ సినిమా నుండి థర్డ్ సింగిల్ పీ పీ డుమ్ డుమ్ ముంబైలో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ ట్రాక్‌ను అఫీషియల్‌గా పబ్లిక్‌కి రిలీజ్ చేశారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పెప్పీ బీట్స్ తో ఈ ట్రాక్‌ను అద్భుతంగా కంపోజ్ చేశారు. ఈ కంపోజిషన్ సింగిల్ లైఫ్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈ పాట రష్మిక మందన్న పాత్ర చుట్టూ చిత్రీకరించారు. ఆమె గరల్స్ హాస్టల్‌లో తన గ్యాంగ్‌తో కలిసి 'సింగిల్‌గా ఉండటమే హాయిగా జీవించడానికే మార్గం' అనే సందేశాన్ని చెప్పడం అలరించింది. చైతన్య పింగళి రాసిన సాహిత్యం అద్భుతంగా వుంది. ఇంద్రావతి చౌహాన్ తన వాయిస్‌తో పాటకు జీవం పోసింది. రష్మిక తన పాత్రలో ఒదిగిపోయింది. పెళ్లికి ఒత్తిడి చేసేవారి మాటలతో ప్రభావితం కాకుండా ఉండే ప్రతి అమ్మాయి స్ఫూర్తిని ప్రజెంట్ చేసింది. కుబేరలో ప్రతి పాట డిఫరెంట్‌గా ఉంటూ కథ నేపథ్యాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. దేవీ శ్రీ ప్రసాద్ సూపర్ హిట్ ఆల్బం అందించారు. ఈ చిత్రానికి తగిన భావోద్వేగాలు, జోనర్‌కు తగ్గట్టు పాటలు రూపొందించి, కథను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా చేశారు. ఈ చిత్రంలో జిమ్ సర్బ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం జూన్ 20న థియేటర్లలోకి వస్తోంది.

## 'తమ్ముడు' సినిమా హిట్ కావాలని పూజలు



నితిన్ హీరోగా నటించిన తమ్ముడు సినిమా సక్సెస్ కావాలని దర్శకుడు శ్రీరామ్ వేణు స్వయంభు శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీసమేతంగా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఈ ఆలయం జంగారెడ్డిగూడెంలో ఉంది. దర్శకుడు శ్రీరామ్ వేణుతో పాటు సినిమాటోగ్రాఫర్ గుహన్ కూడా ఉన్నారు. తమ్ముడు సినిమా పెద్ద హిట్ కావాలని వారు మొక్కుకున్నట్టు తెలిపారు. జూలై 4న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమానం దిల్ రాజు నిర్మించారు.



వేసవి సెలవుల్లో వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి మాల్దీవ్స్‌లో ఎంజాయ్ చేస్తున్నారు. ఇద్దరు కలసి బీచ్‌లో దిగిన ఫొటో ఒకటి మీడియాకు షేర్ చేశారు.

## 'స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తెలంగాణ

### సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో యువతకు శిక్షణ : మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తెలంగాణను మార్చేందుకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు. 'సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం' అని హామీ ఇచ్చారు. 'మా కున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు. పరిశ్రమలకు అవసరమైన రెడిమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా మా ప్రభుత్వం తీసుకుంది' అని వివరించారు. 'సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో ఉన్న డిమాండ్ కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలన్నది మా ఆకాంక్ష. 10వేల మంది యువత శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలి' అని సమా



వేశానికి హాజరైన మలేషియాకు చెందిన దిగ్గజ సంస్థ స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సిఇఒ కెన్ కూను కోరారు. 'తెలంగాణను స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. మా వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చి దిద్దేలా ప్రత్యేక కరిక్యులమ్ ను రూపొందిస్తాం. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడ శిక్షణ.. మిగిలిన కాలం తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం' అని కెన్ కూ.. మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన కెన్ కూ మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా, వరల్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేషియా విభాగం ప్రెసిడెంట్ మారుతీ, ఇతర ప్రతినిధులు మహేష్ నటరాజ్, వాకిటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







## తప్పులు ఇంజనీర్లవా?

**(మొదటి పేజీ తరువాయి)**

కూనంనేని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినప్పటికీ ఒక ఎకరాకు సైతం నీళ్లు ఇవ్వకపోగా వేలాది కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకు కరెంటు చార్జీలు రూ.10వేల కోట్లు చెల్లించాలని, చేసిన అప్పులకు గాను మరో రూ.15వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లించాల్సిన దుస్థితి తలెత్తిందని కూనంనేన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే విధంగా ఆర్థిక వనరులను సృష్టించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుంటే మిత్రపక్షమైన తాము కాంగ్రెస్ పార్టీని ఎండగడతూనే ఉంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా కాళేశ్వరాన్ని రూపొందించుకోవాలని, లేని పక్షంలో సిపిఐ ఆందోళనకు సైతం వెనుకడదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చే క్రమంలో నిష్పాక్షపాతంగా వ్యవహరించాలన్నారు. జర్నలిస్టులకు ఒక పాలసీ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### ఎర్రదండుతో ఎరుపెక్కిన పాలమూరు

భరత గడ్డ విముక్తి పోరులో భారత కమ్యూనిస్టు పార్టీ నడిపిన విరోచిత త్యాగాలతో ఎరుపెక్కిన కమ్యూనిస్టు ఉద్యమం చారిత్రాత్మకం, చిరస్మరణీయమైనదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొనియాడారు. సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సిపిఐ కార్యాలయం నుండి తెలంగాణ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా ,అశోక్ టాకీస్ చౌక్ మీదుగా వందలాదిమంది ప్రజలు కార్మికులు సిపిఐ శ్రేణులతో అల్మాస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రజా ప్రదర్శనతో ఎర్రజెండాలతో కదంతొక్కడంతో పాలమూరు పట్టణం ఎరుపెక్కింది. ప్రదర్శనలో ప్రజానాట్యమండలి కళాకారులు డప్పుల నృత్యాలతో అలరించారు. అనంతరం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభలో కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారీ రాజకీయాలలో రోజుకో పార్టీ మారుతూ, పూటకో పార్టీ కండువా కప్పుకుంటూ అధికార పదవులకు వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సొంత ఆస్తులు పంచుతూ, జైలు నిర్బంధాలను అక్రమ కేసులు లెక్కచేయకుండా ప్రాణ త్యాగాలకు సైతం వెరవని త్యాగధనులు కమ్యూనిస్టులేనని అన్నారు.

### ఎన్నికల హామీలను అమలు చేయాలి : ఎం.బాలనరసింహ్మ

సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహా ప్రసంగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వీరోచిత పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, రాష్ట్ర సమితి సభ్యులు హెచ్. ఆనంద్‌జీ, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి బి. పరమేశ్వర్ గౌడ్, సిపిఐ సీనియర్ నాయకులు ఉషనయ్య, డిసిసిబి మాజీ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు పి.సురేశ్, డి.రాము, గోవర్ధన్, అల్వాల్ రెడ్డి, భాగీ, కృష్ణ, చాంద్ బాషా, సత్యనారాయణ రెడ్డి, శ్రీను, సంతోష్, రాజు లక్ష్మణ్, రాజశేఖర్, మహేశ్, ఆంజనేయులు, చెన్నయ్య, దేవానంద్, గోపాల్ నాయక్, నరసింహ, యాదయ్య, రఘుపతి, బాల నరసయ్య, ఆనంద్, బసవరాజ్, శ్రావణ్, పద్మావతి, భార్గవి, ఇందిరా, సత్యమ్మ, పద్మ, వరలక్ష్మి , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా–చైనా ఒప్పందం

**(మొదటి పేజీ తరువాయి)**

ఇరు దేశాల ప్రతినిధులూ ప్రకటించారు. రెండు రోజులపాటు లండన్‌లో అమెరికా–చైనా మధ్య మొట్టమొదటిసారి జరిగిన ఆర్థిక, వాణిజ్య సంప్రదింపుల్లో కొత్త పురోగతి సాధించామని, ఇరు దేశాల సమస్యలను ఒక మార్గదర్శక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పరిష్కరించుకోవాలని సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెప్పారు. ట్రంప్ టారిఫ్‌ల వివాదంవల్ల రెండు దేశాలమధ్య ఆర్థిక ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. పరస్పర గౌరవం, సమానస్థాయీ ఒప్పందంతో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని చైనా మొదటినుండీ ట్రంప్‌కు హెచ్చరికలు చేస్తూ వచ్చింది. ఈ వివాదంవల్ల స్టాక్ మార్కెట్లు కూడా కుప్పకూలిన పరిస్థితి ఏర్పడింది. కానీ రెండు దేశాల ప్రతినిధులూ బుధవారం నాడు ఈ ప్రకటన చేయడంతో ఆసియా మార్కెట్లు గణనీయంగా పుంజుకున్నాయి. ఈనెల ఐదో తేదీన చైనా, అమెరికా దేశాధిపతులు జిన్ పింగ్, డోనాల్డ్ ట్రంప్ ఫోన్ సంభాషణ ద్వారా ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. అందుకు అనుగుణంగా లండన్ వేదికగా ఈ చర్చలు పూర్తయ్యాయి. ఇంతకుముందు జెనీవాలో జరిగిన సంప్రదింపుల్లో 100 శాతం పైగా ఉన్న టారిఫ్‌లను 90 రోజులపాటు అమలు చేయకుండా వాయిదా వేయాలని రెండు దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల అధినేతలూ జూన్ 5వ తేదీన వ్యూహాత్మక ఏకాభిప్రాయానికి వచ్చారని, ఆ మార్గదర్శకత్వంలోనే ఈ సంభాషణలు జరిగాయని చైనా ఉప ప్రధానమంత్రి హే లిఫెంగ్ చెప్పారు. చైనా మొదటినుండీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల్లో స్థిరమైన, స్పష్టమైన వైఖరితో వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. పరస్పర సహకారం రెండు దేశాలకూ మేలు చేస్తుందని, ఘర్షణ రెండు దేశాలకూ హాని కలిగిస్తుందని, యుద్ధంలో విజేతలంటూ ఎవరూ ఉండరని ఆయన మరోసారి గుర్తుచేశారు. చైనా ఎప్పుడూ ఒకరిని చూసి భయపడదు, పరస్పర ప్రయోజనాలకు వీలుగా వాణిజ్య సమస్యలు పరిష్కరించుకోవాలి అని ఆయన అన్నారు. చైనా అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధి లీ చెంగాంగ్, చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెంటయో కూడా చర్చల్లో పాల్గొన్నారు. అమెరికా తరపున ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్, వాణిజ్యశాఖ ప్రతినిధి జమైసన్ గ్రీర్ పాల్గొన్నారు. బకింగ్‌హామ్ ప్యాలస్ సమీపంలో ఉన్న 200 సంవత్సరాలక్రితంనాటి లాన్‌కేస్టర్ హౌస్‌లో ఈ రెండు దేశాల ప్రతినిధులు చర్చలు జరిపారు.

### మా బంధం ఎక్సలెంట్ : ట్రంప్

అమెరికా–చైనా మధ్య ఆర్థిక,వాణిజ్య సమస్యలపై రెండు రోజుల లండన్ సమావేశంలో ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ తమ బంధం ఎక్సెలెంట్ అని పేర్కొన్నారు. రెండు దేశాలమధ్య ఒప్పందం కుదిరిందనీ, ఈ మేరకు చైనా ప్రభుత్వం అమెరికాకు అరుదైన ఖనిజ వనరులను సరఫరా చేస్తుందనీ, అందుకు ప్రతిగా అమెరికా కూడా చైనా విద్యార్థులను తమ విశ్వవిద్యాలయాలోకి అనుమతిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ భారీ ఎత్తున చైనాపై ప్రతీకార సుంకాలు విధించిన తర్వాత ప్రపంచంలో ఏ దేశం ప్రతిఘటించనివిధంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ దీటుగా ఎదురొడ్డి నిలబడ్డారు. ట్రంప్ బెదిరింపులకు లొంగేదిలేదని హెచ్చరించారు. ట్రంప్‌తో సమానంగా ప్రతీకార సుంకాలు విధించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రపంచదేశాలను కూడగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో ట్రంప్ తన హుందా తగ్గకుండా దిగివచ్చి జిన్‌పింగ్‌తో ఫోన్ సంభాషణలు చేశారు. లండన్ వేదికగా చర్చలు జరిపి టారిఫ్‌లుసహా ఇతర సమస్యల పరిష్కారానికి ఒక మార్గదర్శక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్న ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తానే పైచేయి సాధించానని ప్రకటించుకునేంకు సోషల్ మీడియాలో పోస్టింగ్ చేశారు.

## దయనీయ పరిస్థితులు

**(మొదటి పేజీ తరువాయి)**

విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఆలస్యం కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిహార్ ఉదాహరణను ఉదహరించారు, అక్కడ స్కాలర్‌షిప్ పోర్టల్ మూడు సంవత్సరాల నుంచి పనిచేయలేదని, 2021–22 నుంచి ఏ ఒక్క విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్ లభించలేదన్నారు. ఆ తర్వాత కూడా, స్కాలర్‌షిప్‌లు పొందుతున్న దళిత విద్యార్థుల సంఖ్య దాదాపు సగానికి తగ్గిందన్నారు. ఈ సంఖ్య 23 ఆర్థిక సంవత్సరంలో 1.36 లక్షల నుండి 24 ఆర్థిక సంవత్సరంలో 0.69 లక్షలకు చేరుకుంది. విద్యార్థులను అవమానపరిచేలా స్కాలర్‌షిప్ ఉందని కూడా విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు ఈనెల 10న మోదీకి రాసిన లేఖలో రాహుల్ వెల్లడించారు. తాను కేవలం బిహార్ పరిస్థితులను మాత్రమే ఉదహరించినప్పటికీ ఈ పరిస్థితులు దేశ వ్యాప్తంగా ఉన్నాయన్నారు. ఈ వైఫల్యాలను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే రెండు చర్యలు తీసుకోవాలని కోరుతున్నానన్నారు. మంచి మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, ఆహారం, విద్యా సౌకర్యాలను నిర్ధారించడానికి దళిత, షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఆర్థికంగా వెనుకబడిన తరగతి (ఇబిసి), ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి), మైనారిటీ వర్గాల విద్యార్థుల కోసం ప్రతి హాస్టల్‌ను ఆడిట్ చేయాలని గాంధీ పిలుపునిచ్చారు. లోపాలను సరిదిద్దేందుకు తగిన నిధులను కేటాయించాలని సూచించారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను సకాలంలో పంపిణీ చేయాలని, స్కాలర్‌షిప్ మొత్తాలను పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయడం ద్వారా వాటి అమలును మెరుగుపరచాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. అట్టడుగు వర్గాల యువత అభివృద్ధి చెందకపోతే భారతదేశం పురోగతి సాధించదని మీరు అంగీకరిస్తున్నారని తాను కచ్చితంగా చెప్పగలనన్నారు. ఈ విషయాలపై సానుకూల స్పందన కోసం ఎదురు చూస్తున్నానని రాహుల్‌గాంధీ మోడీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్‌సి విభాగం చీఫ్ రాజేంద్ర పాల్ గౌతమ్, ఆదివాసీ కాంగ్రెస్ చీఫ్ విక్రాంత్ భూరియా, ఎన్‌ఎస్‌యుఐ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ సంయుక్త విలేకరుల సమావేశంలో కూడా ఈ అంశాలను లేవనెత్తారు. కన్హయ్య కుమార్ మాట్లాడుతూ దళిత, వెనుకబడిన, గిరిజన, అత్యంత వెనుకబడిన, మైనారిటీ తరగతుల విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను రాహుల్‌గాంధీ నిరంతరం కలుస్తున్నారని అన్నారు. ఈ తరగతులకు చెందిన విద్యార్థులను తాము కలసినప్పుడు వారు చెప్పే మొదటి విషయం ఏమిటంటే స్కాలర్‌షిప్ సకాలంలో అందడం లేదని అని అన్నారు. దేశంలో స్కాలర్‌షిప్ డ్రాప్ అవుట్ చాలా ఎక్కువగా ఉందని, ఎందుకంటే ప్రభుత్వం మొత్తం స్కాలర్‌షిప్ ప్రక్రియను ఒక శిక్షగా మార్చిందని మండిపడ్డారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఇతర సమస్యలు, హాస్టల్ పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి మోడీకి ఒక లేఖ రాశారని, అయితే, దీనిపై ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో రానున్న రోజుల్లో తెలుసుందన్నారు. దేశంలో విద్యార్థుల ఆత్మహత్య ఒక పెద్ద సమస్య అని కన్హయ్య అన్నారు. ప్రతి గంటకు ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. విద్యార్థుల ఆత్మహత్యలకు అతిపెద్ద కారణం చాలా మంది ఆర్థిక పరిస్థితి పేలవంగా ఉండటమేన్నారు. తల్లిదండ్రులు పిల్లల విద్య కోసం అధిక వడ్డీ రేట్లకు రుణాలు తీసుకుంటారని చెప్పారు. ఈ దేశంలో 'సమాన న్యాయం' పునాది సమాన విద్య హక్కుపై ఆధారపడి ఉందని భూరియా అన్నారు. పిల్లలకు సమాన విద్యను అందించలేకపోతే, దేశంలో సామాజిక విప్లవాన్ని తీసుకురాలేమని చెప్పారు. నేడు, ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల పిల్లలకు విద్యను దూరం చేస్తూ వారిని దోపిడీ చేస్తోందని ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com